త్వరలో వెలిగొండను పూర్తిచేస్తాం

- జిల్లా అభివృద్ధిపై సానుకూల దృక్పథంతో చర్చించాం
- సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం
- భూముల అక్రమాలపై సిట్ నివేదిక వచ్చాక చర్యలు
- ఆలయ భూములను కాపాడతాం
- ఇన్‌చార్జి మంత్రి రామనారాయణరెడ్డి

7

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

ప్రకాశం

జిల్లా వార్తలు

మంగళవారం 5, నవంబరు 2024



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి ఆనం, వేదికపై మరో మంత్రి డోలా, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎంపీ మాగుంట, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు

నిర్లక్ష్యం వీడండి!

అధికార యంత్రాంగానికి ఇన్‌చార్జి మంత్రి సూచన

'జిల్లా యంత్రాంగంలో అనేక శాఖల అధికారులు ఉంటారు. వారందరి తరఫున అంతిమంగా కలెక్టర్ అకౌంట్‌బులిటీగా ఉండాలి. ఇక్కడ చూస్తే ఇంకా పలువురు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొద్దిశాఖలపై సమీక్ష చేస్తేనే ఆ విషయం అర్థమవుతోంది. కొందరు అధికారుల పనితీరు నాకైతే సంతృప్తికరంగా లేదు' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్సీ సమావేశం నిర్వహించారు. అధికారులంతా నిర్లక్ష్యం వీడి బాధ్యతగా పనిచేయాలని ఆనం సూచించారు. శాఖల పరంగా అభివృద్ధి పనుల పురోగతి, సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగంపై తనకు ఉన్న అభిప్రాయాన్ని స్పష్టం చేస్తూ సున్నితంగానే హెచ్చరికలు చేశారు.

ఒంగోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి డీఆర్సీ సమావేశం సోమవారం సుదీర్ఘంగా నిర్వహించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, ఎస్పీ దామోదర్, జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు. తొలుత మంత్రి స్వామి జిల్లా వెనుకబాటుతనం, అభివృద్ధి చేయాల్సిన వెలిగొండతోపాటు ఇతర పలు అంశాలు, ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మొత్తం ఎనిమిది శాఖలకు సంబంధించి పలు

మిగతా 6వ పేజీలో

- అన్నిశాఖలకు కలెక్టర్ బాధ్యత వహించాలని స్పష్టం
- పలు సమస్యలు, అభివృద్ధి అంశాలను ఏకరువు పెట్టిన ప్రజాప్రతినిధులు
- డీసీసీబీ, డ్వామాలలో అవినీతిపై సమగ్ర విచారణకు ఎమ్మెల్యే జనార్దన్ డిమాండ్
- వెలిగొండ, ఇతర సాగు, తాగునీరు, రోడ్ల గురించి పలువురు శాసనసభ్యుల ప్రస్తావన

సత్వర చర్యలు తీసుకోవాలి

వెలిగొండ ప్రాధాన్యతను మంత్రి స్వామి, ఎంపీ మాగుంటతోపాటు పశ్చిమప్రాంత ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శాసనసభ్యులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలు, అభివృద్ధి అంశాలను ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, డ్వామాలలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు.. వాటిపై జరుగుతున్న విచారణల గురించి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వాటిలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. విచారణ తీరు సరిగా లేదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ చేయంచాలని కోరారు. కాగా అందరూ ప్రస్తావించిన అంశాలపై అధికారుల సమాధానాలపై స్పందించిన ఇన్‌చార్జి మంత్రి రామనారాయణరెడ్డి జిల్లా అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తూనే కొందరు అధికారులు, శాఖల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలసత్వం వీడి పనిచేయాలని యంత్రాంగాన్ని సున్నితంగానే హెచ్చరించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను వివరించారు.



ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ వద్ద శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక కాంతులు

6



కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా భక్తిభావం వెల్లివిరిసింది. శైవక్షేత్రాలు, శివాలయాలకు భక్తులు వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రికి మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. నిండు ముత్తైదువుగా జీవించేలా దీవించాలని ముక్కంటిని ప్రార్థించారు.



నాగుల చవితికి సిద్ధమైన ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద ఉన్న నాగేంద్రస్వామి ఆలయం

నాగమయ్యా.. ఆదుకోవయ్యా..

7

- నేడు నాగుల చవితి
- కార్తీకమాసంలో విశిష్ట పర్వదినం
- మొక్కులు తీర్చుకోనున్న మహిళలు



సీఎం దృష్టికి డీసీసీబీ అక్రమాలు

ఉన్నతాధికారుల పాత్రపై సీఎంవో ఆరా

- ఉద్యోగుల్లో అలజడి
- సహకారశాఖ అధికారులపై కలెక్టర్ సీరియస్
- ఐదేళ్లకు సంబంధించిన అన్ని పుస్తకాల పరిశీలన
- డిస్మిస్ ఉద్యోగికి జీతాలు చెల్లింపునకు బ్రేక్
- నేడు బ్యాంకు పాలక మండలి సమావేశం

ఒంగోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో పరిణామాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి వెళ్లాయి. బ్యాంకుపై ప్రభుత్వానికి ఫిర్యాదు, తదనుగుణంగా విజిలెన్స్ విచారణ నేపథ్యంలో సీఈవో కోటిరెడ్డిని అక్కడి బాధ్యతల నుంచి తొలగించడంతోపాటు శాఖపరంగా సెక్షన్ 51 విచారణ కోరుతూ కలెక్టర్ లేఖ రాసిన విషయం విదితమే. అయితే తగు స్థాయిలో చర్యలు లేవు. ఈ నేపథ్యంలో స్థానికంగా, అలాగే రాష్ట్ర స్థాయి సహకార అధికారుల వ్యవహారశైలిపై 'అక్కడంతే' శీర్షికన ఈనెల 2న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం అన్ని వర్గాల్లోనూ కలకలం రేపింది. దీంతో బ్యాంకులో అసలు ఏమి జరుగుతుందన్న దానిపై అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు విచారించడం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో

మిగతా 6వ పేజీలో

గౌరవించండి.. పనులు చేయండి

- జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి
- రెవెన్యూ, పోలీసు శాఖలపరంగా ఇబ్బందులపై ఎమ్మెల్యేల ఆవేదన
- ఆ సీఐ మాట విని మమ్మల్ని అనుమానించకండి
- ఎస్పీతో చెప్పిన ఇద్దరు ఎమ్మెల్యేలు

జిల్లా అధికారులకు ఇన్‌చార్జి మంత్రి స్పష్టమైన ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'ప్రజాప్రతినిధులను గౌరవించండి. వారు చెప్పిన సంక్షేమ, అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వండి. చట్టాలు, నిబంధనలకు లోబడి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చెప్పినవి చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో జిల్లా అధికారుల నుంచి గ్రామస్థాయి వరకు అందరూ సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత కూడా ఉంది' అని ఉన్నతాధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. తొలుత అధికారపార్టీ ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆయన అధికారులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. సోమవారం ఒంగోలు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి తొలుత ఎంపీ మాగుంట నివాసంలో తనను కలిసిన ఎమ్మెల్యేలతో మాట్లాడారు. అక్కడే మంత్రి స్వామిని అడిగి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అధికారుల పనితీరుపై సమాచారం తెలుసుకున్నారు. ఆతర్వాత డీఆర్సీ సమావేశంలో సమస్యలపై చర్చకు ప్రాధాన్యం ఇచ్చారు. ఐదుగురు టీడీపీ ఎమ్మెల్యేలు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు చెప్పిన విషయాలను

మిగతా 6వ పేజీలో

వాహనాల ఫిట్‌నెస్.. ఇక ప్రైవేట్!

గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో కేంద్రం | రవాణా శాఖలో కీలక మార్పులు | సాంకేతికతతో నిర్ధారణ



ఒంగోలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సరుకులు రవాణా చేసే వాహనాల ఫిట్‌నెస్ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించనున్నారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో అధికారులు ఇప్పటికే టెండర్లు కూడా ఆహ్వానించారు. జిల్లాలోని గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో ప్రైవేటు వారు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అక్కడ పూర్తి సాంకేతిక పద్ధతులలో వాహనాల ఫిట్‌నెస్ చూడనున్నారు. ఇక నుంచి వాహనదారులు రవాణా శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇప్పటికే రాష్ట్రంలో అనంతపురం, నంద్యాలలో ఇలాంటి ఫిట్‌నెస్ సెంటర్లను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. వాహనాలకు ఎలాంటి మరమ్మతులు ఉన్నా సాంకేతిక పద్ధతిలో గుర్తించి ఫిట్‌నెస్ ఉంటేనే సర్టిఫికెట్లు ఇస్తారు. ఎలాంటి చిన్న లోపాలు ఉన్నా అనుమతి లభించదు.

ఏడాదికి ఒకసారి తప్పనిసరి

జిల్లాలో వివిధ రకాల వాహనాలు సుమారు 30వేలు ఉన్నాయి. వీటికి బ్రేక్, ఫిట్‌నెస్ విషయాలను ప్రైవేటు ఏజెన్సీలు చూస్తాయి. సరుకు రవాణా చేసే ఆటోలు, లారీలు, కమర్షియల్ ట్రాక్టర్లు, పాఠశాల

మిగతా 6వ పేజీలో



6

పరదాల కింద చదువు.. వానొస్తే సెలవు

మర్రిపూడి మండలం కూచిపూడి జడ్పీ హైస్కూల్‌లో పరదాల కింద చదువుకుంటున్న విద్యార్థులు

నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామని గత వైసీపీ పాలకులు గొప్పలకు పోయారు. కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దామని ప్రగల్భాలు పలికారు. కానీ అదంతా ఉత్తిదేనన్న విషయం మర్రిపూడి మండలం కూచిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. గతంలో ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న దీన్ని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. కానీ వసతులు సమకూర్చడం మరిచారు. ఐదు నుంచి పదోతరగతి వరకూ కేవలం రెండు గదుల్లో నిర్వహించాల్సి వస్తోంది. అవి సరిపోకపోవడంతో ఉపాధ్యాయులు పరదాల కింద విద్యాబోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థులు అవస్థ పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా పాఠశాలకు సెలవు ప్రకటించాల్సి వస్తోంది.



టీడీపీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, కలెక్టర్, ఎస్పీలతో సమావేశమైన మంత్రులు ఆనం, స్వామి

దొంగలు దొరికారు

- ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు
- రూ.23.18 లక్షల సొత్తు, 1.350 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్
- పోలీసులకు అభినందనలు

6



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

వాహనాల ఫిట్‌నెస్.. ఇక ప్రైవేట్

(5వ పేజీ తరువాయి)

బస్సులు, ప్రైవేటు బస్సులు తదితర వాహనాలు అన్నీ ఏడాదికి ఒకసారి ఫిట్‌నెస్ చేయించుకుని సర్టిఫికెట్లు పొందాల్సి ఉంది. ఈ ప్రైవేటు ఏజెన్సీలపై పర్యవేక్షణ రవాణా శాఖకు ఉండాలని సంబంధిత అధికారులు తమ యూనియన్ల ద్వారా డిమాండ్ చేస్తున్నారు. సాంకేతిక పద్ధతుల ద్వారా ఫిట్‌నెస్‌లు సక్రమంగా జరగవు అనే వాదన వారు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏజెన్సీల ఏర్పాటు విషయంలో జాప్యం జరుగుతోంది.

సాంకేతిక పద్ధతులతో ఫిట్‌నెస్

ఫిట్‌నెస్ చేయాల్సిన వాహనాలను ప్రైవేటు ఏజెన్సీలు నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఏర్పాటు చేసిన స్కానర్ల మధ్య ఉంచుతారు. పూర్తిగా స్కాన్ చేసిన తరువాత వాహనానికి ఎక్కడ సమస్యలు ఉన్నా కంప్యూటర్‌లో తెలిసిపోతుంది. వాటికి మరమ్మతులు చేయించుకుంటేనే వాహనం ఫిట్‌నెస్ సర్టిఫికెటు వస్తుంది. అయితే ప్రైవేటు ఏజెన్సీలు ఫిట్‌నెస్ చేయడంలో అవకతవకలు జరిగే అవకాశం ఉందని రవాణా శాఖ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం జిల్లాలో ఉన్న రవాణా వాహనాలు

జిల్లాలో రవాణా వాహనాలు సుమారు రూ.30 వేలు ఉన్నాయి. ఒంగోలు రవాణా శాఖ ఉప కమిషనర్ కార్యాలయం పరిధిలో 24,776 ఉండగా మార్కాపురంలో 5,225, దర్శి రవాణా శాఖ కార్యాలయం పరిధిలో 45 మాత్రమే ఉన్నాయి. వీటిలో ఆటోల సంఖ్య 10వేలకుపైగా ఉంది. సరుకు రవాణా చేసే ఆటోలు 2,700, కమర్షల్ ట్రాక్టర్లు 3,700, లారీలు 8,500, స్కూలు బస్సులు 600, ప్రైవేటు బస్సులు 500 ఉన్నాయి. ఇంకా అంబులెన్స్‌లు, మోటర్‌క్యాబ్‌లు 1100, అంబులెన్స్‌లు 100, ట్రాక్టర్ ట్రాలీలు 1,500 మిగిలినవి ఇతర వాహనాలు తిరుగుతున్నాయి.

టెండర్లు ఖరారయ్యాయి

సుశీల, డీటీసీ

జిల్లాలో వాహనాల ఫిట్‌నెస్, బ్రేక్ చేసేందుకు టెండర్లు ఖరారయ్యాయి. ఇంకా ఎలాంటి సాంకేతిక పరికరాలు ఆ కేంద్రానికి రాలేదు. అయితే కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కావడంతో ఏజెన్సీలే ఫిట్‌నెస్ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే అనంతపురం, నంద్యాల ప్రాంతాలలో ప్రయోగాత్మకంగా జరుగుతున్నాయి.

నిర్లక్ష్యం వీడండి

(5వ పేజీ తరువాయి)

విభాగాలను అజెండాలో చేర్చినా సమయం సరిపోక కొన్నింటిపైనే సమీక్ష చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నాలుగున్నర గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో ఇరిగేషన్, ప్రాజెక్టులు, వ్యవసాయం, ఉద్యాన, మైక్రో ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్ష చేశారు.

ఒంగోలు ఉప విద్యాధికారిగా చంద్రమౌళీశ్వర్

ఒంగోలు విద్య, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఉప విద్యాధికారిగా సంతనూతలపాడు మండల విద్యాధికారి చంద్రమౌళీశ్వర్‌ను నియమిస్తూ పాఠశాల విద్యా డైరెక్టర్ వి. విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. చంద్రమౌళీశ్వర్ ప్రస్తుతం కనిగిరి, మార్కాపురం ఉప విద్యాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చంద్రమౌళీశ్వర్‌ను వెంటనే ఉప విద్యాధికారిగాచేర్చుకోమని ఆర్‌జేడీని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

వైసీపీ సర్పంచ్ నిర్వాకం

దేవుడి పటాలు తగులబెడుతూ సెల్ఫీ వీడియో

సోషల్ మీడియాలో హల్‌చల్

దగ్గుబాడు (పర్చూరు) నంవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా కారంచేడు మండలం దగ్గుబాడులో వైసీపీ మద్దతుదారునిగా ఉన్న సర్పంచ్(ఎస్సీ) నిర్వాకం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హిందూ దేవుళ్ల చిత్రపటాలు తగులబెడుతున్న తరుణంలో తీసిన సెల్ఫీ వీడియో ఆలస్యంగా సోమవారం సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. ప్రస్తుతం ఈ విషయం పర్చూరు ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

క్రీడల్లో మహేష్ ప్రతిభ

చీరాలటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యూనివర్సిటీ అంతర్ కళాశాల క్రాస్ కంట్రీ రన్ పోటీల్లో కీర్తి మహేష్ ద్వితీయ స్థానం సాధించాడు. వేటపాలెం మండలం అక్కాయిపాలెంకు చెందిన ఇతను భార తి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చీరాల విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన పోటీల్లో మహేష్ సత్తా చాటాడు. ఈక్రమంలో 17-19 వరకు బెంగళూరులోని మంగుళూరు యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నాడు. మహేష్‌తో పాటు కోచ్ ఫిజికల్ డైరెక్టర్ యే సురేడ్డిని కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. వైఏ కళాశాల విద్యార్థులు 10 కేఎం పోటీల్లో చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. వీరు మంగుళూరులో 18వ తేదీన జరిగే పోటీల్లో పాల్గొంటారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

ఐదుగురి నుంచి రూ. 23.18 లక్షల సొత్తు, 1.350 కిలోల గంజాయి స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్

ఒంగోలుక్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనేక చోట్ల దొంగతనాలతో పాటు గంజాయి విక్రయాలు చేస్తున్న ఐదుగురిని పొదిలి పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ ఏఆర్. దామోదర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిసా రాష్ట్రానికి చెందిన మహేది హుస్సేన్ , ఒంగోలు విజయ్‌నగర్ కాలనీకి చెందిన షేక్ కృపారావు, తాళ్ళూరు మండలం రామభద్రాపురంనకు చెందిన వడిషన్ వేణుగోపాల్‌రెడ్డి ,చీమకుర్తికి చెందిన షేక్ తరణ్, ఎర్రగొండపాలెంనకు చెందిన అవుల బ్రహ్మయ్యలను పొదిలి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం సాయత్రం పొదిలిలో అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరంతా పొదిలి, టంగుటూరు, వినుకొండ, కందుకూరు, నెల్లూరు, బాపట్ల ,తెనాలి ,అద్దంకి ప్రాంతాలలో అనేక దొంగతనాలు చేసినట్లు అంగీకరించారన్నారు. వీరంతా విశాఖపట్నం నుంచి గంజాయి తెచ్చి పొదిలిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ ప్లాట్లలో కూర్చొని మాట్లాడుకుంటుండగా పొదిలి పోలీసులు వారిని పట్టుకొని విచారించగా అనేక దొంగతనాలు చేసినట్లు అంగీకరించారని ఎస్పీ వెల్లడించారు. ఈమేరకు వారి వద్ద నుంచి 303 గ్రాముల బంగారం, 1.350 కిలోల గంజాయి, మోటర్‌బైక్‌తో పాటు రూ. 6,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు దొంగతనాలు చేయడమే కాకుండా గంజాయి తెచ్చి ఒంగోలు పరిసర ప్రాంతాలలో విక్రయిస్తుంటారని వివరించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

దొంగల నేర చరిత్ర ఇదీ

ఒడిసాకుచెందిన మహేది హుసేన్ గంజాయి తెచ్చి విక్రయాలు చేస్తుంటాడు. ఒక దొంగతనం కేసులో నిందితుడు. ఒంగోలుకు చెందిన కృపారావుపై 23 చోరీకేసులు ఉన్నాయి. వడిషన్ వేణుగోపాల్‌రెడ్డిపై 11 కేసులు, తరుణ్‌పై 2 కేసులు,ఆవుల బ్రహ్మయ్య ఒక కేసులో నిందితులుగా ఉన్నారు.

పోలీసులకు అభినందనలు

గంజాయి విక్రయాలుచేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పట్టుకున్న దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ , పొదిలి సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్సై వి.వేమన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలతో పాటుగా ,రివార్డులను అందజేశారు.

శంభో శివ శంభో

వైభవంగా తొలి సోమవార పూజలు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

పలు ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు



శివపార్వతులు



కేశవస్వామి పేటలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఒంగోలు(కల్చరల్), నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా నగరంలోని పలు ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఇక ఆలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. అదే విధంగా పలు శివాలయాలలో సోమవారం సాయంత్రం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా మహిళలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయా దేవస్థాన సిబ్బంది ఏర్పాట్లు చేశారు. స్థానిక కేశవస్వామిపేట శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండ్‌లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్యరోడ్‌లోని శ్రీ పంచ ముఖ శివాలయం, సంతపేట సాయిబాబా మందిరంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిరంలోని మరకత శివాలయం తదితర ఆలయాలలో కార్తీకమాసం తొలి సోమవారం వ్రతాలు నిర్వహించారు.



దీపాలు వెలిగిస్తున్న యువతి





సీఎం దృష్టికి డీసీసీబీ వ్యవహారం

(5వ పేజీ తరువాయి)

ఆదివారం ఈ విషయం నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లినట్లు సమాచారం. పీడీసీసీ బ్యాంకులో పరిస్థితిపై ఒకవైపు ఇంటెలిజెన్స్ విభాగం ప్రభుత్వానికి సమాచారం ఇవ్వగా, మరోవైపు సీఎం దృష్టికి కూడా జిల్లాకు చెందిన ఒకరిద్దరు అధికార పార్టీ నేతలు తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో మొత్తం వ్యవహారం, అధికారుల పాత్రపై సీఎంవో నుంచి ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు సంబంధిత అధికారులలో అలజడి రేపాయి. దీంతో ఎవరికి వారు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వచ్చిన సహకారశాఖ ఉన్నతాధికారులు తక్షణ చర్యలకు జిల్లా అధికారులకు సూచించినట్లు తెలిసింది. మరోవైపు బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ గోపాలకృష్ణ అప్రమత్తమై దిద్దుబాటు చర్యలు ప్రారంభించినట్లు సమాచారం.

ఉన్నత న్యాయస్థానానికి వెళ్లండి

గతంలో బ్యాంకు పాలకవర్గం డిస్మిస్ చేసిన ఉద్యోగికి రూ.82 లక్షలు పెండింగ్ వేతనం పేరుతో చెల్లింపునకు బ్యాంకు అధికారులు చేసిన ప్రతిపాదనను జేసీ తిరస్కరించినట్లు సమాచారం. ఈ విషయంలో వేతనం కోసం సదరు ఉద్యోగి కోర్టును ఆశ్రయించినప్పుడు తగుస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోకుండా వ్యవహరించి కోర్టు తీర్పు అతనికి అనుకూలంగా వచ్చేలా సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ విషయాన్ని ప్రశ్నించిన జేసీ వేతనం చెల్లింపునకు బ్రేక్‌వేయడంతో పాటు ఉన్నత న్యాయస్థానానికి వెళ్లాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది.

కలెక్టర్ బంగ్లాకు ఫైళ్లు

బ్యాంకు పరిణామాలపై తొలి నుంచి సీరియస్‌గా ఉన్న కలెక్టర్ అన్సారియా 'ఆంధ్రజ్యోతి' కథనాలతో మరింత దృష్టిపెట్టారు. బ్యాంకులో పరిస్థితిపై తాను ప్రభుత్వానికి లేఖలు రాసే సమయంలో ఉద్దేశపూర్వకంగా జిల్లా సహకారశాఖ అధికారులు తప్పుదోవ పట్టించారని భావించడంతోపాటు బ్యాంకు పర్యవేక్షణాధికారులు కూడా తగు విధంగా స్పందించలేదని అభిప్రాయానికి ఆమె వచ్చినట్లు తెలిసింది. ఆ మేరకు సహకార శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదేసమయంలో బ్యాంకులో 2019-24 మధ్య కాలంలో అసలేం జరిగిందన్న దానిపై దృష్టి సారించారు. ఆ సమయంలో జరిగిన త్రిసభ్య, పర్సన్ ఇన్‌చార్జిలతో కూడిన పాలక మండలి సమావేశాలు, చేసిన నిర్ణయాలకు సంబంధించిన మినిట్స్ పుస్తకాలు, మరికొన్ని కీలక ఫైళ్లను ఆ శాఖ అధికారుల ద్వారా గత రాత్రి తన బంగ్లాకు తెప్పించుకొన్నట్లు తెలిసింది. వాటిని పరిశీలించడంతోపాటు సదరు అధికారిపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. అన్నింటినీ తాను స్వయంగా పరిశీలిస్తానని, ఎక్కడ తప్పులు జరిగినా బాధ్యులైన వారిని క్షమించేది లేదని హెచ్చరించినట్లు తెలిసింది.

తక్షణం పాలక మండలి సమావేశం

తాజా పరిణామాల నేపథ్యంలో మంగళవారం బ్యాంకు పాలకమండలి సమావేశం ఏర్పాటు చేయాలని పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ గోపాలకృష్ణ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. తొలుత బ్యాంకు నిబంధనావళి ప్రకారం సమావేశం ఏర్పాటు చేయాలని రెండు రోజుల క్రితం సూచించిన జేసీ తాజా పరిణామాల నేపథ్యంలో తక్షణం పెట్టాలని ఆదేశించినట్లు తెలిసింది. ఆ సమావేశంలో ఏమి చర్చిస్తారు, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది వేచిచూడాల్సి ఉంది.

డీఆర్సీలో డీసీసీబీపై చర్చ

జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన డీఆర్సీ సమావేశంలో ఈ అంశాన్ని ఎమ్మెల్యే జనార్దన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. బ్యాంకులో అవకతవకలు జరిగినట్లు తనకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ కోసం ప్రభుత్వానికి లేఖ రాశానని, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఇన్‌చార్జీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు.

గౌరవించండి.. పనులు చేయండి

(5వ పేజీ తరువాయి)

గమనించారు. ఆతర్వాత పోలీసు అతిథి గృహంలో జిల్లా మంత్రి స్వామి, ఐదుగురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు టీడీపీ ఇన్‌చార్జిలతో సమావేశమై కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌లను ఆహ్వానించి పలు కీలక అంశాలపై సమీక్ష చేశారు.

కిందిస్థాయిలో మార్పు రావాలి

పాలనాధికారులుగా కలెక్టర్, ఎస్పీలు పనిచేయటమే కాదు కిందిస్థాయి అధికారులు కూడా సక్రమంగా పనిచేసే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించినట్లు తెలిసింది. ఇటీవల ఒక ద్వితీయ స్థాయి జిల్లా అధికారి పశ్చిమ ప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే ఒక రైతు సమస్యపై ఫోన్ చేస్తే సరిగా స్పందించకపోగా దూకుడుగా మాట్లాడినట్లు సమాచారం. ఆ విషయాన్ని వెంటనే జిల్లా మంత్రి స్వామి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లగా సదరు అధికారిని స్వామి పిలిపించి విషయం తెలుసుకొని పనులు చేస్తారా.. లేదా? ప్రజాప్రతినిధి ఫోన్ చేస్తే గౌరవంగా మాట్లాడకపోవటం తగదని హెచ్చరించారు. ఆ అంశాన్ని ఇన్‌చార్జి మంత్రి ప్రస్తావిస్తూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లోకి వచ్చిన అధికారులు గౌరవంగా వ్యవహరించే విధంగా చూడాల్సిన బాధ్యత పాలనాధికారులపై ఉందని చెప్పినట్లు తెలిసింది. ఇదేసమయంలో పశ్చిమ ప్రాంతానికి చెందిన ఒక నాయకుడు మాట్లాడుతూ డిప్యూటీ కలెక్టర్ పదేపదే తమ ప్రాంతానికి వచ్చి రేషన్ షాపులపై దాడులు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. ఆకాశ రామన్న పేరుతో వచ్చే ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని పనిగట్టుకొని కొన్ని షాపులపై దాడులు చేస్తున్నారని ఆయన చెప్పినట్లు తెలిసింది. ఆ షాపుల్లో ఒక్క లోపం కూడా కనిపించక వెనుతిరిగాడని సమావేశం దృష్టికి తెచ్చాడు. ఒక ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రజలతో సంబంధం ఉన్న కీలకమైన పోస్టులో ఉండే అధికారికి ప్రజలు, ప్రజాప్రతినిధులతో ఎలా వ్యవహరించాలో తెలియకపోవటం తమ దురదృష్టకరమని వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

ఈ చిన్న పనులకు సహకరించరా..

రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కుకింగ్ ఏజన్సీల మార్పు, కిందిస్థాయి ఉద్యోగుల బదిలీలు ఇలాంటి విషయాల్లో తమ మాట చెల్లకపోతే అధికారపార్టీ ఎమ్మెల్యేకు విలువ ఏం ఉంటుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ చిన్న పనులు కూడా చేయలేని వారు మీరేమి ఎమ్మెల్యేలంటూ సొంత పార్టీ కార్యకర్తలు వెక్కిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కొందరు అధికారులు చెప్పే కుంటిసాకులతో పార్టీ ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉందని అన్నట్లు తెలిసింది. ఆ వెంటనే మరికొందరు ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని ఇది ముమ్మాటికి నిజం ఈ విషయంలో మంత్రులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు సమాచారం.

ఆ సీఐ చెప్పిందే వింటారా

పశ్చిమ ప్రాంతానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు 'ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చెప్పిన మాటలు విని మమల్ని అపార్థం చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిపొందిన ఆయన కావాలని టీడీపీ ప్రజాప్రతినిధులపై మీకు అసత్యాలు చెబుతున్నాడు.' అని ఎస్పీతో చెప్పినట్లు తెలిసింది. దానిపై ఎస్పీ స్పందిస్తూ సమాచారం 'సేకరణకు నా సొంత వ్యవస్థ ఉంది. మీరు అనుకున్నట్లు ఒక సీఐ మాట వింటున్నాడనే భ్రమ నుంచి బయటకు రండి' అని వారికి సూచించినట్లు తెలిసింది. ఆ తర్వాత మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి కానిస్టేబుళ్ల బదిలీలను ప్రస్తావిస్తూ ఈ విషయంలోను తమకు ఇబ్బంది ఎదురవుతుందని చెప్పినట్లు తెలిసింది. తాము చెప్పినా ఏదో ఒక కారణంతో కానిస్టేబుళ్లను ఇష్టమొచ్చినట్లు బదిలీ చేస్తున్నారని గత ఐదేళ్లు వైసీపీలో ఆయా స్టేషన్లల్లో పెత్తనం చేసిన కానిస్టేబుళ్లకు ఉపయోగకరంగా బదిలీలు జరగబోతున్నట్లు తెలిసిందని అన్నట్లు సమాచారం. ఒక స్టేషన్‌లో ఐదేళ్లు పనిచేసిన కానిస్టేబుల్‌ను మార్చాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు తెలిసింది. తర్జనభర్జన అనంతరం అలా బదిలీ చేయాల్సి వస్తే తాము సూచించిన వారిని అక్కడే ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు బదిలీచేయాలని కొందరు ఎమ్మెల్యేలు సూచించారు. ప్రధానంగా మార్కాపురం, ఒంగోలు, దర్శి తదితర ప్రాంతాల్లో కొందరు కానిస్టేబుళ్ల బదిలీల అంశం చర్చకు రాగా అక్కడ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు సూచించిన వారిని ఆ ప్రాంతంలో మరొక స్టేషన్‌కు బదిలీ చేయాలని సమావేశంలో పాల్గొన్న నేతలు ముక్తకంఠంతో ఎస్పీకి సూచించినట్లు తెలిసింది. ఇలా సాగిన సమావేశంలో చివరగా మంత్రి రామనారాయరెడ్డి మరోసారి మాట్లాడుతూ అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ నిబంధలన మేరకు పనులు చేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా వ్యవహరించక తప్పదని, అలా మొత్తం యంత్రాంగం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు సూచించినట్లు తెలిసింది.

నేర వార్తలు

రెండు బైకులు ఢీ, ఇద్దరు మృతి,

ఒకరికి తీవ్ర గాయాలు

మంటలు చెలరేగడంతో రెండు వాహనాలూ దగ్ధం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివబసవరాజు

త్రిపురాంతకం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వస్తున్న రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని వెల్లంపల్లి సమీపంలో జాతీయ రహదారి 544డీపై సోమవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొష్టాలు గ్రామానికి చెందిన వెన్నం చిన్ననాగయ్య(42) కుంట నుంచి త్రిపురాంతకం వస్తున్నాడు. గొల్లపల్లి గ్రామానికి చెందిన సునీల్, రాజు బైకుపై ఎదురుగా వస్తున్నారు. ఈ సమయంలో రెండు బైకులూ ఢీకొన్నాయి. మంటలు చెలరేగి రెండు బైకులూ దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో చిన్ననాగయ్య అక్కడికక్కడే మృతి చెందగా, మంటలు అంటుకోగా రాజు శరీరంగా సగభాగం కాలింది. ఆయన్ను గుంటూరు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందాడు. సునీల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 ఇబ్బంది క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. స్థానిక ఎస్సై శివబసవరాజు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

'అయ్యప్ప'ల ఆటో బోల్తా.. ఒకరు మృతి



గురుప్రసాద్(ఫైల్)

దొనకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవాలయంలో సోమవారం మధ్యాహ్నం సద్ది ముగించుకొని వెళ్తున్న అయ్యప్పస్వాముల ఆటో బోల్తా పడటంతో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈఘటన దొనకొండలోని మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారిలో కెజీబీవీ పాఠశాల మలుపు వద్ద చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. దొనకొండ బ్రహ్మారావుపేటకు చెందిన బత్తుల నారాయణ, అతని ఇద్దరు కుమారులు నాగేశ్వరరావు, గురుప్రసాద్‌లు ఇటీవల అయ్యప్పమాల ధారణ చేపట్టారు. ఈక్రమంలో నాల్గురోడ్ల కూడలిలో అంజనేయస్వామి దేవాలయంలో అయ్యప్పస్వాములతో కలిసి మధ్యాహ్నం సద్ది ముగించుకొని స్వగ్రామానికి బయలుదేరారు. బత్తుల నాగేశ్వరరావు ఆటోలో గురుప్రసాద్ మరో నల్గురు అయ్యప్పస్వాములు వస్తున్నక్రమంలో కెజీబీవీ పాఠశాల మలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బత్తుల గురుప్రసాద్(15) తలకు బలమైన గాయం కావటంతో హుటాహుటీన వినుకొండ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. మృతిచెందిన గురుప్రసాద్ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బాలరాజు మృతదేహాన్ని స్థానికులు సందర్శించి నివాళులర్పించారు.

ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య

ముండ్లమూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన వెల్లంపల్లి సురేష్(25) ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటనపై ముండ్లమూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. డిగ్రీ చదివిన సురేష్ హైదరాబాద్‌లో ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందుతూ సూసైడ్ లెటరు రాసి తన ఇంటిలో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడు తండ్రి యలమంద ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. దర్శి వైద్యాధికారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

స్థాయి పెంచారు.. వసతులు మరిచారు!

పరదాల కింద చదువులు

ఐదు తరగతులకు రెండు గదులు

కూచిపూడి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవస్థలు



పునాదులకే పరిమితమైన నాడునేడు పనులు

మద్రిపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచిపూడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిని పెంచారు. జడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. వసతులు సమకూర్చడం మరిచారు. కేవలం రెండు గదుల్లో ఉన్నత పాఠశాలను కొనసాగిస్తున్నారు. నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలు మార్చినట్లు గత పాలకులు చెప్పుకున్న మాటలు ప్రచారార్భాటం కోసమేనన్న విషయం దీన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. దీంతో విద్యార్థులు ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నారు. ఒక చిన్న ప్రాంగణంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు కేవలం ఐదు గదుల్లో కొనసాగించాల్సి రావడంతో బోధనకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఐదు, పది విద్యార్థుల తరగతి సమయపు వేళలు పొంతన లేకపోవడం విద్యాభివృద్ధికి ఆటంకంగా మారింది.

హైస్కూల్‌లో 135 మంది విద్యార్థులు

కూచిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకూ 135మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. కేవలం రెండు తరగతి గదులు ఉన్నాయి. వీటిలో ఒక గదిని ప్రధానోపాధ్యాయుడు కార్యాలయ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు. మిగిలిన గదిని ఒక తరగతికి ఉపయోగిస్తున్నారు. ఇతర నాలుగు తరగతులను వరండాలో ఏర్పాటు చేసిన పరదాల కింద కొనసాగిస్తున్నారు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా పాఠశాలకు సెలవు ప్రకటించాల్సి వస్తోంది. ప్రాథమిక పాఠశాల వరకూ మూడు గదులు ఉన్నాయి. వాటిలో 1 నుంచి 5 తరగతులు కొనసాగిస్తున్నారు.

పునాదుల్లోనే 'నాడు-నేడు' పనులు

పాఠశాల దుస్థితిపై గత ఏడాది ఆరంభంలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. నాడు-నేడు కింద తరగతి గదుల నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశారు. వాటితో గ్రామ సచివాలయం పక్కన నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.20 లక్షల మేర ఖర్చు చేసి పునాదులు వేశారు. ఆతరువాత నిధులు మంజూరు కాకపోవడంతో అర్ధంతరంగా నిలిపి వేశారు. ఏడాదిగా పనులు ఆగిపోవడంతో పునాదుల మధ్య చెట్లు పెరిగాయి. పిల్లర్ల కోసం వినియోగించిన ఇనుమ తుప్పుపట్టి పాడవుతోంది. సమస్యల మధ్య చదువులు సాగించాల్సి వస్తుండటంతో పిల్లల భవితవ్యంపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

తెనాలిలో అద్భుతమైన శిల్పకళ

డీఎస్పీ జనార్ధనరావు



విగ్రహం వద్ద డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెనాలిలోని శిల్పకళాకారుల్లో అద్భుతమైన కళ ఉందని డీఎస్పీ జనార్ధనరావు పేర్కొన్నారు. సూర్య శిల్పశాలలో మేవాడ్ రాజు రాణాప్రతాప్‌సింగ్ భారీ విగ్రహాన్ని ఫైబర్‌తో తయారు చేశారు. ఈ విగ్రహాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. శిల్పశాలలో తయారు చేసిన వివిధ విగ్రహాలను తిలకించారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలను అభినందించారు. శిల్పి కాటూరి మాట్లాడుతూ, మార్కాపురంలో ప్రతిష్ఠించేందుకు ఈ విగ్రహం ఆర్డర్ వచ్చిందన్నారు. అట్లాంటాలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా గత వారం ఆవిష్కరించిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహం కూడా తామే రూపొందించామని చెప్పారు. శిల్పులను విగ్రహ కమిటీ సభ్యులు భవానీసింగ్, ప్రతాప్‌సింగ్, కళ్యాణ్‌సింగ్, అంజన్‌సింగ్‌లు సత్కరించారు.

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్‌నెలలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తూ ప్రభుత్వపరీక్షల డైరెక్టర్ డి. దేవానంద్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 18 వరకు పరీక్ష ఫీజుచెల్లించేందుకు అవకాశం ఇచ్చారు. అదే రోజు ఆన్‌లైన్‌లో విద్యార్థుల నామినల్ రోల్స్‌ను సమర్పించాలి. రూ. 50 అపరాధ రుసుంతో ఈనెల 19నుంచి 25వతేదీ వరకు, రూ. 200 అపరాధరుసుంతో ఈనెల 26నుంచి డిసెంబరు 3 వరకు, రూ. 500 అపరాధ రుసుంతో డిసెంబరు 4నుంచి 10 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ. 125, మూడు సబ్జెక్టులు అంత కన్నా ఎక్కువ ఉంటే రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ. 110, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ. 60, తక్కువ వయస్సు ఉన్న పిల్లలు రూ. 300, మైగ్రేషన్ సర్టిఫికెట్ అవసరం ఉన్న వారు అదనంగా రూ. 80 ఫీజు చెల్లించాలి. ఫీజు చెల్లింపునకు ఆన్‌లైన్ అప్లికేషన్ లింకు అందుబాటులో ఉందని ఆయన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏఎస్‌వో కృష్ణకుమార్ రిలీవ్

ఒంగోలు విద్య నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్‌వో)గా పనిచేస్తున్న జే కృష్ణకుమార్‌ను అకస్మికంగా ఏఎస్‌వో విధుల నుంచి రిలీవ్ చేస్తూ డీఈవో ఎ.కిరణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ టెలిఫోనిక్ సూచనల మేరకు కృష్ణకుమార్‌ను తన మాతృ సంస్థకు తిప్పి పంపారు. సోమవారం ఉదయమే ఆయనను విధుల నుంచి రిలీవ్ చేశారు. కొత్తపట్నం జడ్పీ హైస్కూలులో గణితం స్కూలు అసిస్టెంట్‌గా ఖాళీగా ఉన్న స్థానంలో కృష్ణకుమార్‌ను నియమించారు. వెంటనే కొత్తపట్నం హైస్కూలులో చేరాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. కృష్ణకుమార్‌ను వెంటనే విధుల్లో చేర్చుకొని తనకు నివేదించమని కొత్తపట్నం హైస్కూలు హెచ్‌ఎంను డీఈవో ఆదేశించారు. కృష్ణకుమార్ దీర్ఘకాలం ఏపీవోగా, ఏఎస్‌వోగా పనిచేశారు. పాఠశాల విద్యాడైరెక్టర్ ఆదేశాలతో ఆయనను డీఈవో కార్యాలయం విధుల నుంచి రిలీవ్ చేసి పంపించారు.

నాగమయ్యా.. ఆదుకోవయ్యా..


ఒంగోలులో పుట్ట వద్ద పాలుపోస్తున్న మహిళలు(ఫైల్)

నేడు నాగులచవితి

- కార్తీకమాసంలో విశిష్టమైన పర్వదినం
- పుట్టల వద్ద మహిళలు మొక్కులు

కార్తీకమాసం.. అనేక పర్వదినాలకు నిలయం. ఏడాదిలో వచ్చే అన్ని మాసాల్లోకి కార్తీకమాసం ఎంతో శ్రేష్ఠమైందని పెద్దలు చెబుతారు. ఈ మాసం ప్రారంభమైన మరుసటి రోజు అంటే విదియ రోజు 'భగినీ హస్తభోజనం' పర్వదినమైతే, నాలుగో రోజు అంటే కార్తీక శుద్ధ చవితిని 'నాగుల చవితి' పర్వదినంగా జరుపుకోవటం ఆచారం. మహిళలు పుట్టలో పాలుపోసి భక్తిశ్రద్ధలతో నాగేంద్రుని ఆరాధిస్తారు. సుబ్రహ్మణ్య స్వామి వ్రతాలను కొందరు చేసుకోవటం అలవాటు.

- ఒంగోలు కల్చరల్



పూజ ఇలా...

నాగులచవితి రోజున ఉదయాన్నే పుట్టలో ఆవుపాలు పోసి, నాగేంద్రుని భక్తితో పూజించి, చలిమిడి, అరటిపళ్లు నైవేద్యం పెట్టాలి. అనేకచోట్ల పిల్లలు దీపావళి రోజున మిగిలిన టపాసులను నాగులచవితి రోజున పుట్టదగ్గర కానీ, ఇంటి దగ్గర కానీ కాలుస్తారు. అదేవిధంగా పుట్టచుట్టూ ప్రదక్షిణ చేస్తూ నూక చల్లుతారు. 'నూకని నువ్వు తీసుకుని రూకలు మాకివ్వు తండ్రీ' అని గతంలో పెద్దలు ప్రార్థించేవారు. ఆ తర్వాత పుట్టమన్ను చెవులకు పెట్టుకోవాలి. రెండు మూడు చెంచాల పాలను పుట్టలోపోసి మిగిలిన వాటిని నైవేద్యం పెట్టి ఇంటికి తెచ్చుకుని నాగేంద్రుని ప్రసాదంగా తాగాలి.



మన శరీరమే సర్పరూపం

జీవశాస్త్రం ప్రకారం మన శరీరమే ఒక సర్పరూపం కలిగి ఉంటుంది. పాముకు ఉన్నట్లే మానవునికీ నవరంధ్రాలు ఉంటాయి. మన శరీరంలో నాడులతో నిండిఉన్న వెన్నుముకను 'వెన్నుపాము' అని పిలుస్తాం. మనిషిలో ఉండే కుండలినీశక్తి మూలాధారచక్రంలో 'పాము' ఆకారంలో ఉంటుందని యోగ శాస్త్రం చెబుతోంది. అంటే మనలోనే సర్పరూపం ఉండి అది కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాన్ని చిమ్ముతూ ఉంటుంది. పాముకు తలలో, తేలుకు తోకలో విషం ఉంటే మనిషికి నిలువెల్లా విషయం ఉంటుందనేది సుమతీ శతకకారుడు భావన. మనలోని చెడు ఆలోచన, అహంకారం మొదలైనవి విషాలన్న మాట. నాగులచవితి రోజున నాగేంద్రుని పూజించటం వలన మనలోని విషస్వభావం తగ్గుతుందనేది అంతరార్థం. జ్యోతిష్యపరంగానూ ఈ పండుగకు విశిష్టత ఉంది. కుజ, రాహు గ్రహ తదితర దోషాలున్నవారు నాగుల చవితి రోజున ఉపవాసం ఉండి, పుట్టలో పాలుపోస్తే ఆ దోషాలన్నీ తొలగిపోతాయని పెద్దలు చెబుతారు.

నామధేయాల్లోనూ 'నాగ'కు ప్రాచుర్యం

అనేకమందికి నాగేంద్రుడు ఇలవేలుపు. అందుకే చాలామంది నాగరాజు, ఫణి, సుబ్రహ్మణ్యం, నాగయ్య, నాగమ్మ, నాగేశ్వరరావు, నాగేశ్వరమ్మ, నాగజ్యోతి ఇలా 'నాగ' శబ్దం కలిసి వచ్చే పేర్లు పెట్టుకోవటం ఆనవాయితీ. ఇక పంటలు పండటంలోనూ, పంటలను నాశనం చేసే ఎలుకలను చంపి పంటను రక్షించటంలోనూ నాగజాతి ఎంతో మేలు చేస్తుంది. అదేవిధంగా అనేక రకాల ఆయుర్వేద మందుల్లో సైతం కొద్దిమోతాదులో పాము కుబుసాన్ని ఉపయోగిస్తారు. నాగేంద్రుని పూజించటం ద్వారా నాగజాతికి కృతజ్ఞతను తెలియజేయటం కూడా ఈ పండుగ వెనుక అంతరార్థం.

ఒంగోలు నగరంలో ప్రాశస్థ్యం ఉన్న పుట్టలు

నగరంలో రంగారాయుడు చెరువు పక్కనున్న పుట్టదగ్గర, ఐశ్వర్యనగర్‌లో ఉన్న పుట్టదగ్గర అదేవిధంగా సంతపేట, అన్నవరప్పాడు, భాగ్యనగర్ మొదలైన ప్రదేశాల్లో ఉన్న పుట్టలదగ్గర మహిళలు ఎక్కువగా పాలుపోసి పూజిస్తుంటారు. అదేవిధంగా నగరంలోని వివిధ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలను నాగులచవితి సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని పూజలు చేస్తారు. సీతారాంపురంలోని వరాల నాగేంద్రస్వామి దేవస్థానం, రంగారాయుడు చెరువుదగ్గర ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం, స్కందగిరిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం మొదలైన చోట్ల ప్రత్యేక పూజలు చేయనున్నారు. నాగులచవితిని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రదేశాల్లో పుట్టవద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడటానికి కొన్ని స్వచ్ఛందసంస్థలు ఏర్పాట్లు చేశాయి. పుట్టదగ్గరకు వచ్చే భక్తులకు అవసరమైన ఆవుపాలు, నాగేంద్రుని ప్రతిమ మొదలైనవి అక్కడే అమ్మేందుకు కొంతమంది వ్యాపారులు కూడా సిద్ధమవుతున్నారు.


నాగేంద్రునికి పాలుపోస్తున్న మహిళలు(ఫైల్)

త్వరలో వెలిగొండను పూర్తిచేస్తాం

- జిల్లా అభివృద్ధిపై సానుకూల దృక్పథంతో చర్చించాం
- సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం
- భూముల అక్రమాలపై సిట్ నివేదిక వచ్చాక చర్యలు
- జిల్లాలో ఆలయ భూములను కాపాడే దిశగా చర్యలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామనారాయణరెడ్డి


మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి, పక్కన మంత్రి స్వామి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధికి దోహదపడే వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేస్తామని ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఆర్సీ సమావేశం అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని జిల్లా అభివృద్ధికి దోహదపడే విధంగా రాజకీయాలకతీతంగా నిర్వహించామన్నారు. ప్రధానంగా వెలిగొండ, రామతీర్థం, గుండ్లకమ్మ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యేలు సమావేశం దృష్టికి తెచ్చారన్నారు. వెలిగొండను మరోసారి తాను సందర్శించి దాన్ని సకాలంలో పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన అంశాలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వెలిగొండ పూర్తయితే నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు నీరందుతుందన్నారు. ప్రకాశం జిల్లా పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి ఉందని, రైతులందరూ అభివృద్ధి చెందాలంటే వెంటనే ప్రాజెక్టులనుపూర్తి చేయాల్సిందేనన్నారు.

ఒంగోలు జాతి పశు సంపదను కాపాడుతాం

అంతరించిపోతున్న ఒంగోలు జాతి పశుసంపదను కాపాడుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చదలవాడ పశుక్షేత్రంపై చర్చించి అందుకు అవసరమైన నిధులు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఒక్కో మండలానికి 50 గోకులాలను మంజూరుచేయాలని సమావేశంలో ఆదేశాలు జారీచేశామని తెలిపారు. రాష్ట్రంలో ఆవు నెయ్యికి డిమాండ్ ఉందన్నారు. జిల్లాలో ఆవులను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గోవులను పెంచుకోనేందుకు మరింత సబ్సిడీ ఇచ్చే విధంగా ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. తమిళనాడు నుంచి హైస్పీడు మరబోట్లు వల్ల వలలు దెబ్బతింటున్నాయని, అలాగే మత్స్యసంపదను తమిళనాడుకు తరలించుకెళ్తున్న వ్యవహారంపై చర్చించామన్నారు. దీనిపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్ల కోసం మరో రూ.11కోట్లు

జిల్లాలో గోతులు లేని రహదారులను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా మొదటి విడతలో రూ11.50 కోట్లతో పనులు చేపట్టారన్నారు. రెండో విడతలో మరో రూ.11 కోట్లు రానున్నాయని ఇన్‌చార్జి మంత్రి ఆనం వెల్లడించారు. పంచాయతీరాజ్ రోడ్లను కూడా అదేవిధంగా అభివృద్ధి చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం గోతులను వారసత్వ సంపదగా ఇచ్చిందన్నారు. వాటిని తమ బాధ్యతగా తీసుకొని అన్ని రోడ్లు వేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఒంగోలులో మూడు రోజులకు ఒకసారి మంచినీరు ఇస్తున్నారని, ప్రతిరోజూ నీరు ఇవ్వడమే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైవేల పరిధిలోని దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే రహదారి సరిగా లేదని చర్చకు వచ్చిన వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించామన్నారు. అవసరమైతే ఆ రోడ్డు నిర్మాణంపై విజిలెన్స్, ఏసీబీ విచారణ చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

సిట్ నివేదిక రాగానే చర్యలు

జిల్లాలో కొన్నిప్రాంతాల్లో భూముల రికార్డులు మారాయని, దీనిపై ఇప్పటికే సిట్ విచారణ జరిగిందని ఆనం తెలిపారు. ఆ నివేదిక వారంరోజుల్లో అందుతుందని, ఆ వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దేవదాయశాఖ పరిధిలో జిల్లాలో 890 ఆలయాలు, ధార్మిక సంస్థలు మొత్తం 1001 ఉన్నాయన్నారు. ఈ ఆలయాన్నింటికీ కమిటీలు వేస్తామని వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు కింద 65 ఆలయాలు మంజూరయ్యాయని, ఆ పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఆలయాల ఆస్తులను కాపాడుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో ఆలయాలకు చెందిన 17వేల ఎకరాలు లీజుకు ఇవ్వగా 14వేల ఎకరాలు అన్యాక్రాంతమైందన్నారు. సమావేశంలో మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎస్పీ దామోదర్, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్రివినాగ్, డీఆర్వో చిన్న ఓబులేషుతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వెలిగొండను పూర్తి చేయాలి



మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎంపీ

వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 22 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించవచ్చు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

భూ సమస్యను పరిష్కరించాలి



ముత్తుముల అశోక్‌రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే

గిద్దలూరు నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఉన్న భూములను దేవదాయ భూములుగా నమోదు చేయడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి. చెరువులకు పూడిక తీతకు నిధులు కేటాయించాలి.

పోతురాజు కాలువను ఆధునికీకరించాలి



దామచర్ల జనార్దన్, ఒంగోలు ఎమ్మెల్యే

పోతురాజుకాలువ ఆధునికీకరణను త్వరగా పూర్తి చేయాలి. 2014-19 గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.89 కోట్లతో ప్రతిపాదనలు చేయగా 2019లో గత ప్రభుత్వం రివర్స్ టెండర్ పేరుతో రూ.62 కోట్లతో పనులు చేపట్టి రూ.42 కోట్లు డ్రా చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలి. టిడ్కో ఇళ్లను త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. రిమ్స్‌లో దంత వైద్యకళాశాలతోపాటు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

సీసీరోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలి



బీఎన్ విజయకుమార్, సంతనూతలపాడు ఎమ్మెల్యే

సంతనూతలపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీసీరోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. పేర్నమిట్ట వద్ద ఉన్న 187 ఎకరాల చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా అభివృద్ధి చేయాలి. పొదుపు సంఘాల్లో రుణాలకు సంబంధించి అనేక అవకతవకలు జరిగాయి. వీటిపై సమగ్ర విచారణ చేయాలి.

బాధితులకు న్యాయం చేయాలి



కందుల నారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే

మార్కాపురం నియోజకవర్గంలో ఎక్కువ భూములు ఆక్రమణలో ఉన్నాయి. వీటిని సమగ్ర పరిశీలించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలి. తాగునీటి సమస్య కూడా అధికంగా ఉంది. వెనుకబడిన ఈ ప్రాంతంలో ఈబీసీ సర్టిఫికెట్ల జారీలో వారి ఆర్థికస్తోమతను దృష్టి ఉంచుకొని జారీచేయాలి.

బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలి



డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే

తాళ్లూరు-గంగవరం మధ్య ఉన్న రహదారిపై బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి. సచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. మొగలిగుండ రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి.

చెరువులను స్థిరీకరించాలి



డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే

కనిగిరి నియోజకవర్గంలో ఉన్న చెరువులను స్థిరీకరించాల్సిన అవసరం ఉంది. తద్వారా ఈ ప్రాతంలో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

గెస్ట్‌హౌస్‌లను ఆధునికీకరించాలి



దామచర్ల సత్య, మారిటైం బోర్డు చైర్మన్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ అతిథి గృహాలు దెబ్బతిన్నాయి. వాటిని ఆధునికీకరించే విధంగా చర్యలు తీసుకోవాలి. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు కూడా చాలా దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులపైనా దృష్టి పెట్టాలి.

స్టోరేజీ సామర్థ్యాన్ని పెంచాలి



నూకసాని బాలాజీ, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్

పాలేరు, బింగినపల్లి చెరువుల స్టోరేజీ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఒంగోలు డెయిరీని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలి.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



తాటిపర్తి చంద్రశేఖర్, వైపాలెం ఎమ్మెల్యే

నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఆ ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

తూమాటి మాధవరావు, శాసనమండలి సభ్యుడు

జిల్లాను వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి. అందుకోసం ఇన్‌చార్జి మంత్రి రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలి.



ఎలక్ట్రిక్ వాహనాలకు యథేచ్ఛగా చార్జింగ్

ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)లో కొందరు ఉద్యోగులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. పెట్రోలు ఆదా అయ్యేందుకు కొందరు ఉద్యోగులు ఎలక్ట్రిక్ బైక్‌లు వాడుతుండగా, ఆ వాహనాలకు జీజీహెచ్‌లో చార్జింగ్ పెట్టుకోవడంపై ఇతర ఉద్యోగులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలా జగరడం ఇటీవల అధికారుల దృష్టికి వెళ్లినా పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇక ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ కేంద్రంగా జీజీహెచ్ మారిపోయిందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా జీజీహెచ్ అధికారులు ఇలాంటి వ్యవహారాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరుతున్నారు.

- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

ఉండీ.. ఉపయోగం లేదు..!


ఆర్టీసీ డిపో వద్ద పనిచేయని ఏటీఎంలు


కోర్టు సెంటర్‌లో పనిచేయని ఏటీఎం

నగరంలో పనిచేయని పలు ఏటీఎంలు

విత్‌డ్రాల్స్, డిపాజిట్లకు అవస్థలు

ప్రజలకు ఆర్థిక లావాదేవీలను సులభతరం చేసేందుకు 24గంటలు బ్యాంకు సేవలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ టెల్లర్ మెసిన్ (ఏటీఎం) సెంటర్లు అలంకార ప్రాయంగా మారాయి. సాధారణంగా గతంలో బ్యాంకుల్లోనే ఆర్థిక లావాదేవీలు జరగ్గా బ్యాంకు ఖాతాదారులకు ఇబ్బందులు తొలగించేలా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. అయితే నెల రోజులుగా నగరంలోని ఓ జాతీయ బ్యాంకుకు సంబంధించిన ఏటీఎంలు పనిచేయడం లేదు. బ్యాంకు ఆడిటర్లు వచ్చినప్పుడో, లేక ఉన్నతాధికారులు వచ్చినపుడో ఏటీఎంలలో సౌకర్యాలపై హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత వాటిని విస్మరిస్తున్నారు. ఒంగోలు నగరంలో సుమారు యాభైకి పైగా పలు బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలు ఉండగా, అందులో అధిక శాతం నగదు తీసుకునే సౌకర్యం ఉంది. మరోపది సెంటర్లలో మాత్రం నగదు డిపాజిట్ చేసే వీలుంది. అయితే బ్యాంకు నిబంధనల మేరకు ఖాతాదారులకు 24గంటలు ఈ మెషిన్‌ల ద్వారా సేవలు అందించాలి. ఏ ఒక్కరోజు అయినా ఖాతాదారుడు అసౌకర్యానికి గురైతే తక్షణమే అసౌకర్యాన్ని తొలగించి మెరుగైన సేవలు అందించాలి. కానీ ఒంగోలు నగరంలో ఆ పరిస్థితి లేదు. నెల రోజులుగా క్యాష్ డిపాజిట్ మిషన్ (సీడీఎం) లు కూడా పనిచేయడం లేదు. దీంతో బ్యాంకు సమయాల్లో అయినా ఈ సేవలు పొందేందుకు వెళ్లిన ఖాతాదారులకు డిజిటల్ ట్రాన్సాక్షన్స్ చేసుకోవాలని బదులు ఇస్తున్నారు. ఒకవైపు ఏటీఎం సెంటర్లు పనిచేయక, మరోవైపు బ్యాంకులో నగదు జమలు, విత్‌డ్రాయల్స్ లేక నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంచితే కొన్ని ఏటీఎం సెంటర్లలో కనీసం ఏసీలు పనిచేయడం లేదని ప్రజల నుంచి వినిపిస్తున్న వాదన, మరోపక్క ఆర్థిక లావాదేవీలకు వినియోగ చార్జీలు ముక్కుపిండి మరీ వసూలు చేసే బ్యాంకు అధికారులు ఖాతాదారులకు కలుగుతున్న అసౌకర్యంపై పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నగరంలో ఉన్నటువంటి పలు జాతీయ బ్యాంకుల ఏటీఎం సెంటర్లలో ఏర్పాటు చేసిన మెషిన్‌లు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, బ్యాంకుల ఖాతాదారులు కోరుతున్నారు.

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)


ట్రంకురోడ్డులో ఒక చోట ఉన్న పనిచేయని మూడు ఏటీఎంలు


మాట్లాడుతున్న చుండూరి రంగారావు

మోదీ నియంతృత్వ పోకడలను ప్రతిఘటించాలి

సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి):దేశం అన్ని రంగాల్లో ముందుందని ప్రగల్భాలు పలుకుతున్న మోదీ నియంతృత్వ పోకడలను ప్రతిఘటించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు రైతాంగానికి అండగా ఉండాలని ఇందుకోసం ఈ నెల 26న నిర్వహించే సాంస్కృతిక సమ్మేళనం జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఒంగోలు సీపీఐ కార్యాలయంలో ముందస్తు సమావేశం రచయితలు, కవులు, ప్రజా నాట్యమండలి వంటి పలు సంస్థల ప్రతినిధులతో నిర్వహించారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యం చేయటం సంతోషంగా ఉందన్నారు. కళల ప్రయోజనం ప్రజలను చైతన్యపరచటమేనని ఆయన అన్నారు. పడమటి గాలి రచయిత పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై నటీనటులు సైతం ప్రతిస్పందించి ఈ నెల 26వ తేదీ జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నాయకులు ఉబ్బా కోటేశ్వరరావు, ఆర్.రామకృష్ణ, పెంట్యాల హనుమంతరావు, మిట్నసల శాంతారావు, మిడసల మల్లిఖార్జున రావు, శేషయ్య, కనమాల రాఘవులు, భీమవరపు సుబ్బారావు, జ్యోతి, సురేఖ, పలువురు కళాకారులు పాల్గొన్నారు .

సంక్షిప్తంగా..

బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో ఉండాలి

కొండపి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల నమోదు కోసం ఈనెల 9,10,23,24 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయన్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.మురళి తెలిపారు. ఆ నాలుగు రోజులు బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో ఉండాలని ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్షౌరశాలల సంఘ ప్రతినిధులు

19న కార్తీక వనసమారాధన

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పట్టణ క్షౌరశాలల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19వతేదీన ఒంగోలు సమీపంలోని వీఆర్ఎన్‌కే గ్రీన్ సిటీలో నాయిబ్రాహ్మణ కార్తీక మాస వనసమారాధన మహోత్సవం జరుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానికకొండమీద శివాలయంలో సోమవారం వనసమారాధన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొణిజేటి రామకృష్ణ , సంఘం సభ్యులు మాట్లాడారు.

9న దూర విద్య ఎంట్రెన్స్ పరీక్ష

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం నిర్వహిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ ఎంట్రెన్స్ పరీక్ష ఈనెల 9వతేదీన గీతం డిగ్రీ కాలేజీలో జరుగుతుందని ఆ కాలేజీ కరస్పాండెంట్ మన్నం నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 7వతేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.వివరాలకు 9849124970 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు కరాటే క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :68వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు క్రీడాకారుల ఎంపికలు ఈనెల 6వ తేదీన బుధవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ హాజీరా బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17, బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ : 9491665070ను సంప్రదించాలని అందులో సూచించారు.

గుండ్లాపల్లిలో పారిశుధ్య పనులు

మద్దిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):గుండ్లాపల్లిలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామంలో మురుగు నిలిచి దోమలతో ఎస్సీ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి లతీఫ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సోమవారం పారిశుధ్య పనులు చేయించారు.

ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

చీమకుర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ గ్రామవాసుల తాగునీటి అవసరాలు తీర్చేనిమిత్తం వ్యాపారవేత్త,తెలుగుదేశంపార్టీ నాయకుడు మేదరమెట్ల వెంకటేశ్వర్లుసహకారంతో నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంటును సోమవారం ప్రారంభించారు. దాదాపు పదిలక్షల స్వంత డబ్బును వినియోగించి ప్లాంట్ నిర్మించిన వెంకటేశ్వర్లును గ్రామస్థులుఅభినందించారు.

అపరాధ రుసుం విధింపు

సంతనూతలపాడు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి వైపునుంచి ఒంగోలు వైపునకు డస్టు, కంకర తదితర లోడుతో వెళ్తున్న టిప్పర్ వాహనాలను సోమవారం రాత్రి రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు మండలంలోని ఎండ్లూరు డొంకవద్ద ఆపి తనిఖీచేశారు. ఈతనిఖీలో 21 లారీలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో రూ.31,570లు అపరాధరుసుం విధించినట్లు తెలిపారు.

శివాలయాలకు కార్తీక శోభ

చీమకుర్తి,నవంబరు4(ఆంధ్రజ్యోతి): తొలి కార్తీక సోమవారంను పురస్కరించుకొని చీమకుర్తిలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.పట్టణంలోని హరిహరక్షేత్రంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు,శిద్దా లక్ష్మీపద్మావతి దంపతులు మూలవిరాట్‌ని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.

ఎంపీ మాగుంటకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని ట్రెజరీ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో సోమవారం ఎంపీ మాగుంటను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీని శాలువతో సత్కరించారు.


అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారంకోసం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం భవన్‌లో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపారు. ఆయా అర్జీలను పరిశీలించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్‌తో పాటు పలు శాఖలకు చెందిన ద్వితీయ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పరిచయం... ఉద్యోగం పేరుతో మోసం

ఒంగోలుక్రైం : ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తుండగా పరిచయం అయిన వ్యక్తి ఎయిర్ పోర్టులో హెల్పర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు. ఈమేరకు సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. తాళ్లూరు మండలానికి చెందిన ఓ యువకుడు ఉద్యోగ వేటలో ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తుండగా ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. ఎయిర్ పోర్టులో హెల్పర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 35 వేలు ఫోన్‌పే చేయించుకున్నాడు. తరువాత ఫోన్‌లిఫ్ట్ చేయకుండా ఇంకా పదివేలు పంపిస్తే సమాధానం చెబుతానని మెసేజ్ చేశాడని, అతనిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఎస్పీకి విన్నవించాడు. ఇంకా జిల్లా నలుమూలల నుంచి 74 మంది వివిధ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదులు చేశారు. ఆయా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో దిశా సీఐ సుధాకర్ ,డీటీసీ ఇన్‌స్పెక్టర్ సమీముల్లా, ఎస్సీఎస్టీ సెల్ సీఐ సుబ్బారావు తదితర స్టిబంది ఉన్నారు.

రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు

'పల్లె పండుగ' కింద మంజూరు

టంగుటూరులో భూమి పూజ చేసిన టీడీపీ నేతలు

టంగుటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు మేజరు పంచాయతీలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.80లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పలుచోట్ల రోడ్లు, కల్వర్టులు, కాలువలు నిర్మించనున్నారు. ఈ పనులన్నింటికీ సోమవారం టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు. అంబేడ్కర్‌నగర్, అరుంధతీవాడ, శివాలయం వెనుక బజారు, వడ్డెపాలెం, రజక వీధి, రావివారిపాలెం, చెల్లెమ్మతోటలో రోడ్లు, కల్వర్టులు నిర్మించనున్నారు. అంబేడ్కర్‌నగర్‌లో రెండు సిమెంటు రోడ్లు నిర్మించి సైడు కాలువల పునర్నిర్మాణం చేయనున్నారు. పాత పోస్టాఫీస్ ఎదురు మరొక రోడ్డు, ఊర చెరువులోని నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా అలుగు నిర్మాణం, రజక వీధిలో కల్వర్టు నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు. రావివారిపాలెం ఎస్సీ కాలనీలో రెండు సీసీ రోడ్లు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ నాయకుడు జక్కుల శ్రీనివాసరావు. వార్డు సభ్యుడు మక్కెన కోటేశ్వరరావు, పంచాయతీ ఈవో హరిబాబు. అంబేడ్కర్‌నగర్, అరుంధతీనగర్ ప్రజలు పాల్గొన్నారు.


అంబేడ్కర్‌నగర్‌లో భూమి పూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నైపుణ్య గణనపై సిబ్బందికి శిక్షణ

పొన్నలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్న 20లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా నైపుణ్య గణన చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 15 నుంచి 59 సంవత్సరాల లోపు వయసు ఉన్న వారి విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, మెరుగైన ఉద్యోగ ఆసక్తుల సమాచారాన్ని సేకరించాలని సూచించారు. అనంతరం ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు అంబటి నితిన్, డి.రవికుమార్ నైపుణ్య గణన చేయాల్సిన విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతో మేలు

రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ, మినుము, కంది, బొబ్బర్లు లాంటి పంటలను సాగు చేసుకుని ఆదాయం పొందాలని కొండపి మండల వ్యవసాయాధికారి డి.విజయకుమార్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం మూగచింతల, నెన్నూరుపాడు, పెరిదేపి గ్రామాల్లో పర్యటించారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి వారికి సూచనలు సలహాలు ఇచ్చారు. శనగ ఎద బెట్టే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. దీని వలన వేరుకుళ్లు తెగులును నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు కె.వెంకటరావు, జ్యోత్స్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.


భద్రతా ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న గ్రానైట్ క్వారీల యజమానులు, సిబ్బంది

భద్రతే ప్రామాణికంగా క్వారీయింగ్

● ఘనంగా ప్రారంభమైన భద్రతా వారోత్సవాలు

చీమకుర్తి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): భద్రతే ప్రామాణికంగా క్వారీయింగ్ కార్యకలాపాలను నిర్వహించాలని సౌత్‌సెంట్రల్‌జోన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ భూషన్‌ప్రసాద్‌సింగ్ కోరారు.రామతీర్థం వీటీసీలో 22వ భద్రతా వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీడీజీఎంతో పాటు డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సుప్రియే చక్రవర్తి, డీడీఎంఎస్ జ్ఞానేశ్వరరావులు పాల్గొన్నారు. వారోత్సవాల నిర్వాహక కమిటీ నాయకులు ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరినారాయణ, ఆర్‌ఆర్‌ఆర్ గ్రానైట్ మేనేజింగ్ పార్టనర్ ఆర్‌పీ రవిచంద్రన్,అసోసియేషన్ కార్యదర్శి అజీమ్‌లు ఘనస్వాగతం పలికారు. ముఖ్యఅతిధుల చేతులమీదుగా జెండా ఎగురవేసి వారోత్సవాలను ప్రారంభించారు.భద్రతా ప్రతిజ్ఞ నిర్వహించారు.

టెట్‌లో శ్రీవికాస్ విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు విద్య, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఎపిటెట్) పేపర్-1 ఫలితాల్లో స్థానిక శ్రీ వికాస్ కోచింగ్ సెంటర్ లో శిక్షణ పొందిన అభ్యర్థులు అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. ఒంగోలుకు చెందిన పి. చంద్రశ్రీ జిల్లా స్థాయిలో అత్యధికంగా 140.73/150, ఈ. మేరీరాణి 140.45/150, కె. అంజమ్మ 136.95/150 మార్కులతో టాపర్లుగా నిలిచారు. వికాస్‌లో శిక్షణ పొందిన వారిలో 20 మందికి పైగా 130కిపైగా, 50 మంది 125.3కు పైగా మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సెంటర్ కరస్పాండెంట్ కె. మోహన్‌రావు, డైరెక్టర్ పి. వీరయ్యలు అభినందించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వినతి

మద్దిపాడు, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని మద్దిపాడు మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు హైవే అధికారులను కోరారు. సోమవారం నేషనల్ హైవే అసోసియేట్ జనరల్ మేనేజర్ విజయభాస్కర్ మద్దిపాడులో డ్రైనేజీ కాలువలను పరిశీలించారు.



ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలి

ఒంగోలు(రూరల్)నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని ఎల్ఐసీ ఏజెంట్ల ఆరనైజేషన్ ఆఫ్ ఇండియా సీనియర్ నాయకులు కర్రి బాలచందర్ డిమాండ్ చేశారు. ఒంగోలు ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సోమవారం ఏజెంట్లు ఐఆర్‌డీఏఐ నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసనకార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ ఏజెంట్‌ల నాయకుడు కె.బాలచందర్ మాట్లాడుతూ బ్యాక్‌అప్ కమీషన్ పద్ధతి వల్ల ఏజెంట్‌లు పూర్తిగా నష్టపోతారన్నారు. అందువల్ల పాతపద్ధతిలోనే పాలసీలు కొనసాగించాలని కోరారు. ఈనూతననిర్ణయాలకు వ్యతిరేకంగా ఈనెల 11న నెల్లూరు డివిజనల్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో ఏజెంట్‌లు పెద్దఎత్తున పాల్గొన్నాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏజెంట్లు బి. వెంకట్రావు, రమణారెడ్డి, డి.మధుబాబు, ఎం .సుబ్బారావు, సీహెచ్ నరసింహారావు, సత్యనారాయణ, వెంకటరమణయ్య, బ్రహ్మానందం, బాబు, అంజయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అగ్రికల్చర్ డిప్లమో గ్రామ వ్యవసాయ సహాయకుల జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బత్తుల వెంకట సుబ్బయ్య(కనిగిరి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీరామ ఏడుకొండలు(ఉలవపాడు), గౌరవాధ్యక్షులుగా జక్కి గణేష్ సాగర్ (మార్కాపురం), ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వెంకటేశ్వర్లు(చీమకుర్తి)లను ఎన్నుకున్నారు. కోశాధికారిగా కే సుభాషిణీ (ఒంగోలు), ఉపాధ్యక్షులుగా ఎం. గౌస్ లాజం, ఎస్‌కే మస్తాన్, జి. సుమంత్, జి. రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా రాణా ప్రతాప్ నాయక్, బి. నవ్యభారతి, మృధులత, ఎస్‌కే అజారుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వినోద్‌కుమార్, మహిళా సెక్రటరీగా వానిరెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్‌కే అబీద్‌తో పాటు మరో 11 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు.

క్రైం సమాచారం

రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ఒంగోలు క్రైం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న కుంచాల సతీష్‌ను అరెస్టు చేసి అతని నుంచి రూ. 3.14 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె.మౌలా షరీఫ్ తెలిపారు. ఈ మేరకు జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ 3 నంబరు ప్లాట్ ఫాం వద్ద అనుమానాస్పదంగా ఉన్న సతీష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఇటీవల రైళ్లలో మూడు దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. అదే విధంగా అతని వద్ద 12గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్‌లు, రెండు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చీరాల నుంచి గూడూరు వరకు రైళ్లలో తిరుగుతూ దొంగతనాలకు సతీష్ పాల్పడుతుంటాడని అన్నారు. ఈ సమావేశంలో రైల్వే ఎస్సై టి.అరుణ, సిబ్బంది ఉన్నారు.

రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఒంగోలుక్రైం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో 2,3 ప్లాట్ ఫారంల మధ్య ఉత్తరం వైపున గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని సోమవారం రైల్వే పోలీసులు గుర్తించారు. ఎత్తు సుమారు 5.6 అడుగులు గల నల్లటి జుట్టు , పలుచని గడ్డం ఉన్న వ్యక్తి ఎడమచాతిపైన , కుడిచేతి కింద పుట్టుమచ్చలు ఉన్నాయి. రౌండ్ నెక్ టీషర్టు (బిస్కెట్ ,నలుపు,తెలుపు రంగు), బ్లాక్ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని రైల్వే ఎస్సై టి .అరుణ కుమారి తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440627647, 9440887143, 9966211677 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

● 37 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు చూపుతున్న సీఐ సురేష్

గిద్దలూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొదల కొండపల్లిలో చేరెడ్డి రమణరెడ్డి అనే బెల్టుషాపు నిర్వాహకుడిని అరెస్టు చేసి 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేష్ తెలిపారు. అక్రమంగా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అర్బన్ సీఐ సురేష్ ఈసందర్భంగా తెలిపారు.

22 మద్యం బాటిళ్ల పట్టివేత

బేస్తవారపేట : మండలంలోని ఖాజీపురం గ్రామంలో అక్రమంగా బెల్టు షాపు నడుపుతున్నట్లు సమాచారం రావడంతో దాచిఉంచిన 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు ఏస్సై రవీంద్రారెడ్డి తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన, బెల్టుషాపులు నిర్వహించినా, సమీప ప్రజలు సమాచారం అందించాలని ఆయనప్రజలను కోరారు.

వ్యవసాయ సహాయకుల జిల్లా సంఘం ఎన్నిక ఏకగ్రీవం

● జిల్లా అధ్యక్షుడిగా బత్తుల సుబ్బయ్య ప్రమాణ స్వీకారం



ఎన్నికైన నూతన కార్యవర్గం

పొదిలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు జిల్లా సంఘం ఎన్నిక సోమవారం నిర్వహించారు. సోమవారం స్థానిక వీరిశెట్టి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో. జిల్లా అధ్యక్షులుగా కనిగిరికి చెందిన బత్తుల సుబ్బయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీరామ ఏడుకొండలు, గౌరవ జిల్లా అధ్యక్షుడిగా జక్కి గణేష్, ఉపాధ్యక్షులుగా గౌస్ ఆదాం, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా సుభాషిణిని ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా రాణాప్రతాప్, నవ్యభారతి, షేక్ అజారుద్దీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా పదకొండు మంది ఈసీ మెంబర్లను కూడా ఎన్నుకున్నారు. భవిష్యత్తులో సంఘం బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నూతక కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గ్రంధే సురేష్, కార్యదర్శిగా గోనుగుంట్ల ప్రవీణ్

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ సోమవారం ఎన్నికైంది. అధ్యక్షులుగా గ్రంధే సురేష్, కార్యదర్శిగా గోనుగుంట్ల ప్రవీణ్, కోశాధికారిగా ఆరవిటి శివకేశవరావు ఎన్నికయ్యారు.

దీక్షధారులకు చద్ది, భిక్ష ప్రారంభం

గిద్దలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో దీక్ష తీసుకున్న భక్తులకు చద్ది, భిక్ష కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అయ్యప్ప, శివ, అంజనేయ, గోవింద తదితర స్వాముల మాలలు ధరించిన వారందరికీ ప్రతిరోజు మధ్యాహ్నం చద్ది, రాత్రి భిక్ష కార్యక్రమాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు దేవస్థాన కమిటి ప్రతినిధులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

● వేకువజాము నుంచే శివాలయాలకు బారులు తీరిన భక్తులు ● దీపాలు వెలిగించిన మహిళలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 4 ఆంధ్రజ్యోతి: పవిత్రమైన కార్తీకమాసంలో వచ్చిన సోమవారాన్ని మార్కాపురం పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయం వద్ద తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామి దర్శనానికి బారులు తీరారు. అర్చకులు ఏలూరి అంజనేయశర్మ, రెంటచింతల వరుణ్‌తేజశర్మలు మార్కండేశ్వరస్వామి, జగదాంబ మాతలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. నాగ శిలలకు పాలపోసి కార్తిక దీపాలు వెలిగించి నోములు నోచారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాలు, ఇళ్ల వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

కార్తీక మాస పూజలు

గిద్దలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస తొలి సోమవారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దక్షిణకాశిగా పేరొందిన గిద్దలూరులోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానానికి సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వచ్చారు. దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. పాతాళ నాగేశ్వరస్వామి వారికి పలువురు దంపతులు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. దేవస్థాన ఈవో శ్రీనివాసులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కే.ఎస్‌పల్లిలోని శ్రీభీమలింగేశ్వరస్వామి దేవస్థానంలో, పలుపులవీడు, ముండ్లపాడు శివాలయాలలో కార్తీక సోమవార పూజలు నిర్వహించారు. గిద్దలూరులోని కుసుమ హరనాథ మందిరంలో సామూహికంగా అభిషేక కార్యక్రమాలు చేశారు. వాసవి కన్యకాపరమేశ్వరి, వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాలలో గంగమ్మ, గౌరమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి దేవాలయం, షిర్డిసాయిబాబా దేవాలయంలలో సైతం కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహించారు.

ఘనంగా కార్తీక సోమవారం పూజలు

కంభం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కంభం, అర్ధవీడు మండలాలలో మొదటి కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలు వద్ద భక్తులు బారులు తీరారు. సోమవారం తెల్లవారుజామున 4గంటల నుంచే మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయం, రావిపాడు కోటేశ్వరస్వామి దేవాలయం, తురిమెళ్లలోని కనక సురభేశ్వరస్వామి దేవాలయాలలో భక్తులు స్వామి వార్లకు అభిషేకాలు చేసి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా శివాలయాల వద్ద భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు అన్నప్రసాదాలు అందించారు.





కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, చిన్నకంభంలో ఆది దంపతులకు విశేష పూజలు





స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు, మార్కాండేశ్వరస్వామి

పొగాకునారు ధరలకు రెక్కలు



మడుల్లో పొగనారు పీకుతున్న రైతులు

పొదిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు సాగు చేసిన పొగాకు తోటలతో పాటు నారుమడులు దెబ్బతిన్నాయి. దీంతో పొగనారు ధరలకు రెక్కలొచ్చాయి. స్థానికంగా నారు దొరక్క పోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి నారు అధిక ధరలకు తెచ్చి నాట్లు వేస్తున్నారు.

గతేడాది రైతులకు పొగాకు సాగు చేసిన రైతులు లాభాలు గడించారు. దీంతో మండలంలో పొగాకు సాగు కూడా బాగా పెరిగింది. అయితే డిమాండ్‌కు తగినట్లు నారు పుష్కలంగా అందుబాటులో లేదు. ఈ క్రమంలోనే వర్షాలకు పొగ తోటలతోపాటు నారుమడులు దెబ్బతిన్నాయి. తగినంత నారు లేకపోవడంతో సుదూర ప్రాంతం రాజమండ్రి వెళ్లి నారు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే నాటిన పొగా కు కూడా వర్షాలకు కుళ్లిపోవడంతో తిరిగి నాట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పొగనారు గిరాకీ అమాం తం పెరిగింది. నారుమడులు కొన్ని దెబ్బతినడం మరి కొన్నింటిలో తెగుళ్ల, గుళ్లరావడంతో నాణ్యతపై అనుమానం తో రైతులు ఉన్నారు. మడిలో ఉన్న నాణ్యమైన పొగాకునారుకు విపరీతమైన గిరాకీ పెరిగింది. ఇప్పటి వరకు పొగనారు మూట రూ.1500 ఉండగా, ప్రస్తుతం 4వేలకు పెరిగింది. ఎకరాకు దీంతో ఎకరాకు రూ.9వేలు నారుకే ఖర్చు అవుతోందని పొగాకు సాగు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు.

మూటలో తగ్గుతున్న మొక్కలు

నారుకు గిరాకీ పెరగడంతో మడులు ఉన్న యజమానులు సొమ్ము చేసుకొనే పనిలో పడ్డారు. గతంలో మూటలో 6 వేల మొక్కలు ఉండేవి. ప్రస్తుతం కేవలం 5వేలు మాత్రమే ఉంటున్నాయి. ఇప్పటి వరకు మండలంలో 6వేల హెక్టార్లలో పొగాకు సాగుచేసినట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది పొగాకుకు మంచి గిరాకీ రావడంతో ఈఏడాది సాగు విస్తీర్ణం పెరగ్గా, కొత్త బ్యారన్ల నిర్మాణాలు సైతం ఊపందుకున్నాయి. ఏది ఏమైనా ఇటీవల కురిసిన వర్షాలకు పొగాకు రైతుల పరిస్థితి అచమ్యగోచరంగా మారింది.

ఖర్చులు రెట్టింపు అవుతున్నాయి

గత ఏడాది ధరలను దృష్టిలో ఉంచుకొని పొగనాట్లు వేసే కూలీలు కూలిరేట్లు విపరీతంగా పెంచారు. గత ఏడాది రూ.300లు ఉన్న కూలీ ప్రస్తుతం రూ.500లకు పెంచి అడుగుతున్నారు. ఒక్క ఫెర్టీలైజర్ మినహా అన్నింటి ధరలు రెట్టింపు అయ్యాయి. నారు ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ ఏడాది పెరిగిన ఖర్చులకు పొగాకు రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి.

బీరం కృష్ణారెడ్డి రైతు

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

● ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

మార్కాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాశాల రోడ్డులోని 'ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నూతన శాఖను సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డిలు ప్రారంభించారు. బ్యాంకుశాఖలో పలు విభాగాలను ప్రారంభించేందుకు వారు రిబ్బన్ కత్తిరించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు బ్యాంకు శాఖను మార్కాపురంలో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, పీఎల్‌పీ యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దారవీడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు పెద్దారవీడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కె.కనకదుర్గ మాట్లాడుతూ ఈ నెల 2న చీమకుర్తిలో జరిగిన జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో అండర్-17, అండర్-14 విభాగాలలో పాఠశాలకు చెందిన జి.చరణ్య, జి.వైష్ణవి, జి.ప్రత్యూష రెడ్డి, జి.పావని, వీ.వెంకటేశ్వర్లు, ఎం.విజయకాంత్, ఎం.సుభాష్‌నాయుడులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు ఎంపికయ్యారన్నారు. వీరు ప్రకాశం జిల్లా తరఫున ఈ నెల 6, 7, 8, 29, 30 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు దామోదర్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

దోర్నాలలో రెండు బైకులు చోరీ

పెద్ద దోర్నాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దోర్నాలలో రెండు మోటార్‌సైకిల్లు చోరీకి గురైన ఘటన సోమవారం వెలుగు చూసింది. పెద్ద బొమ్మలాపురం గ్రామానికి చెందిన గాలి ప్రతాపరెడ్డి ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో తన మోటారుసైకిలును దోర్నాలలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద బయట పార్కింగ్ చేసి దైవ దర్శనం చేసుకుని తిరిగి బయటకు వచ్చి చూసే సరికి బైకు కనిపించలేదు. దీంతో పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈ క్రమంలో పెద్ద బొమ్మలాపురం గ్రామానికి చెందిన దుగ్గెంపూడి అల్లూరిరెడ్డి సోమవారం మధ్యాహ్నం స్థానిక నటరాజ్ కూడలిలో తన బైకు పార్కింగ్ చేసి షాపింగ్‌కు వెళ్లి తిరిగి వచ్చే సరికి మోటారు సైకిలు కనిపించ లేదు. దీంతో స్థానిక పోలీసు స్టేషనులో పిర్యాదు చేసినట్లు బాధితుడు చెప్పాడు. దోర్నాలలో వరుసగా బైకులు అపహరణకు గురవుతుండడంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు.

గ్రామచావిడి స్థలాన్ని వీఆర్వోల సంఘానికే కేటాయించాలి

●'మీ కోసం' కార్యక్రమంలో సంఘం నాయకుల వినతి




వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌వోల సంఘం నాయకులు

మార్కాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో దశాబ్దాలుగా గ్రామచావిడిగా కొనసాగిన స్థలాన్ని వీఆర్వోల సంఘానికే ఉంచాలని సంఘం డివిజన్ కార్యవర్గం సోమవారం 'మీ కోసం' కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ డివిజన్ అధ్యక్షులు సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ కేంద్రంలో తొలినుంచి రెవెన్యూ సిబ్బంది చావిడిని ఉపయోగించే వారన్నారు. గతంలో పనిచేసిన అధికారులు వీఆర్వోల సంఘానికి ఆ స్థలాన్ని కేటాయించారన్నారు. కొంతమేర అక్కడ నిర్మాణ పనులు కూడా జరిగాయన్నారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు అక్కడ ఆ శాఖ తరఫున పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు కూడా పంపారన్నారు. ఈ ప్రయత్నాన్ని విరమించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీఆర్వోలు నాసర్‌వలి, భాస్కర్‌రెడ్డి, వెంగళరెడ్డి, రామకోటేశ్వరరావు, గాలీబు, ధనంకుల రామయ్య, బాష, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో మొత్తం 20 వినతిపత్రాలు దాఖలయ్యాయి. సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ డీఆర్‌సీ సమావేశానికి జిల్లా కేంద్రానికి వెళ్లడంతో కార్యాలయ ఏవో కె.రవీంద్రారెడ్డి అర్జీలను స్వీకరించారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

● డీఎల్‌డీవో శీనివాసరెడ్డి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి

మార్కాపురం రూరల్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని డీఎల్‌డీవో శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో సచివాలయ ఉద్యోగులకు స్కిల్‌సెన్సెస్ శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు, వివిధ రంగాలలో వృత్తులు చేసుకునే వారికి వారి రంగాలలో నైపుణ్యాలు పెంచుకొనేందుకు ప్రభుత్వం వారి వివరాలను సేకరిస్తుందన్నారు. గ్రామాలలో వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారి వివరాలను సేకరించి వారికి అవసరమైన సామగ్రిని అందించి వారి జీవన ప్రమాణా లను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్ ఉప ఉపాధి అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో 15 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన వారి విద్యా అర్హత వివరాలను ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

త్రిపురాంతకం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని మేడపి సచివాలయంలో ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ, సోమవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రతి రైతుకు రూ. 20 వేలను పెట్టుబడి సాయం అందించేలా కృషి చేయాలన్నారు. ప్రస్తుత రబీ సీజనులో రైతాంగం సాగుచేస్తున్న పంటలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వమే బీమాసొమ్ము భరించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

పుల్లలచెరువు : ఎన్నికల హామీల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన పెట్టుబడి సహాయంను వెంటనే అందజేయాలని సీపీఐ మండల కార్యదర్శి జివి గురునాధం డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన పుల్లలచెరువు లో తహసీల్దారు మహమ్మద్ నయీంకు సీపీఐ నాయకులు రైతులతో కలిసి ఆయనకు వినతి పత్రం అందజేశారు.

నేలకు తగిన వంగడాలను ఎంచుకోవాలి

పొదిలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు పొగనాట్లు వేసేటప్పుడు మన నేలకు తగిన వంగడాలను ఎంచుకోవాలని ఐటీసీ డెవలప్‌మెంట్ మేనేజర్ వెంకటరావు కోరారు. నారుమడుల్లో నీటితడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం లద్దె పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. శాస్త్రవేత్తల సూచనల ప్రకారం పురుగు మందులు పిచకారీ చేయాలన్నారు. అనంతరం గురుగుబాడు గ్రామంలో పొగనారు మడులను పరిశీలించి యజమానులకు, రైతులకు పొగనారు అందించేటప్పుడు నాణ్యమైన నారు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వాహణ అధికారి షేక్ జైన్‌లుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి

బేస్తవారపేట, : రైతులు పొగాకు పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని ఏవో జక్కం మెర్సీ అన్నారు.సోమవారం మండలంలోని జగ్గంబోట్ల కృష్ణాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో జరిగిన రైతుల సమావేశంలో ఆమె రైతులకు పలు సూచనలు అందించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన



శిబిరం ప్రారంభిస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

కంభం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకంభం గ్రామంలో టీడీపీ యువనాయకుడు జలపాటి వెంకట లోకేష్ ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని టీడీపీ నాయకులు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో గ్రామంలోని వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు కళ్లద్దాలను ఉచితంగా అందచేశారు. కంటిలో శుక్లాలు, పొరలు ఉన్న వారికి నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. కార్యక్రమంలో కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట వెంకట శ్రీనివాసరావు, గ్రామపార్టీ అధ్యక్షులు అలవాల ప్రసాద్ పాల్గొన్నారు.

ఖాళీ ప్లేట్లతో మున్సిపల్ కార్మికుల నిరసన

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురు 20 రోజులుగా దీక్షలు చేస్తున్న కార్మికులు సోమవారం వినూత్నంగా ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. దీక్షలను ప్రాంభించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడారు. అక్రమంగా తొలగించిన తిరిగి విధుల్లోకి తీసుకునేవరకు పోరాటం ఆగదన్నారు.

రేపు దేవస్థాన షాపుల లీజుకు వేలం

పామూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానంలోని 12 షాపులకు గాను 11 షాపులలో వ్యాపారాలు నిర్వహించుకొనేందుకు వేలం నిర్వహిస్తున్నారు. మూడు సంవత్సరం పాటు లీజుకు ఇచ్చేందుకు బుధవారం దేవస్థాన ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు ఈవో శ్రీగిరిరాజు నరసింహా బాబు తెలిపారు. గతంలో దేవస్థానానికి సంబంధించిన స్థలంలో పలువురు ఎటువంటి అనుమతులు లేకుండా పక్కా కట్టడాలు నిర్మించుకొని వ్యాపారాలు చేస్తున్నారు. వీరిలో కొందరు అద్దెలు చెల్లిస్తుండగా, మరికొందరు ఈ షాపులపై దేవస్థానానికి సంబంధం లేదంటున్నారు. ఈనేపథ్యంలో గతనెల 24న దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు రంగంలోకి దిగారు. పోలీసుల పర్యవేక్షణలో షాపుల్లోని వస్తువులను బయటపడవేసి వాటిని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ షాపులను వేలంపాటలో దక్కించుకొనేందుకు పలువురు వ్యాపారస్తులు ఆసక్తి చూపుతున్నారు.

నేడు మర్రికుంటపల్లిలో గ్రామసభ

పీసీపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రికుంటపల్లిలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన భూముల రీసర్వేకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఈసభను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ముద్దపాడు రెవిన్యూ పరిధిలోని రైతులు గ్రామసభలో పాల్గొని తమ సమస్యలను వ్రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

వీపీఏల సంఘం అధ్యక్షుడిగా వెంకటసుబ్బయ్య

కనిగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ డిప్లొమో గ్రామ వ్యవసాయ జిల్లా సంఘం అధ్యక్షుడిగా కనిగిరికి చెందిన బత్తుల వెంకటసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కనిగిరి డివిజన్ పరిధిలోని పొదిలిలో వీరిశెట్టి జూనియర్ మహిళా కాలేజీలో సోమవారం కమిటీ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ వీపీఏల సమస్య పరిష్కారంలో తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వీపీఏల సంక్షేమం కోసం, హక్కుల కోసం తగిన కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైనా వెంకటసుబ్బయ్యను సహచర ఉద్యోగులు అభినందించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ముండ్లమూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై నిరుద్యోగులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. త్వరలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో కె.నాగరాజు, సూపరింటెండెంట్ కల్పన పాల్గొన్నారు.

బత్తాయిలో తెగుళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలి

కనిగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బత్తాయికి ఆశించే బంక తెగుళ్ళపై రైతులు జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాఖ ఏవో అంజలీభాయి అన్నారు. మండలంలోని ఏరువారిపల్లిలో బత్తాయి తోటలను సోమవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వాతావరణ ప్రభావంతో బంక తెగులుతో పాటు వేరుకుళ్ళు, పొలుసు పురుగు బత్తాయి తోటలకు ఆశిస్తాయని తెలిపారు. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ఘర్షణలో ముగ్గురికి గాయాలు

పామూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుచ్చుపొద గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. గ్రామానికి చెందిన గోసుల సురేంద్ర అలియాస్ చంటి, తిరుపాలురెడ్డి శనివారం రాత్రి మద్యం సేవించారు. ఆసమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణ పడ్డారు. ఆదివారం రాత్రి చంటి, కొలూరి రహంతుల్లా, ఆయన కుమారుడు నిజాముద్దీన్, హజరత్‌లు స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద ఉన్నారు. రాజీ చేస్తానని రహంతుల్లా తిరుపాలురెడ్డి ఇంటికి వెళ్లి మాట్లాడారు. దీంతో తిరుపాలురెడ్డి, అతని తమ్ముడు, తల్లి గుడివద్దకు వచ్చారు. అక్కడ కూడ మాటామాట పెరగడంతో తిరుపాలురెడ్డి కత్తితో నిజాముద్దీన్, చంటి, హజరత్‌లపై దాడి చేయగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.కిశోర్‌బాబు తెలిపారు.

ఐదు నెలల్లో ముగ్గురు తహసీల్దార్‌ల బదిలీ

- రెవెన్యూ సమస్యల పరిష్కారంకాక ప్రజల అవస్థలు
- ఇక్కడ పనిచేయడానికి పలువురు విముఖత
- సిబ్బంది నిర్వాకంతోనేనన్న అనుమానాలు?


తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయం

తాళ్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాళ్లూరు మండలంలో ముగ్గురు తహసీల్దార్‌లు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టి మండలంపై అవగాహన వచ్చేలోపే స్థానచలనం పొందుతున్నారు. దీంతో రెవెన్యూ సమస్యల పరిష్కారం నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికల సమయంలో పొరుగు జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ తిరిగి అక్కడికి వెళ్లారు. ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన పి.శింగారావు ఆగస్టు 8న బాధ్యతలు చేపట్టారు. నెలన్నర గడవకముందే ఆయన ఇక్కడినుంచి వెళ్లారు. సిబ్బంది కొరతతోపాటు, బాధ్యతగా విధులు నిర్వహించేవారు లేరన్న కారణంతో ఆయన సెప్టెంబర్‌లో తనకున్న పలుకు బడితో బాపట్ల జిల్లా పంగులూరుకు బదిలీ చేయించుకుని వెళ్లారు. మండలంలో14 సచివాలయాలకు గాను కేవలం ఏడుగురు వీఆర్వోలు మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరిలో కొందరు బదిలీలపై రావటంతో ఆగ్రామాలపై పూర్తి సమాచారం ఉండటంలేదు. దీనికితోడు వీఆర్వోల కొరతతో ప్రజలకు సకాలంలో పనులు జరగక జాప్యం జరుగుతున్నది. వీఆర్వోల సహకారం లేనందునే బదిలీపై వెళుతున్నట్టు తన సన్నిహితుల వద్ద తహసీల్దార్ శింగారావు వెల్లడించటం గమనార్హం.

ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా నుంచి కె.నాగలక్ష్మి బదిలీపై వచ్చారు. ఆమె సెప్టెంబర్ 24 బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించారు. కార్యాలయంలో అవినీతికి తావులేకుండా సేవలుచేస్తూ అనతి కాలంలోనే ప్రజల్లో గుర్తింపు పొందారు. తహసీల్దార్ కార్యాలయంలో సరిగా రికార్డులు లేవన్న కారణంతో కొన్ని దరఖాస్తులను తిరస్కరించారు. దీంతో అధికార పార్టీ నేతలు తమకు సక్రమంగా పనులు కావటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులను ఆన్‌లైన్ చేయమంటే రిజిస్టర్లు తెమ్మంటున్నారని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. తహసీల్దార్ వల్ల రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావటం లేదని ఆరోపిస్తున్నారు. ఆమెను మార్చి ప్రజలకు సత్వర సేవలు అందించే తహసీల్దార్‌ను నియమించాలని టీడీపీ మండల నేతలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌ల దృష్టికి ఇటీవల తీసుకెళ్లినట్టు తెలిసింది. ఆమె బాధ్యతలు చేపట్టి నెలా పది రోజులు గడవకముందే డిప్యుటేషన్‌పై జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీచేశారు. అక్కడ పనిచేస్తున్న ఏవో సంజీవరావును డిప్యుటేషన్ మీద తాళ్లూరుకు బదిలీ చేస్తూ ఆదివారం రాత్రి డీఆర్వో ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కూడా తాళ్లూరుకు వచ్చేందుకు విముఖత చూపుతూ పది రోజులపాటు సెలవుపై వెళ్లినట్లు తెలిసింది.

గత ప్రభుత్వంలో తహసీల్దార్ కార్యాలయంలో పనులు కాక రైతులు, ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. కూటమి ప్రభుత్వం రాకతో తమకు న్యాయం జరుగుతుందని ఆశించారు. అయితే, తరచూ తహసీల్దార్‌లు మారుతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలి


తహసీల్దార్‌తో మాట్లాడుతన్న టీడీపీ మండల అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి

తాళ్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు గ్రామ శివారున ఉన్న పాములకాలనీలో ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. వీటిని తొలగించి పాముల కాలనీవాసులకు న్యాయం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి తహసీల్దార్‌కు విన్నవించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పాముల కాలనీవాసుల కష్టాలను తహసీల్దార్ నాగలక్ష్మికి ఆయన వివరించారు. తమ స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూడాలని కాలనీవాసులు ముగ్గురు తహసీల్దార్‌లకు చెప్పినా న్యాయం జరగలేదన్నారు. ఆక్రమణదారుడు ప్రభుత్వం ఏర్పాటుచేసిన బోర్డులను తొలగించినా పట్టించుకోలేదన్నారు. తాను ఆక్రమణలు తొలగించలేనని ఎస్ఐ అంటున్నారని చెప్పారు. తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది తొలగింపు చర్యలు చేపడితే తాము బందోబస్తు కల్పిస్తామంటున్నారన్నారు. చొరవతీసుకుని ఆక్రమణప్రాంతాన్ని తొలగించాలని విన్నవించారు. తహసీల్దార్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఎస్ఐను సంప్రదించి తగు చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట టీడీపీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు అనపర్తి సుబ్బారావు, పాముల కాలనీవాసులు ఉన్నారు.

శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు


దర్శి శివాలయం వద్ద బారులుతీరిన భక్తులు

పామూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో తొలి సోమవారం సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. స్థానిక శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో వేకువజాము నుంచే మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు దేవస్థాన కమిటీ ఛైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, ఈవో నరసింహబాబు, అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. అలాగే, మండలంలోని పడమటకట్టకిందపల్లి గ్రామంలోని శ్రీశ్యామల కామాక్షి దుర్గామల్లేశ్వరుడు, దాదిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీపార్వతి సమేత నీలకంఠేశ్వరుడు, మోపాడులోని శ్రీగొంది మల్లేశ్వరుడు, బొట్లగూడూరులోని శ్రీరామలింగేశ్వర దేవస్థానాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

సీఎస్‌పురం మండలంలోని భైరవకోన శ్రీత్రిముఖ దుర్గాంబ దేవస్థానంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి అభిషేకాలు నిర్వహించారు.

దర్శిలో..

దర్శి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీక సోమవారం వేడుకలు వైభవంగా జరిగాయి. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శి పట్టణంలోని శ్రీఅన్నపూర్ణసమేతా కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, పోతకమూరు, పోతవరం శివాలయాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద రద్దీ ఆరంభమైంది. భక్తులతో పాటు మాలలు ధరించిన స్వాములు కూడా అధికసంఖ్యలో పాల్గొన్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు కార్తీకశోభను సంతరించుకున్నాయి. తాళ్లూరులోని రామలింగేశ్వరస్వామి, గుంటిగంగలోని శివాలయం, శివరాంపురంలోని అగస్త్యేశ్వరాలయం, బొద్దికూరపాడు, మాధవరం, లక్కవరంలోని శివాలయాల్లో వేకువజాము నుంచే భక్తులు శివుని దర్శించుకుని అభిషేకాలుచేపట్టి ప్రత్యేక పూజలు చేశారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించి పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. పులిపాడులోని ఊర్నేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవికి ప్రత్యేక అలంకరణ చేశారు.

పసుపుగల్లులోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణాదేవి, ఈదరలోని రాజరాజేశ్వరిదేవి, మారెళ్ళలోని చెన్నమల్లేశ్వరస్వామి, రావిపాడులోని రాజమల్లేశ్వరి దేవి, పోలవరం, పెదఉల్లగల్లు, ఉమామహేశ్వర అగ్రహారం తదితర గ్రామాల్లో ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి.



తాళ్లూరులో దోమల నివారణకు ఫాగింగ్

తాళ్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు గ్రామంలో దోమల నివారణకు సోమవారం ఫాగింగ్ చేపట్టారు. గ్రామంలో సీజనల్ జ్వరాలు వ్యాప్తిచెందడంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీవో కె.సుందరరామయ్య ఆదేశానుసారం సర్పంచ్ చార్లెస్ సర్జన్, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డిలు పంచాయతీ నిధులతో గ్రామంలోని మురుగు కాలువలో పూడిక తీత తీయించారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

కనిగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. సోమవారం మండలంలోని తాళ్ళూరు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యామ్నాయ పంటలైన మినుము, పప్పుశనగ పంటల సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సూపరింటెండెంట్ పి.కోటేశ్వరరావు, వ్యవసాయశాఖ ఏఓ జ్యోష్నాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని రైతులు పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని దర్శి ఏడీఏ కె.బాలాజీ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నూజెండ్లపల్లి, మారెళ్ళ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, మినుము, పెసర, శనగ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్, వీపీఏలు కె.ఆనంద్ కుమార్, టి.బాలవెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్లను పునరుద్ధరించాలి'

తాళ్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు సీఎం చంద్రబాబునాయుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను పునరుద్ధరించాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. తాళ్లూరు మండల కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఆయా కార్పొరేషన్‌లకు నిధులు కేటాంచకుండా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రకాశ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర దూషణ పోస్టింగ్‌పై కేసు నమోదు

కనిగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో, అసభ్యకరం దూషణతో సోషల్ మీడియా గ్రూపులో పోస్టింగ్ చేసిన యువకుడిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పట్టణం లోని ఎన్టీఓ కాలనీకి చెందిన యువకుడు నగరంలో జరుగుతున్న ఆక్రమణల తొలగింపు ప్రదేశాల్లోని ఓ సామాజిక వర్గాన్ని, ఆయా వర్గ ప్రముఖలను, రాజకీయ నేతలను దూషిస్తూ చేసిన పోస్టింగ్ పట్టణంలో చర్చకు దారి తీసింది. ఆదివారం రాత్రి ఆ సామాజిక వర్గానికి చెందిన వారు మౌఖికంగా ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు పోస్టింగ్ చేసిన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు యువకుడిపై కులదూషణ, ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేసి 41ఏ నోటీసు జారీ చేసినట్లు ఎస్ఐ టి.శ్రీరాం తెలిపారు.

బెల్ట్ షాపుపై ఎక్సైజ్ పోలీసుల దాడి

కురిచేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర గంగవరం గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న అంకసాని నాగరాజుపై దర్శి ఎక్సైజ్ పోలీసులు దాడిచేశారు. అతని వద్ద 180 ఎంఎల్ కేరళ మద్యం బాటిళ్ళు 9 ఉండగా, స్వాధీనం చేసుకుని నాగరాజును అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

అవీ ఇవీ

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ


అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ కార్యక్రమం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. టీడీపీ దర్శి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో అధికసంఖ్యలో మాలలు ధరించిన స్వాములు పాల్గొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు.

అక్రమ లేఅవుట్‌లో నిర్మాణాల తొలగింపు

దర్శి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లిలో అక్రమ లేఅవుట్‌లో నిర్మాణాలను అధికారులు సోమవారం తొలగించారు. రాజంపల్లి రెవెన్యూలోని నాలుగు ఎకరాల భూమిలో అనుమతులు లేకుండా ఆర్చ్ నిర్మాణంతో పాటు రోడ్లు వేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు అధికారులు నిర్మాణాలను తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి కాశీనాయక్ తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

ముండ్లమూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర పంచాయతీ పరిధిలోని కొమ్మవరం గ్రామ రేషన్ షాపుపై సోమవారం దర్శి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మీ ప్రసన్న దాడి చేశారు. షాపులో అదనంగా పది బస్తాలు బియ్యం ఉండటంతో రేషన్ షాపు డీలర్ మేకల సీతారెడ్డి పై 6(ఏ) కింద కేసు నమోదు చేశారు. అదనంగా ఉన్న బియ్యాన్ని సీజ్ చేశారు. అయితే, డీలర్ సీతారెడ్డి తాను ఏ తప్పు చేయలేదని, అనవసరంగా కొందరు తమపై కావాలనే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను పంపించారని తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు అడ్డుకట్ట


సీసీ కెమెరాల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

దొనకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టే అవకాశం ఉందని ఎస్ఐ విజయ్ కుమార్ పేర్కొన్నారు. దాతల సహకారంతో సోమవారం దొనకొండలో అంబేడ్కర్ విగ్రహం, ఎన్టీఆర్ విగ్రహం, రైల్వే స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద వీటిని ఏర్పాటుచేశారు. ఈసం దర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రధాన రహదారులు, కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో నేరాలను అరికట్ట వచ్చునని చెప్పారు. అన్నిప్రాం తాల్లో వీటి ఏర్పాటుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరంతోనే సామాజిక దురాచారాలకు అడ్డుకట్ట

పామూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సమాజంలో సామాజిక దురాచారాలను అక్షరంతోనే అరికట్టవచ్చునని తహసీల్దార్ బీవీ రమణారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా నివారణ, మహిళలు, పిల్లల రక్షణపై సోమవారం స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో వీఆర్వో, పంచాయతి కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బాలికల చదువు భవిషత్తుకు వెలుగు లాంటిదని అన్నారు. బాల్య వివాహాలతో పలు అనర్థాలు జరుగుతున్నాయన్నారు. వాటి నివారణ కోసం ప్రభుత్వాలు పలు చట్టాలు తీసుకొచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.సురేష్, ఎంఈవో -2 కరుణకుమారి, ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు, సీడీపీవో సరోజిని, సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలి

పామూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సూచించారు. పామూరు పట్టణంలో పలుచోట్ల ఉపాధి హామీ పథకం కింద 23 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి రూ.5 కోట్లు మంజూరుచేశారు. ఈక్రమంలో విరాట్ నగర్ కాలనీలో రూ.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోడ్ల నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలతో చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, నొస్సం నాగేంద్రచారి, ఎన్.సాంబయ్య, పందిటి హరీష్, పంచాయతీరాజ్ ఏఈ షేక్ మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులకు సహకరించాలి

పామూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనులకు సహకరించాలని తహసీల్దార్ బీవీ రమణారావు పేర్కొన్నారు. సింగరాయకొండ - మైదుకూరు 167-బి జాతీయ రహదారి నిర్మాణంతో పామూరులోని ఉత్తర బైపాస్ జంక్షన్ ప్రాంతంలో పలువురు భూములు, స్థలాలు కోల్పోతున్నారు. ఈక్రమంలో బాధితులు నష్టపరిహారం చెల్లించకుండానే పనులు ఎలా చేస్తారని అడ్డుకొంటున్నారు. వివాదంగా మారిన స్థలాలకు సంబంధించిన బాధితులు ప్రస్తుతం జేసీ కోర్టులో దావా వేసి ఉన్నారు. మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. సోమవారం తహసీల్దార్ ఆప్రాంతాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. ఈనెల 16న జిల్లా అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా జరుగుతున్న గ్రావెల్ పనులను అడ్డుకొంటే పోలీస్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయితే, నష్టపరిహారం ఇవ్వకుండా పనులు చేపట్టడం సమంజసం కాదని పలువురు పేర్కొన్నారు.

యోగాలో పతకాలు సాధించిన పామూరు విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్‌ఎం రామస్వామి, ఉపాధ్యాయులు

పామూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా స్థానిక పాఠశాలలో సోమవారం పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రామస్వామి మాట్లాడుతూ ఈనెల 2,3, తేదిల్లో నెల్లూరులో జరిగిన పోటీల్లో అండర్- 17 విభాగంలో కె.శాంతిని, వి.రజిని, ఆర్.కళాంజలి, ఏ.మనీషా, అండర్ -14 విభాగంలో జె.ప్రవల్లిక, జి.నందిని, పి.జూహాలు రాణించి తృతీయ స్థానంలో నిలిచారు.

ఈసందర్భంగా విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయిని మస్తానీలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



నరసరావుపేట: శ్రీకోటేశ్వరస్వామికి విశేష అలంకారం



అమరావతి: నదీతీరంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు



బాపట్ల : స్నానమాచరిస్తున్న భక్తులు

అధిక ప్రాధాన్యతతో అర్జీలు పరిష్కరించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అత్యధిక ప్రాధాన్యతతో ప్రజాసమస్యల పరిష్కారవేదికకు వచ్చే అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతిపత్రాల ద్వారా వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తన పరిధిలోని వాటికి తక్షణమే పరిష్కార మార్గం చూపగా కొన్నింటిని పరిశీలన, మరికొన్నింటిని విచారించాలని సంబంధితాధికారులను ఆదేశించారు. మిగిలినవి ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామని హామీనిచ్చారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ, డీఆర్‌డీఏ, పోలీసు, మార్కెటింగ్, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించి 140 అర్జీలు నమోదయ్యాయి. అధికారులు సమస్యల పరిష్కారంలో నిర్లిప్తంగా వ్యవహరించరాదన్నారు. చిత్తశుద్ధితో పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలు నుంచి సంతృప్తి స్థాయి పెరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూఅధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయల్ మెరైన్ కంపెనీపై దర్యాప్తు జరిపించాలి

రేపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాయల్ మెరైన్ కంపెనీపై దర్యాప్తు జరిపించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జైభీమ్‌భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవరమేష్‌రాంజీ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో రాయల్ మెరైన్ కంపెనీపై దర్యాప్తు జరిపించాలంటూ వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ అస్వస్థతకు గురైన మహిళా కార్మికులకు నష్టపరిహారం అందించాలని, పని దినాలు కోల్పోయిన వారికి నగదును అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిపాటి కేజేలు, పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, కొచ్చర్ల విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ జలాశయం



నిండుకుండలా..

● పూర్తి నీటి నిల్వతో జలాశయాలు కళకళ
● నాగార్జున సాగర్‌లో 306 టీఎంసీలు
● పులిచింతలలో 45.1 టీఎంసీలు
● ఇంకా కొనసాగుతున్న నీటి ప్రవాహం
● 11 లక్షల ఎకరాలకు సాగు నీరు
● వచ్చే ఏడాది కూడా నీటికి ధోకా ఉండదని అంచనా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగర్ ఆయకట్టులో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతోంది. పంటల సా గుకు పుష్కలంగా నీటిని అందిస్తోంది. అన్నదాతల మోములో ఆనందం వెల్లి విరు స్తోంది. నాగార్జున సాగర్ జలాశయానికి కృ ష్ణమ్మ పోటెత్తింది. రికార్డు స్థాయిలో 5.60 లక్ష ల కూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. జూ లై మాసం చివరిలో జలాశయానికి ప్రారంభ మైన వరద ప్రవాహం నేటికి కొనసాగుతూనే ఉంది. గతంలో నీటి నిల్వలు పరిశీలిస్తే నవం బరు నెలలో రికార్డు స్థాయిలో సాగర్‌లో నీటి నిల్వ ఉండటం విశేషం. నాగార్జున సాగర్.. ది గువన ఉన్న పులిచిం తల జలాశయాలు నిండుకుండల ను తల పిస్తున్నాయి. సాగర్ కుడి కాలువ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని కుడి కాల్వ ఆయకట్టులోని 11.11 లక్షల ఎకరాలకు సాగునీరు అంది స్తున్నా రు. వచ్చే ఏడాదికి కూడా సాగు నీరు కు ఢోకా ఉండదని అంచనా వేస్తున్నారు. వరద ప్రవాహం ఇంకొన్ని రోజులు కొనసాగవ చ్చని జలవనరుల శాఖ అధికారులు అంచనా.

నాగార్జునసాగర్ జలాశయంలో 98 శా తం మేర నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎం సీలు. సోమవారం డ్యాంలో నీటి నిల్వ 305.86 టీఎంసీలు ఉంది. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ 590 అడుగులకు గాను 587.60 అడు గుల నీటి మట్టం ఉంది. జలాశయానికి 37,659 కూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు, విద్యుత్

పులిచింతల జలాశయం



ఉత్పత్తికి వినియోగిస్తున్న నీటితో కలసి మొత్తం 47,261 క్యూసెక్కుల నీటిని డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు. సాగార్జున సాగర్ దిగువన ఉన్న కేఎల్‌రావు పులిచింతల జలాశయం కూడా పూర్తిస్థాయి నీటి నిల్వతో తొణికిసలాడు తోంది. ఈ జలాశయం కూడా ఆగస్టు రెండో వారంలో నిండింది. అప్పటి నుంచి నేటి వరకు పూర్తి స్థాయి నీటి నిల్వ కొనసాగుతోంది. పులిచింతల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసీలు కాగా 45.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 174.57 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయంలోకి నీటి ప్రవాహం 29,846 క్యూసెక్కులు. ఇక్కడ నుంచి 26,945 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అమాత్యా.. ఆలకించరూ..?

ఐదేళ్ళుగా పేరుకుపోయిన సమస్యలు
పరిష్కారంపై ప్రజల ఆశ
నేడు మొదటి డీఆర్సీ సమావేశం
హాజరవుతున్న మంత్రులు

బాపట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) తొలి సమావేశం కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి అధ్యక్షతన నేడు జరగుతుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జిల్లాలో తొలి డీఆర్సీ సమావేశం ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థ సారథి సారథ్యంలో కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాలులో మంగళవారం జరగనుంది. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు డీఆర్సీ సమావేశంలో పాల్గొననున్నారు. మంత్రి పార్థసారథి తొలుత పాట్ హోల్ ఫ్రీ ఏపీ(గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం వ్యవసాయ కళాశాలలోని సెమినార్ హాలులో జరిగే డీఆర్సీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సూర్యలంక రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో కూటమిపార్టీల నేతలతో పాటు కార్యకర్తలతో మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఇన్‌చార్జి మంత్రి సమావేశం కానున్నారు. పర్చూరు, బాపట్ల ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మలు న్యూజిలాండ్ పర్యటనలో ఉన్నందున వారు డీఆర్సీకి హాజరుకావడం లేదు.

మరోవైపు డీఆర్సీలో ఖరారు చేసిన అజెండాపై అధికారులు ఇప్పటికే సమగ్ర నివేదికలు సిద్ధం చేసుకున్నారు. గత ప్రభుత్వంలో శంకుస్థాపనకే పరిమితమైన పనులతో పాటు జిల్లా అభివృద్ధికి దోహదం చేసే ఇతర ప్రాజెక్టుల అవసరాన్ని కూడా పీపీటీ ద్వారా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తేవడానికి సిద్ధమయ్యారు

ఈ సమావేశంలో అజెండాలో పొందు పరిచిన అంశాలతో పాటు జిల్లాలోని నియోజకవర్గాల్లో దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారం, నూతన అభివృద్ధి పనులకు మార్గమం సుగమం అవుతుందని ఆయా నియోజకవర్గాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇదే తొలి డీఆర్సీ సమావేశం కావడం అందుకు కారణం. ఆయా ప్రధాన సమస్యలపై ఆంధ్రజ్యోతి ఫోకస్..

బాపట్లలో నియోజకవర్గంలో..

విద్యాకేంద్రంగా విరాజిల్లుతున్న బాపట్లకు సూర్యలంక సముద్రతీరం పర్యాటక కిరీటంగా ఉంది. ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు రెండు తెలుగురాష్ట్రాలు నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. కార్తీకమాసంలో అయితే భక్తజన సందడి నెలకొని ఉంటుంది. నిత్యం పర్యాటకులతో కోలాహలంగా ఉండే సూర్యలంక సముద్రతీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటంలో పాలకులు విఫలమవుతూనే ఉన్నారు.

చీరాల నియోజవర్గంలో ...

చీరాల మండలం వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కలగానే మిగిలింది. నేటికీ స్థల సేకరణ పూర్తి స్థాయిలో జరగలేదు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం బాలారిష్టాలు దాటి పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని వేల మందికి ఉపాధి దొరకుతుంది. పర్యాటకంగా అభివృద్ధికి అనువైన తీరప్రాంతం ఎక్కువగా ఉంది. దాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. చీరాల ఫైరాఫీసు గేటు వద్ద ఆర్‌వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి) నిర్మాణం ప్రతిపాదనల దశ దాటి ముందడుగు పడలేదు. చీరా ల మండలం ఈపురుపాలెంలో ఆటోనగర్‌కు ఉన్న అడ్డంకులు తొలగించి, సమస్యను పరిష్కరించడం. వేటపాలెం మండలం నాయినిపల్లి వద్ద చేనేత పార్కు నిర్మాణం డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) దాటి మంజూరు కావాల్సి ఉంది. ఉచిత ఇసుక విధానంలో లోటుపాట్లు, అసైన్డ్ భూములు పరాధీనం తదితర అంశాలు. తీరప్రాంత గ్రామాల ప్రజలకు శాశ్వత తాగునీటి సౌకర్యం, అర్హులైన నిరుపేదలకు నివాస స్థలాలు. చీరాల అర్బన్, చీరాల, వేటపాలెం మండలా పరిధిలోని గ్రామాల్లో పూర్తిస్థాయిలో ము రుగు పారుదల సౌకర్యం కల్పించేందుకు డ్రైనేజీల ఏర్పాటు. చీరాల, బాపట్ల జంట నగరాలుగా అభివృద్ధి చెందేందుకు ఉమ్మడి ప్రణాళిక చేపట్టాల్సి కార్యాచరణపై నిర్ణయాలు తీసుకోవల్సి ఉంది. వీటిపై ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

సాగుకు చివర.....ముంపునకు ముందర...

వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవించే కుటుంబాలు బాపట్ల నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్నాయి. సాగుకు చివర...ముంపుకు ముందర అన్నట్లు ఈ ప్రాంతం ఉంది. సముద్ర తీరప్రాంత గ్రామాలకు సాగునీరు అందించే పంటకాల్వలు ఐదేళ్ళగా మరమ్మత్తులకు నోచుకోలేదు. అదేవిధంగా డ్రైనేజీలు ఆధునీకరించలేదు. ఈస్ట్,వెస్ట్ శ్యాంప్ డ్రైన్‌లతోపాటు మిగిలిన డ్రైన్‌లు కూడా పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయకపోవటం వల్ల తూటి,తుంగ పెరిగిపోయి నీటి ప్రవహానికి అడ్డుగా మారుతున్నాయి. దీనివల్ల ఇటీవల కురిసిన భారీవర్షాలకు కాల్వల కట్టలు తెగి నీరు పొలాలోకి వెళ్ళి ముంపకు గురయ్యాయి. ఆతర్వాత ఎగువ ప్రాంతాలు నుంచి వచ్చే నీరు మొత్తం నల్లమడడ్రైన్, పేరలిడ్రైన్, ఈస్ట్ తుంగభద్రడ్రైన్, తెనాలి డ్రైన్‌ల ద్వారా సముద్రంలోకి వెళ్ళిన తర్వాత మాత్రమే ఈప్రాంతంలో ముంపుకు గురైన పొలాలలోని నీరు బయటకు వెళ్ళటం ప్రారంభించింది. కట్టలు పటిష్టంగా లేకపోవటం, కాల్వలు మరమ్మత్తులకు నోచుకోకపోవటం వల్ల తీరప్రాంతం తరుచూ ముంపుకు గురై రైతులు నష్టపోతున్నారు. తీర ప్రాంతం కావటం వల్ల సాగునీరు రావాలంటే ఆలస్యమౌతుంది. అదే వరదల సమయంలో అయితే ఎగువప్రాంతం నుంచి వచ్చే నీటితో ముందుగా ముంపుకు గురవుతుంది. దీనికి పరిష్కారం డ్రైనేజిలు, ఇరిగేషన్‌కాల్వలు ఆధునీకరించాలి.

పర్చూరు నియోజకవర్గంలో..

పర్చూరు లేదా మార్టూరులలో పోలీస్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల ఏర్పాటు. దీంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మార్గం సుగమం. బకింగ్‌హామ్ కెనాల్ ద్వారా గతంలో మాదిరిగా జలరవాణాకు చర్యలు. మోటుపల్లి పల్లెపాలెం వద్ద ఓడల నిర్మాణ కేంద్రం ఏర్పాటు. దీనికి సంబంధించి ఇటీవల కేంద్ర బృందం పల్లెపాలెంలో పరిశీలన చేసింది. అవి సాకారమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని వేలమందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. ఇంకొల్లు, పర్చూరులలో ఆటోనగర్ ఏర్పాటు. ఇంకొల్లులో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ డిపో ఏర్పాటుకు కార్యాచరణ. పర్చూరు, మార్టూరు మండలాల పరిధిలో ఇనామ్ భూములు, ఎస్టేట్ భూముల సమస్యలు పరిష్కరించడం. గుంటూరు చానల్ పనులు వేగవంతం చేయడం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో రక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు. ఫిల్టర్ బెడ్డుల ఏర్పాటు. కొమ్మమూరు, సాగర్ ఆయకట్టు పరిధిలో ఎప్పటిప్పుడు సాగు నీరు రైతులకు సక్రమంగా అందేవిధంగా చర్యలు. నియోజకవర్గ పరిధిలో సుమారు 25వేల మందికి నివేశన స్థలాల పంపిణీ. గ్రామీణ రహదారుల మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణం తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు సూచిస్తున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

నిలిచిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణం...?

గత ప్రభుత్వం హయాంలో బాపట్ల పట్టణంలోని జమ్ములపాలెం రోడ్డులో మెడికల్ కళాశాల, 500పడకల ఆసుపత్రి, నర్సింగ్‌కళాశాల నిర్మాణ పనులను ప్రారంభించారు. 2021 మే31న వర్చువల్ విధానంలో శంఖుస్థాపన చేసి రెండు సంవత్సరాలు తర్వాత పనులు ప్రారంభించారు. దీని నిర్మాణానికి 55 ఎకరాల భూమిని సేకరించారు. నాబార్డు నిధులు 505కోట్ల రూపాయలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. బేస్మెంట్ వరకు నిర్మించారు. పనులు వేగవంతంగా జరుగుతున్న సమయంలో ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గుత్తేదారు నిర్మాణ పనులు నిలిపివేసి యంత్రాలు మొత్తం తీసుకెళ్ళిపోయాడు. దీంతో జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల వస్తుందని ఆశించిన వారంతా ఆలోచనలో పడ్డారు.

అద్దంకి నియోజకవర్గంలో..

అద్దంకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గంలో ప్రధానంగా కొరిశపాడు యర్రంచినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం, భవనాసి రిజర్వాయర్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సంతమాగులూరు, బల్లికురవ మండలాలలో అగ్రహారం, ఈనాం భూముల సాగుదారులైన రైతులకు హక్కు పత్రాలు అందించే విషయంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతుంది. అద్దంకి-దర్శి రోడ్డులో అద్దంకి పట్టణం సమీపంలో గుండ్లకమ్మ నదిపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. పట్టణంలో నామ్ రోడ్డు విస్తరణ జరగకపోవడం, బైపాస్ రోడ్డు ప్రతిపాదన దశలో కూడా లేకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. నామ్ రోడ్డు నిర్మాణ పనులు గోపాలపురం, ఏల్చూరులో అసంపూర్తిగా నిలిచిపోయాయి. రైతులకు పరిహారం ఇంకా అందలేదు. సాగర్ ఆయకట్టు చివరి భూములకు నీటి కష్టాలు తీరేందుకు భవనాసి నుంచి ఎత్తిపోతల ఏర్పాటు ప్రతిపాదనల దశలోనే ఉంది. ఇక పలు రోడ్లు శిథిలావస్థకు చేరి రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారాయి. రవికుమార్ మంత్రిగా ఉండడంతో మంగళవారం జరిగే డీఆర్‌సీ సమావేశం లో సమస్యల పై చర్చ జరిగి పరిష్కారం వైపు అడుగులు పడతాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



బాపట్ల మండలం జమ్ములపాలెంరోడ్డులోని ఈస్ట్‌డ్రైన్‌లో పెరిగిపోయిన తూటి, తుంగ



అర్ధంతరంగా ఆగిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతం



శిథిలావస్థలో ఉన్న గుండ్లకమ్మ బ్రిడ్జి



రిజర్వాయర్ పనులు ఆగిపోయిన భవనాసి చెరువు

గుంతల రోడ్లకు మోక్షం!





● మరమ్మతులకు భారీగా నిధులు
● మూడు జిల్లాల్లో ముమ్మరంగా పనులకు శ్రీకారం
● ఇప్పటికే ఆర్‌అండ్‌బీ శాఖకు చేరిన నిధులు

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనా నిర్వాకంతో గుంతలూరుగా పేరుమోసిన ఉమ్మడి గుంటూరుజిల్లా రహదారులకు ఎట్టకేలకు శాప విమోచన కలుగుతోంది. రాష్ట్రంలోని రోడ్లపై గుంతలు కనిపించకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ' కార్యక్రమంతో రోడ్ల మరమ్మతులకు మోక్షం కలిగింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన రాష్ట్ర రహదారులు చాలా చోట్ల గుర్తించడానికి కూడా వీలు లేనంతగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లను బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం తొలి అడుగుగా మరమ్మతుల కార్యక్రమాన్ని చేపట్టింది. అందుకోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు భారీ మొత్తంలో నిధులు కేటాయించింది.

● ఘోరంగా దెబ్బతిన్న రోడ్లు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతినిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకే గుంటూరు, పల్నాడు డివిజన్ల పరిధిలో 400 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయి. గడిచిన ఐదేళ్లలో కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో దెబ్బతినని రోడ్డు కూడా లేదు. రోడ్ల అభివృద్ధి మాట ఎలా వున్నా మరమ్మతులకు, ప్యాచ్ వర్కుల కోసం ఈఈలకు కేటాయించే నామమాత్రపు నిధులు కూడా వైసీపీ ప్రభుత్వం కేటాయించలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో కిలో మీటరుకు రూ. 25వేలుగా వున్న మరమ్మతుల ఖర్చులను రూ. 40 వేలకు పెంచి నానా హడావుడి చేసింది. కానీ ఆచరణలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో కనీసం గుంతలో మట్టి పోసేందుకు కూడా కాంట్రాక్టర్లు రాకుండా ముఖం చాటేశారు. దీంతో ఆ రోడ్లపై అడుగుతీసి అడుగు వేయాలంటేనే నరక ప్రాయంగా, ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. ఈ రోడ్లను ఇప్పటికి ఇప్పుడు బాగు చేయడం, కొత్త రోడ్డు వేయడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రంపై అది భరించలేని భారమే కాకుండా, చాలా సమయం పట్టే అవకాశం

(మిగతా 6వ పేజీలో..)

మీరే రండి

● సీఈవో ఆదేశాలు బేఖాతరు
● సచివాలయాల్లోనే కూర్చుంటున్న బీఎల్‌వోలు
● పట్టభద్రుల ఓటరు దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి రావాలని ఆదేశం
● అటెస్టు చేసిన కాపీలు, ఒరిజినల్ డిగ్రీ తీసుకురావాలని సమాచారం
● ఇంటింటికి వెళ్లి పరిశీలించేందుకు బద్ధకిస్తున్న సెక్రటరీలు

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఆదేశాలు అంటే జిల్లాలో లెక్క లేకుండా పోయింది. పట్టభద్రుల ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొన్న ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి డాక్యుమెంట్లను పరిశీలించాలని ఆయన విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల బీఎల్‌వోలు వాటిని ఉల్లంఘిస్తున్నారు. దరఖాస్తుదారుల/ కుటుంబంలో ఎవరో ఒకరికి ఫోన్ చేసి మీ ఇంట్లో ఫలాన వ్యక్తి గ్రాడ్యుయేట్స్ ఎన్నికల ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొన్నారు. ఒరిజినల్ డిగ్రీ, అటెస్టు చేసిన కాపీ, ఆధార్, ఓటరు ఐడీ జిరాక్స్ కాపీలను తీసుకొని సచివాలయానికి రావలాల్సిందిగా ఆదేశిస్తున్నారు. ఎవరైనా గట్టిగా మాట్లాడితే తామే వస్తామని చెబుతున్నారే కానీ గంటల తరబడి నిరీక్షించినా బీఎల్‌వోలు రావడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో భాగంగా నియమితులైన గ్రామ/వార్డు సెక్రెటరీలలో కొందరు ఇంకా ఆ ప్రభుత్వంలోనే ఉన్నామన్న రీతిలో ప్రవర్తిస్తున్నారు. పనితీరుని ఏమాత్రం మార్చుకోవడం లేదు. సచివాలయాలకు రావడం, ఫీల్డ్‌కు వెళ్లకుండా అక్కడే కూర్చుని అన్నింటిని ఫోన్‌లో చక్కబెట్టుకోవాలని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయితే వారికి ఎలాంటి పని లేకపోవడంతో చివరికి ఎన్నికల విధులను సక్రమంగా

(మిగతా 6వ పేజీలో..)


విచారణ చేస్తున్న ఈవోఆర్డీ రామకృష్ణ

నా భర్త రెండు చోట్ల చనిపోయారు

- పంచాయతీ మెట్లు ఎక్కిన భార్య
- గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో అసలు మృతి
- అక్కడి నుంచే మొదటి డెత్ సర్టిఫికెట్
- ఎవరికీ తెలియకుండా చీరాలలో
- మరో డెత్ సర్టిఫికెట్ సృష్టించిన కోడలు
- ఆస్తి వివాదాలే కారణమని భార్య ఆరోపణ
- విచారణ చేపట్టిన అధికారులు

దేవాంగపురి (చీరాలటౌన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ఎవరైనా ఒక్కసారే చనిపోతారు. ఒకే ఒక్క మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికెట్) ఉంటుంది. కానీ చీరాల మండలం దేవాంగపురి పంచాయతీలో వృద్ధుడు రెండు సార్లు మృతి చెందాడు. దీనికి నివేదిక ఇస్తూ సాక్షాత్తు అధికారులే డెత్ సర్టిఫికెట్లను అందజేశారు. ఆ వృద్ధుని భార్య రోడ్డెక్కడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పద్మనాభుని రామారావు (91) వయోభారంతో కూడితో అనారోగ్యంతో ఈ ఏడాది మార్చి 18న మృతిచెందారు. ఈక్రమంలో గుంటూరు వైద్యశాల నుంచి అతడి డెత్ సర్టిఫికెట్ కూడా అందింది. అయితే ఆస్తి విషయమై వివాదాలు ఉన్న నేపథ్యంలో అతని పెద్ద కోడలు అంకిశెట్టి నాగసాయి స్థానికంగా ఉన్న ఉనికితో ఏప్రిల్ 10న పంచాయతీ పరిధిలోనే మామ చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ పొందారు. దీంతో రామారావు భార్య పద్మనాభుని జయలక్ష్మి మండలస్థాయి అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవోఆర్డీ రామకృష్ణ సోమవారం విచారణ చేపట్టారు. ఈక్రమంలోనే రిపోర్ట్ తయారు చేసిన ఏఎన్ఎం నాగమణి, దాని ప్రకారం సర్టిఫికెట్‌ను జారీ చేసిన అప్పటి పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి చర్యలు చేపట్టనున్నట్లు ఈవోఆర్డీ చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పెద్ద కోడలు జాండ్రపేట హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. అయితే దీనిపై వాస్తవ అవాస్తవాలు తేలాల్సి ఉంది.

ఆడపిల్ల పుట్టిందని..

అదనపు కట్నం కోసం వేధింపులు .. కేసు నమోదు

అద్దంకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్ల పుట్టిందని, అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన పరిటాల శ్రీకాంత్, స్వప్నకు 3 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. శ్రీకాంత్ సాఫ్ట్‌వేర్ కావడంతో కొంతకాలం హైదరాబాద్‌లో ఉన్నారు. వీరికి పాప పుట్టింది. ఆడపిల్ల పుట్టిందని, అదనపు కట్నం కావాలని భర్తతో పాటు కుటుంబసభ్యులు వేధిస్తున్నారు. పుట్టింటిలో ఉన్న స్వప్నతో పాటు కుటుంబ సభ్యులను, పెదనాన్నపై ఆగస్టు 15న శ్రీకాంత్ దాడి చేశారు. ఈ సంఘటనపై సోమవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పొలం వివాదంలో పరస్పరం దాడులు

- ఏరియా వైద్యశాలలో చేరిన రెండు వర్గాలు
- గతంలో ఇదే తరహా ఘర్షణలో మహిళ మృతి
- రిమాండ్‌లో పలువురు


ఏరియా వైద్యశాలలో దరిశి వెంకటేశ్వర్లు

చీరాలటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు రోడ్డులోని కీర్తివారి పాలెం పెట్రోల్ బంకు వెనుక వైపున ఉన్న పొలాలకు సంబంధించిన వివాదం చాలాకాలం తారాస్థాయికి చేరింది. గవినివారి పాలెంకు చెందిన దరిశి వెంకటేశ్వర్లు, పెర్లవారి పాలెంకు చెందిన పెర్ల గంగయ్యకు చాలాకాలంగా పొలం వివాదం నడుస్తుంది. గతంలో మరో వర్గంతో నెలకొన్న వివాదంలో వెంకటేశ్వర్లు కుమార్తె ఎలుకా జ్యోతిని పెట్రోల్ పోసి అంటించారంటూ ఇచ్చిన మరణ వాంగ్మూలం ఆధారంగా కేసులో పలువురు రిమాండ్‌కు కూడా వెళ్లారు. అయితే తాజాగా సోమవారం మరోపొలం వద్ద వెంకటేశ్వర్లు అతని భార్య మంగమ్మపై పెర్ల గంగయ్య మరి కొందరు దాడిచేసి గాయపరచారు. చాకుతో నుదుటిపై కూడా దాడిచేశారు. దీంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందగా అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే రెండు వర్గం కూడా హాస్పిటల్‌కు చేరారు. రెండు ఘటనలపై ఈపూరుపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఆటోలో వృద్ధుడు మృతి

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చీరాలటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెంలో గుర్తుతెలియని వృద్ధుడు ఆటోలో ప్రయాణిస్తూ చీరాల ఏరియా వైద్యశాల సమీపానికి వచ్చేసరికి మృతిచెందారు. దీంతో ఈపూరుపాలెం పోలీసులు అతడి వివరాలను సేకరిస్తున్నారు. వయోభారం, అనారోగ్యంతో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

అలవలపాడులో పట్టపగలు చోరీ

బంగారం అపహరించినట్లు మహిళ ఫిర్యాదు


బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ వినోద్‌బాబు

పంగులూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలవలపాడు గ్రామంలో సోమవారం పట్ట పగలు చోరీ జరిగింది. గ్రామానికి చెందిన గుంజి అణిత సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో పనుల నిమిత్తం పొలం వెళ్లింది. ఇంటికి తాళం వేసి పొలం వెళ్లిన అణిత సాయంత్రం 3 గంటల సమయంలో ఇంటికి చేరుకుంది. ఆమె వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువా తలుపులు తెరుచుకొని ఉండడం చూసి ఆశ్చర్య పోయారు. బీరువాలో దాచుకున్న మూడు జతల కమ్మలు, రెండు మాటీలు, బంగారు చైను, తాళిబొట్టు చోరీ అయినట్లు గుర్తించారు. అవి 30 గ్రాముల వరకు ఉంటాయని అంచనా. చోరీ విషయాన్ని బాధితురాలు అణిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు ఇంటిని, బీరువాను పరిశీలించారు. చోరీ ఘటనను పరిశీలించి క్లూస్‌టీంను రప్పించే ప్రయత్నం చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.

కొనసాగుతున్న రిలే దీక్ష

వేటపాలెం(చీరాల), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పందిళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరిందని, దానిని వెంటనే పునఃనిర్మించాలని కోరుతూ సీహెచ్ రాంబాబు చేపట్టిన రిలే దీక్ష సోమవారం 3వ రోజుకు చేరింది. పలువురు గ్రామస్థులు ఆయనకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం నుంచి హామీ వచ్చే వరకూ దీక్ష కొనసాగుతుందని రాంబాబు తెలిపారు.

అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

- దాతల సాయంతో ఏర్పాటు
- ఫ్యాక్షన్ గ్రామంలో పనిచేయని నిఘా నేత్రాలు
- గతంలో జంట హత్యలు జరిగిన వేమవరంలో పరిస్థితి ఇలా
- పెరిగిన వ్యవసాయ మోటార్ల చోరీలు
- పట్టించుకోని పోలీసు శాఖ

బల్లికురవ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో శాంతి భద్రతలను కట్టు దిట్టం చేసి కొత్త వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు, చోరీలను నియంత్రించేందుకు దాతల సహకారంతో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారానికే పరిమితమయ్యాయి. వీటి నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంతో ఇప్పుడు గ్రామాలలో రాత్రుళ్లు రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లు చోరీలు సైతం అధికమయ్యాయని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా గతంలో జంట హత్యలు జరిగిన వేమవరంలో కూడా సీసీ కెమెరాలు మూలన పడి ఉన్నాయని దీంతో దాతల సాయం వృథా అయిందని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన సమయంలో పోలీసు శాఖ ఎంతో ఆర్భాటంగా దాతలను ముందుకు తీసుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన ఇప్పుడు అవి నిరుపయోగంగా మారడంతో ప్రజలు తీవ్ర అవేదన చెందుతున్నారు.

బల్లికురవ మండల కేంద్రంతో పాటు జంట హత్యలు జరిగిన ఫ్యాక్షన్ గ్రామం వేమవరం, అధిక సంఖ్యలో పరిశ్రమలు ఉన్న వేమవరం నాలుగు రోడ్ల కూడలీతో పాటు పలు గ్రామాలలో గత రెండేళ్ల కిందట పోలీసు అధికారులు దాతల సహకారం తీసుకుని రూ.లక్షలు వెచ్చించి నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వేమవరంలో ఉన్న సీసీ కెమెరాలు పనిచేడం లేదు. ఈ గ్రామంలో గత ఏడేళ్ల నుంచి పోలీసు బీటు అలానే జరుగుతోంది. కానీ నిఘా నేత్రాలు మూగబోయాయి. మండల కేంద్రంలోని సంతమాగులూరు రోడ్డు, అద్దంకి రోడ్డు, సంతమాగులూరు రోడ్డు, మార్టూరు రోడ్డుకు ఇరువైపులా ప్రజల కదలికలు రికార్డు అయ్యేలా నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి మెదట్లో ఏర్పాటు చేసిన సమయంలో ప్రజలు మనకు ఇంకా దొంగల బారి నుంచి కొంత విముక్తి కలుగుతందని ఎవరైన


ఫ్యాక్షన్ గ్రామం వేమవరంలో అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

చోరీలకు వచ్చిన వారి వివరాలు తెలుస్తాయని అందరూ భావించారు. కానీ సీసీ కెమెరాలు రెండేళ్ల నుంచి పని చేయడం లేదు. నలువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు కెమెరాలు దిష్టిబొమ్మల్లా వేలాడుతున్నాయి. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగి గుర్తు తెలియని వాహనాలు వస్తే వాటిని గుర్తించేందుకు కెమెరాలు బాగా ఉపయెగపడేవి అని కాని మరమ్మతులు చేయించకుండా అలానే వదిలి వేయడం వలన నిఘా నేత్రం నిద్రపోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాతలు ఇచ్చిన సాయం వృథా అవుతుందని వారు తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో కూడా దాతల సహకారంతో సీసీ కెమెరాలను గతంలో ఏర్పాటు చేశారని వాటిని కూడా పరిశీలించి అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రానున్నది వ్యవసాయ సీజన్ అని రైతులు పంట పొలాలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని గుర్తు తెలియని దొంగలు గ్రామాలకు వస్తే వారిని గుర్తించేందుకు ఈ కెమెరాలు బాగా ఉపయెగ పడతాయని ప్రజలు తెలిపారు.

గ్రామాలలో పెరిగిన రైతుల మోటార్ల చోరీలు

మండలంలోని అన్ని గ్రామాలలో గత నాలుగు మాసాల వ్యవధిలో పెద్ద ఎత్తున వ్యవసాయ మోటార్ల చోరీలకు గురయ్యాయని రైతులు విలపిస్తున్నారు. కొందరు గుర్తు తెలియని దొంగలు రాత్రి సమయంలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైర్లను దొంగిలిస్తున్నారని, చోరీలను నియంత్రించేందుకు గ్రామాలలో సీసీ కెమెరాలు లేవని రైతలు అంటున్నారు. గతంలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదని, దీంతో దొంగలు రోజు రోజుకూ రెచ్చిపోతున్నారని ప్రజలు అంటున్నారు. పోలీసు అధికారులు తక్షణమే గ్రామాలలో మరో మారు దాతల సహకారాన్ని తీసుకుని సీసీ కెమెరాలను వినియెగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


పరిశ్రమలు అధికంగా ఉన్న వేమవరం నాలుగు రోడ్ల కూడలీలో పనిచేయని సీసీ


బల్లికురవ మండల కేంద్రంలో నిరుపయెగంగా ఉన్న సీసీ కెమెరాలు

అంతర్రాష్ట్ర దొంగలు ఐదుగురి అరెస్టు

- రూ. 23.18 లక్షల సొత్తు, 1.350 గ్రాముల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలుక్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనేక చోట్ల దొంగతనాలతో పాటు గంజాయి విక్రయాలు చేస్తున్న ఐదుగురిని పొదిలి పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ ఏఆర్. దామోదర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిసా రాష్ట్రానికి చెందిన మహేది హుస్సేన్ , ఒంగోలు విజయ్‌నగర్ కాలనీకి చెందిన షేక్ కృపారావు, తాళ్ళూరు మండలం రామభద్రాపురంనకు చెందిన వడిషన్ వేణుగోపాల్‌రెడ్డి ,చీమకుర్తికి చెందిన షేక్ తరణ్, ఎర్రగొండపాలెంనకు చెందిన అవుల బ్రహ్మయ్యలను పొదిలి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పొదిలిలో అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరంతా పొదిలి, టంగుటూరు, వినుకొండ, కందుకూరు, నెల్లూరు, బాపట్ల ,తెనాలి ,అద్దంకి ప్రాంతాలలో అనేక దొంగతనాలు చేసినట్లు అంగీకరించారన్నారు. వీరంతా విశాఖపట్నం నుంచి గంజాయి తెచ్చి పొదిలిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ ప్లాట్లలో కూర్చొని మాట్లాడుకుంటుండగా పొదిలి పోలీసులు వారిని పట్టుకొని విచారించగా అనేక దొంగతనాలు చేసినట్లు అంగీకరించారని ఎస్పీ వెల్లడించారు. ఈమేరకు వారి వద్ద నుంచి 303 గ్రాముల బంగారం, 1.350 గ్రాముల గంజాయి, మోటర్‌బైక్‌తో పాటు రూ. 6,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు దొంగతనాలు చేయడమే కాకుండా గంజాయి తెచ్చి ఒంగోలు పరిసర ప్రాంతాలలో విక్రయిస్తుంటారని వివరించారు.

దొంగల నేర చరిత్ర ఇదీ

ఒడిసాకుచెందిన మహేది హుసేన్ గంజాయి తెచ్చి విక్రయాలు చేస్తుంటాడు. ఒక దొంగతనం కేసులో నిందితుడు. ఒంగోలుకు చెందిన కృపారావుపై 23 చోరీకేసులు ఉన్నాయి. వడిషన్ వేణుగోపాల్‌రెడ్డిపై 11 కేసులు, తరుణ్‌పై 2 కేసులు,ఆవుల బ్రహ్మయ్య ఒక కేసులో నిందితులుగా ఉన్నారు.

పోలీసులకు అభినందనలు

గంజాయి విక్రయాలుచేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పట్టుకున్న దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ , పొదిలి సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్సై వి.వేమన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలతో పాటుగా ,రివార్డులను అందజేశారు.

ప్రభుత్వ భవనాల ప్రాంగణంలో చిల్లచెట్లు


ఆర్‌డబ్ల్యూఎస్, క్వాలిటీ కంట్రోల్ డివిజన్ కార్యాలయాలు, ముళ్లచెట్లు, పొదల మధ్య కార్యాలయాలు, నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- మందు బాబులకు అడ్డా
- కన్నెత్తి చూడని అధికారులు
- సర్వత్రా విమర్శలు

పర్చూరు, నవంబరు 4 : ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల ప్రాంగణం చిల్లచెట్లు, ముళ్ల పొదలతో అడవిని తలపిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మరో పక్క ప్రాంగణంలో నీరు కూడా నిలిచిపోయి కొద్దిపాటి వాగును తలపిస్తున్నా తమకెందుకులే అన్నట్లుగా అధికారులు మౌనంగా ఉండడంపై సర్వత్రా విమర్శలకు తావువిస్తోంది. ఇంకోపక్క ప్రభుత్వ స్థలం అన్యాక్రాం తానికి గురవు తున్నా ఇది తమ పనికాదన్నట్లుగా అధికారులు ఉండడంతో ఆక్రమణదారులకు అడ్డూఅదుపులేకుండా పోయింది. సమీపంలోని నివాసాల నుంచి నేరుగా మురుగు నీరు ప్రాంగణంలోకి పంపుతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దాదాపు ఆరు ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఉంది. అందులో ఆర్‌డబ్ల్యూఎస్ సబ్‌డివిజన్ కార్యాలయంతోపాటు, క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం, వాటర్ టెస్టింగ్ కార్యాలయంతో పాటు, అధికారుల క్వార్టర్స్‌కూడా ఉన్నా యి. అధికారులు స్థానిక నివాసాలు ఉండక పోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించే కాంట్రాక్టర్లతో రద్దీగా ఉండే కార్యాలయ ప్రాంగణంలో బురద, మురుగు నీటితో దర్శనమిస్తున్నా చూస్తూ అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంపై చర్చ సాగుతోంది. ప్రభుత్వ కార్యాలయం ప్రాంగణాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. పగలు రాత్రి అనే వ్యత్యాసం లేకుండా ముళ్ల పొదలు, చిల్లచెట్ల మధ్య తాగుతున్నారు. వీటి చుట్టూ నివాసముంటున్నవారు రాత్రి సమయాల్లో ఆ సమీపంలో రాకపోయలు సాగించాలంటే ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గోమాతకు సీమంతం

- సంప్రదాయబద్ధంగా పూలు, చీర, సారె సమర్పణ
- బంధువులు, గ్రామస్థులకు భోజనం


గోమాతకు సీమంతం చేస్తున్న మహిళలు

పర్చూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గోమాతకు అరుదైన గౌవరం దక్కింది. కార్తీక తొలి సోమవారం రోజు చూడితో ఉన్న గోమాతకు సీమంతం చేసి రైతు దంపతులు అభిమానం చాటుకున్నారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా, పర్చూరు మండలం, చెన్నుంబొట్ల అగ్రహారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పశుపోషకుడు కామిశెట్టి హనుమంతురావు, సుబ్బాయమ్మ దంపతులు ఇంట్లో ఉన్న రెండు గోమాతలకు 9 నెలలు నిండిన సందర్భంగా భక్తిశ్రద్ధలతో సీమంత కార్యక్రమం నిర్వహిం చారు. బంధుమిత్రులతో పాటు గ్రామస్థులను ఆహ్వానించారు. సం ప్రదాయబద్ధంగా ఇంటో గర్భిణికి ఎలా సీమంతం చేస్తారో అదే పద్ధతిలో గో మాతకు సీమంతం చేశారు. ఆవును పూలతో అం దంగా అలంకరించి, బొట్టు పెట్టి, చీర, సారెను బహూకరించారు. అనంతరం ఆనందంగా భోజనాలు చేశారు.

వాహనాల ఫిట్‌నెస్ బాధ్యత ప్రైవేటుకు

రవాణా శాఖలో కీలక మార్పులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రవాణా చేసే వాహనాల ఫిట్‌నెస్ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించనున్నారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో అధికారులు ఇప్పటికే టెండర్లు కూడా ఆహ్వానించారు. జిల్లాలో గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో ప్రైవేటు వారు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అక్కడ పూర్తి సాంకేతిక పద్ధతులలో వాహనాల ఫిట్‌నెస్‌ను చేసే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఇక నుంచి వాహనదారులు రవాణా శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇప్పటికే రాష్ట్రంలో అనంతపురం, నంద్యాలలో ఇలాంటి ఫిట్‌నెస్ సెంటర్లు ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. వాహనాలకు ఎలాంటి మరమ్మతులు ఉన్నా సాంకేతిక పద్ధతిలో గుర్తించి ఫిట్‌నెస్ ఉంటేనే సర్టిఫికెట్లు ఇస్తారు. ఎలాంటి చిన్న లోపాలు ఉన్నా అనుమతి లభించదు.

ఏడాదికి ఒకసారి తప్పనిసరి

జిల్లాలో వివిధ రకాల వాహనాలు సుమారు 30వేలు ఉన్నాయి. ఈ వాహనాలు బ్రేక్, ఫిట్‌నెస్‌ల విషయాలను ప్రైవేటు ఏజెన్సీలు చూస్తాయి. సరుకు రవాణా చేసే ఆటోలు, లారీలు, కమర్షియల్ ట్రాక్టర్లు, పాఠశాల బస్సులు, ప్రైవేటు బస్సులు తదితర వాహనాలు అన్నీ ఏడాదికి ఒకసారి ఫిట్‌నెస్ చేయించుకుని సర్టిఫికెట్లు పొందాల్సి ఉంది. అయితే ఈ ప్రైవేటు ఏజెన్సీలపై పర్యవేక్షణ రవాణా శాఖకు ఉండాలని సంబంధిత అధికారులు తమ యూనియన్ల ద్వారా డిమాండ్ చేస్తున్నారు. సాంకేతిక పద్ధతుల ద్వారా ఫిట్‌నెస్‌లు సక్రమంగా జరగవు అనే వాదన వారు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏజెన్సీల ఏర్పాటుకు జాప్యం జరుగుతుంది. దీనిపై ఉన్నతాధికారులు ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

సాంకేతిక పద్ధతుల ద్వార ఫిట్‌నెస్

ఫిట్‌నెస్ చేయాల్సిన వాహనాలను ప్రైవేటు ఏజెన్సీలు నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఏర్పాటు చేసిన స్కానర్ల మధ్య ఉంచుతారు. పూర్తిగా స్కాన్ చేసిన తరువాత వాహనానికి ఎక్కడైనా సమస్యలు ఉన్నాయా అనేది కంప్యూటర్‌లో తెలిసిపోతుంది. జిల్లాలో రవాణా వాహనాలు సుమారుగా 30 వేలు ఉన్నాయి. ఒంగోలు రవాణా శాఖ ఉప కమిషనర్ కార్యాలయం పరిధిలో 24,776 ఉండగా మార్కాపురంలో 5,225, దర్శిలో 45 మాత్రమే ఉన్నాయి. అత్యధికంగా ఆటోలు 10వేలకుపైగా ఉన్నాయి. లగేజి ఆటోలు 2,700, కమర్షల్ ట్రాక్టర్లు 3700, లారీలు 8,500, స్కూలు బస్సులు 600, ప్రైవేటు బస్సులు 500, అంబులెన్స్‌లు, మోటర్‌క్యాబ్‌లు 1100, అంబులెన్స్‌లు 100, ట్రాక్టర్ ట్రాలీలు 1,500 మిగిలినవి ఇతర వాహనాలు ఉన్నాయి.

గుంతల రోడ్లకు మోక్షం!

(5వ పేజీ తరువాయి)

వుంది. ఈ నేపథ్యంలో తక్షణ మరమ్మతులపై ప్రభుత్వం, ఆర్ అండ్ బీ శాఖ దృష్టి సారించాయి.

● గుంటూరు జిల్లాకు.. 11.93 కోట్లు

విభజిత గుంటూరు జిల్లాలో రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చి తాత్కాలిక ప్యాచ్‌లు వేయడం కోసం ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. వివిధ దశల్లో చేపట్టే ఈ పనులకు రూ. 11.93 కోట్లు కేటాయించారు. గుంటూరుజిల్లాలో 17 మేజర్ జిల్లా రహదారుల తక్షణ మరమ్మతుల కోసం రూ. 5.78 కోట్లు, 7 రహదారుల్లో ప్యాచ్ వర్కుల కోసం రూ. 73 లక్షలు విడుదల చేశారు. వింజమూరు, పల్లెపాడు, వడ్లమూడి, సాలపాడు, నారాకోడూరు, అనంతవరపాడు జిల్లా రోడ్లలో తక్షణ మరమ్మతుల కోసం మరో 55 లక్షలు, పెదనందిపాడు- బాపట్ల, పొన్నూరు- కాకుమాను, గుంటూరు- అమరావతి, మాచవరం- అల్లూరు, గుంటూరు- తెనాలి రాష్ట్ర రహదారుల తక్షణ మరమ్మతులకు 352 కోట్లు, కొల్లూరు- కొల్లిపర, గుంటూరు చీరాల రోడ్లలో ప్యాచ్ వర్కుల కోసం రూ. 55లక్షలు కేటాయించారు. గుంటూరు- పర్చూరు రాష్ట్ర రహదారికి రూ. 60లక్షలు, గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల్లో రహదారుల మరమ్మతుల కోసం మరో రూ. 20 లక్షలు, పొన్నూరు- కాకుమాను రోడ్డులో కల్వర్టు కోసం రూ. 12లక్షలు, కేటాయించారు.

● బాపట్ల జిల్లాకు 16.83 కోట్లు

బాపట్ల జిల్లాలో అద్దంకి- కొణికి, మాచవరం- అల్లూరు, తెనాలి- చందోలు, బాపట్ల- సూర్యలంక, బ్రాహ్మణకోడూరు- భట్టిప్రోలు- రేపల్లె రాష్ట్ర రహదారుల మరమ్మతుల కోసం రూ. 80.5 లక్షలు, గుంటూరు- చీరాల రహదారి ప్యాచ్ వర్కు కోసం రూ. 72.5 లక్షలు, రేపల్లె- నిజాంపట్నం రోడ్డులో కల్వర్టు కోసం రూ. 34 లక్షలు కేటాయించారు. వేమూరు నియోజకవర్గంలో బ్రాహ్మణ కోడూరు- భట్టిప్రోలు రోడ్డుకు, అద్దంకి నియోజకవర్గంలో అద్దంకి- సంతమాగులూరు రోడ్డుకు, పర్చూరు నియోజకవర్గంలో ఇంకొల్లు- పంగులూరు, చీరాల- ఒంగోలు, బాపట్ల- పర్చూరు, పర్చూరు- జాగర్లమూడి రాష్ట్ర రహదారుల మరమ్మతులకు రూ. 155 లక్షలు కేటాయించారు. బాపట్ల జిల్లాలో 32 జిల్లా రహదారుల్లో మరమ్మతుల కోసం రూ. 1060.70 లక్షలు(10.61 కోట్లు), ప్యాచ్ వర్కుల కోసం రూ. 70 లక్షలు, మరో 13 రోడ్లకు మరమ్మతుల నిమిత్తం రూ. 176 లక్షలు, ప్యాచు వర్కులకు రూ. 35 లక్షలు కేటాయించారు.

● పల్నాడు జిల్లాకు.. 6.65 కోట్లు

నరసరావుపేట డివిజన్ పరిధిలో 8 జిల్లా మేజర్ రహదారులకు మరమ్మతుల కోసం రూ. 223.9 లక్షలు, 13 రోడ్లలో ప్యాచ్ వర్కుల కోసం రూ. 142.2 లక్షలు, కొండవీడు ఘాట్ రోడ్డు కోసం రూ. 6 లక్షలు, మాచర్ల- గుటూరు జిల్లా రహదారికి మరమ్మతుల కోసం రూ. 40 లక్షలు కేటాయించారు. ఈ జిల్లాలో రాష్ట్ర రహదారుల్లో 7 చోట్ల మరమ్మతుల కోసం రూ. 172.5లక్షలు, ప్యాచ్ వర్కుల కోసం రూ. 79.85 లక్షలు కేటాయించారు. అయితే ఇప్పటికే ఆయా జిల్లాలో మరమ్మతు పనులు చేపట్టారు. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. పలు నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ముందుకు నడిపిస్తున్నారు.

మీరే రండి

(5వ పేజీ తరువాయి)

నిర్వహించడానికి కూడా బద్ధకిస్తున్నారు. ప్రస్తుతం కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నిక కోసం ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 6వ తేదీ వరకు ఓటరుగా నమోదు అయ్యేందుకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నది. ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్న వారివి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించే బాధ్యతని బీఎల్‌వోలకు ఎన్నికల సంఘం అప్పగించింది. ఈ బీఎల్‌వోలలో చాలామంది సచివాలయాల సెక్రెటరీలు ఉన్నారు. బీఎల్‌వోలుగా ఎవరైతే అడ్మిన్ సెక్రెటరీలున్నారో వారు ఇంటింటికి వెళ్లి ఓటరు దరఖాస్తులను పరిశీలించేందుకు ఇష్టపడటం లేదు. ఎవరైనా తమ ఆఫీసుకు రావాల్సిందేనన్న ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఈ విషయంలో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ జారీ చేసిన ఆదేశాలు కూడా వారి చెవికెక్కడం లేదు. సోమవారం గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలు డోర్-టూ-డోర్ వెరిఫికేషన్‌కు వెళ్లకుండా తాపీగా ఆఫీసుల్లోనే కూర్చుని రమ్మని ఫోన్లలో సమాచారం ఇచ్చారు. కొందరికైతే తామే వస్తామని చెప్పి అన్ని పత్రాలను సిద్ధంగా పెట్టి ఉంచుకోవాలని చెప్పి తీరా ముఖం చాటేశారు. ఆఫీసులకు వెళ్లకుండా చాలామంది గంటల తరబడి నిరీక్షించినా బీఎల్‌వోలు రాకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. దీనిపై ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బీఎల్‌వోలపై చర్యలు తీసుకొంటాం

పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవడం వరకే వారి పని. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన బాధ్యత బీఎల్‌వోలదే. బీఎల్‌వో అంటేనే బూత్ స్థాయి అధికారి అని. ఇప్పటికే టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఈ విషయంలో స్పష్టంగా ఆదేశాలు జారీ చేశాం. ఆరు జిల్లాల్లో ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకొంటాం. అవసరమైన డిసిప్లినరీ యాక్షన్ చేపడతాం.

- ఎన్ఎస్‌కే ఖాజావలి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, గుంటూరు డీఆర్‌వో

శింగరకొండలో నిత్యాన్నదానం

- అన్ని రకాల వంటకాలతో రోజూ భోజనం
- రాత్రి సమయంలోనూ వడ్డనకు ఏర్పాట్లు
- ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు
- అనూహ్యంగా పెరిగిన భక్తుల సంఖ్య

అద్దంకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలో దశాబ్ద కాలం క్రితం ప్రారంభించిన నిత్య అన్నదానంకు ప్రస్తుతం భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఒకప్పుడు శింగరకొండలో స్వామి వారి అన్నదానం పట్ల భక్తులు కొద్ది మంది మాత్రమే ఇష్టపడేవారు. తప్పని పరిస్థితులలో మాత్రమే కొంత మంది భక్తులు క్యూలైన్‌లో నిలబడి టోకెన్‌లు తీసుకొని తినేవారు. ఇప్పుడు పద్ధతి మారింది.. క్యూలైన్‌తో పని లేదు... నేరుగా అన్నదాన మండపం దక్కరకే వెళ్లవచ్చు.. మరింత రుచికరంగా తయారు చేస్తున్నారు. అదే సమయంలో అధికారులు అన్నదానంపై ప్రత్యేక దృష్టి సారించడంతో భక్తులు పలు రకాల వంటకాలతో పుష్టి గా తింటున్నారు. గతంలో అన్నదానం నిర్వహణ, నాణ్యతపై భక్తుల నుంచి పలు సందర్భాలలో విమర్శలు


అన్నం వండేందుకు ఉపయోగించే బాయిలర్‌లు


భక్తులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

వచ్చాయి. అయితే ఇటీవల ఈవోగాబాధ్యతలు చేపట్టిన తిమ్మానాయుడు గతంలో ఇదే దేవాలయంలో పనిచేసిన అనుభవం ఉండడంతో బాధ్యతలు చేపట్టిన వెంటనే అన్నదానం పై ప్రత్యేక దృష్టి సారించారు. తిమ్మానాయుడు బాధ్యతలు తీసుకుంటున్నారన్న విషయం తెలుసుకోవడం, రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల లడ్డూలు, అన్నదానం పై పలు రకాల విమర్శలు రావడంతో సరుకుల సరఫరా టెండర్ దారులు ఒక్కసారిగా ఉలిక్కిపడి ఉన్న స్టాకును కూడా వెనక్కి తీసుకు పోయి నాణ్యమైన సరుకులు సరఫరా చేసినట్లు తెలిసింది. ఇటీవల వరకు శింగరకొండ దేవస్థానంలో మధ్యాహ్న సమయంలో మాత్రమే పరిమిత సంఖ్యలో అన్నదానం ఉండేది. గత మంగళవారం నుంచి రాత్రి సమయంలో కూడా అన్నదానం ప్రారంభించారు. గతంలో శనివారం 500 మంది, ఆదివారం 350 మంది, మిగిలిన రోజులలో 200 మంది కి మా త్రమే అన్నదానం జరిగేది. ప్రస్తుతం మధ్యాహ్నం సమయంలో శనివారం 700 నుండి 800 మంది, మిగిలిన రోజులలో 500 మంది కి పైగా అన్నదానం కు వస్తున్నారు. రా త్రి సమయంలో 50 మంది తో ప్రారంభించగా ప్రస్తుతం 100 కు చేరారు. ఇక అన్నదానం లో మొక్కుబడి ఆహార పదార్థాలు కాకుండా పొంగలి, పులిహోరతో పాటు పలు రకాల కూరలు, అప్పడాలతో భోజనం పెడుతున్నారు. అన్నం వండటానికి ప్రత్యేకంగా బాయిలర్‌లు ఉన్నాయి. ప్రస్తుతం అయ్యప్ప దీక్షా భక్తులు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. అన్నదానంకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగితే అన్నదాన మండపం ముందు అప్పటికప్పుడు టెంట్‌లు వేసి అదనంగా భోజనాలు వడ్డిస్తున్నారు. శింగరకొండ వచ్చిన భక్తులు అన్నం కోసం ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో అధికారులు పనిచేస్తుండడంతో సుదూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి సమయంలో భోజనం ఏర్పాటుతో కష్టాలు తప్పాయి



రాత్రి సమయంలో కూడా అన్నదానం ఏర్పాటు చేయడంతో దేవాలయంలో నిద్రల కోసం వచ్చే భక్తులకు భోజనం కష్టాలు తప్పాయి. మధ్యాహ్నం, రాత్రి స్వామివారి ప్రసాదం తినే అదృష్టం దక్కింది.

\- వరలక్ష్మి, ఒంగోలు

అన్నదానం రుచిగా ఉంది



దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం రుచిగా ఉంది. పలు రకాల కూరలతో పాటు పొంగలి, పులిహోరతో రుచికరమైన భోజనం పెడుతున్నారు.

\- ఆదెమ్మ, నడింపల్లి, దర్శి మండలం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

జవాబుదారీగా పని చేద్దాం

- అధికారులు, ప్రజాప్రతినిధులకు
- ఎమ్మెల్యే కొండయ్య పిలుపు

చీరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రతినిధులైనా, అధికారులైనా సమష్టిగా ప్రజలకు జవాబుదారీగా పనిచేసి మెరైగన సేవలు అందిద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం చీరాల, వేటపాలెం తహసీల్దార్‌లు గోపీకృష్ణ, పార్వతి, మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఎంపీడీవోలు శివసుబ్రహ్మణ్యం, రాజేష్‌బాబు, మునిసిపల్ ఇంజనీరింగ్, శానిటరీ, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారి వారి పరిధులలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాలపై ఎమ్మెల్యే సమీక్షించారు. భవిష్యత్ కార్యాచరణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత పెంచాలి

దేవదాయ మంత్రికి వినతి

మార్టూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తరిగిపోతున్న పచ్చదనం, పరిశుభ్రత పెంచేందుకు కృషి చేయాలని కోరుతూ ఆంధ్రనర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రాత్రి నెల్లూరులో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతిపత్రం అందచేశారు. మండలంలోని బొబ్బేపల్లి మాజీ సర్పంచ్, ఆదర్శ రైతు, ఆంధ్ర నర్సరీ ఫ్మార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దండా వీరాంజనేయులు ఆధ్వర్యంలో సభ్యులు మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని దేవాలయాలవద్ద కనుమరుగవుతున్న సంస్కృతీ


మంత్రి ఆనంకు పూల మొక్కను అందిస్తున్న ఆంధ్ర నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యులు

సంప్రదాయాలలో భాగమైన నక్షత్రవనం, రాశీవనం, గ్రహ వనముల పునః ప్రతిష్ఠపై దృష్టిసారించాలని మంత్రిని కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో మనఊరు, మన చెట్టు, మన సంపద అనే కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. హైస్కూళ్ళ, ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలను నాటే కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు కూరగాయలు, బంతి మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రసాద్ సంజీవనరెడ్డి, కేవీవీ సత్యనారాయణ, శ్రీనివాసరావు, కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో పిచ్చి మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

పీహెచ్‌సీలో పిచ్చి మొక్కలు తొలగించాలి

కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో తనిఖీ

బల్లికురవ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని శుభ్రం చేయించాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి ఆదేశించారు. సోమవారం మండలంలోని గుంటుపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యశాల భవనాల పైకి పిచ్చి మొక్కలు ఎగబాకి ఉండడం చూసి ఆమె సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉన్న వైద్యాధికారి రవితేజతో ఎంపీడీవో మాట్లాడుతు ప్రజల నుంచి కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయని వైద్య శాల అపరిశుభ్రంగా ఉందని, వెంటనే వైద్య శాల మెత్తం శుభ్ర పరచాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. నలుగురు వైద్యులు ఉన్నారని అందరూ సమయ పాలన పాటించాలన్నారు. మరో మారు తనిఖీలకు వస్తామని వైద్యశాల శుభ్రంగా లేకుంటే కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని ఎంపీడీవో తెలిపారు. అనంతరం పక్కనే ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీడీవో తనిఖీ చేసి విద్యార్థులకు మోను ప్రకారం భోజనం అందించాలని, ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వసతులను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



పర్చూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్

వేటపాలెం(చీరాల), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహిళలను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో వలంటరీ టీచర్స్ కీలమని ఎంపీడీవో రాజేష్‌బాబు చెప్పారు. విద్యావనరుల కేంద్రంలో సోమవారం వలంటరీ టీచర్స్‌కు వెలుగు ఏపీఎం అంజిబాబు అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీడీవో రాజేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై పాటించాల్సిన విధి, విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ మనోరాజన్, ఎంఈవో జేవీ సుబ్బయ్య, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, సీసీలు విజయలక్ష్మి, అనూరాధ, వలంటరీ టీచర్స్ హాజరయ్యారు.

చీరాలటౌన్ : పొదుపు సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాసులుగా మార్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, ఎంఈవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం మధు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ 2030 నాటికి ప్రతిఒక్కరు అక్షరాసులుగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో ఉల్లాస్ సూపర్‌వైజర్ మనోరంజని, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

పర్చూరు : నిరక్షరాస్యులు లేని సమాజమే లక్ష్యంగా వయోజనులకు విద్య నేర్పించాలని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ పిలుపునిచ్చారు. ఆధునిక డిజిటల్ విధానంలో విద్యను నేర్పించాలని మహిళా సంఘ సభ్యులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మహిళా సమాఖ్య వీవోఏలకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు మనోరంజన్, సీడీపీవో సుభద్ర, ఏపీఎం రామకృష్ణ, సీసీలు విజయ్ కుమార్, శ్రీనివాసమూర్తి, ప్రమీల, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై అవగాహన

ఆరు రోజుల శిక్షణ ప్రారంభించిన అధికారులు

చీరాలటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలోనే యోగాపై అవగాహన ప్రయోజనకరమని పలువురు అధికారులు అన్నారు. సమగ్రశిక్ష రాష్ట్ర పథక్ సంచాలకుల ఆదేశాల మేరకు సోమవారం స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో ఆరు రోజుల యోగా శిక్షణ కార్యక్రమాలను అధికారులు ప్రారంభించారు. ఈ శిక్షణకు బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 1, 2 తరుగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్ఈవో సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా మొదటి రోజు యోగా కార్యక్రమంతో ప్రారంభించి సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో ముగించారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ డా.రవికుమార్, రాష్ట్ర పరిశీలకులు వెంకట రమణ, ప్రతిష్ఠ, జిల్లా ఏఎమ్‌వో మోజెస్, డీవైఈవో శ్రీనివాసరావు, ఎమ్ఈవోలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

గ్రానైట్ క్వారీలలో భద్రతా వారోత్సవాలు

- మెదటి రోజు నాలుగు చోట్ల తనిఖీలు చేసిన బృందాలు

బల్లికురవ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీర్ల కొండ వద్ద గల గ్రానైట్ క్వారీలలో సోమవారం నుంచి భద్రత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. చీమకుర్తిలో ఉన్న ఒకేషనల్ శిక్షణ కేంద్రం అధికారుల పర్యవేక్షణలో వారంరోజుల పాటు బల్లికురవ ప్రాంతంలో ఉన్న అన్ని క్వారీలను తనిఖీ చేసి భద్రత పరంగా క్వారీలలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు. అన్న వివరాలు సేకరించి నూరు శాతం పాటిస్తున్న వారికి ముగింపులో బహుమతులను అందజేయనున్నారు. మెదటి రోజు బల్లికురవలో గల గిరిరాజ్, బీవీఎల్ రాక్స్ అండ్ మినరల్స్, కిషోర్ గ్రానైట్ అండ్ స్లాబ్బు క్వారీలను బృందాలు తనిఖీ చేసి నివేదికను తయారు చేశారు. అనంతరం గనులలో కార్మికులు పనులు చేస్తున్న ప్రదేశాలను పరిశీలించి అక్కడ ఉన్న వసతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. భద్రత వారోత్సవాలలో భాగంగా గనులలో పనిచేస్తున్న కార్మికులందరిచే భద్రతా పరంగా జాగ్రత్తగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ తనిఖీలలో టీం కన్వీనర్‌లు సురేష్ బాబు, కె.ఎస్ఎస్‌రెడ్డి, టీం సభ్యులు, క్వారీల మేనేజర్లు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


కిషోర్ గ్రానైట్ క్వారీని తనిఖీ చేస్తున్న టీం


మణికేశ్వరం ఆయలంలో బారులు తీరి ఉన్న భక్తులు

కార్తీక సోమవారం పూజలు

అద్దంకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ప్రారంభం కావడంతో సోమవారం శివాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో భక్తులు పెద్ద సంఖ్యలో మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గుండ్లకమ్మ నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అద్దంకి పట్టణంలోని వేయి స్తంభాల గుడి, పాత శివాలయం, కమఠేశ్వరాలయం తదితర శివాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలలో మార్మోగిన శివనామస్మరణ

చినగంజాం : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళా భక్తులు కార్తీక దీపాలను వెలిగించి పరమశివుని మదినిండా కొలిచారు. ఆలయాల్లోని స్వామివార్లకు రుద్రాభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు, విశేష అలంకరణలు చేశారు. గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయం, కడవకుదురు గోకర్ణేశ్వరస్వామి ఆలయం, సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి, కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, పెదగం జాం, నీలాయపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లోని త్రినేత్రుడుని భక్తులు దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయాలు కార్తీక దీపాల వెలుగులతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. పూజ లు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.

వైసీపీ సర్పంచ్ నిర్వాకం

- దేవుడి పటాలు తగులబెడుతూ సెల్ఫీ వీడియో
- సోషల్ మీడియాలో హల్‌చల్

దగ్గుబాడు (పర్చూరు) నంవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా కారంచేడు మండలం దగ్గుబాడులో వైసీపీ మద్దతుదారునిగా ఉన్న సర్పంచ్(ఎస్సీ) నిర్వాకం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హిందూ దేవుళ్ల చిత్రపటాలు తగులబెడుతున్న తరుణంలో తీసిన సెల్ఫీ వీడియో ఆలస్యంగా సోమవారం సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. ప్రస్తుతం ఈ విషయం పర్చూరు ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.


చిల్లచెట్లతో అడివిని తలపిస్తున్న శ్మశానవాటిక

అంత్యక్రియలకు అవస్థలు

పంగులూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈ ఫొటో చూడగానే అడవి అనుకుంటే పొరబాటే.. ఇది మండలంలోని కొండమంజులూరు శ్మశానవాటిక. అడుగుడుగునా చిల్లకంప, చిల్లచెట్లతో మూసుకు పోయిన శ్మశానవాటికలో అడుగు తీసి అడుగుపెట్టే పరిస్థితి లేదు. అంత్యక్రియలు చేయాలంటే అవస్థలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడువేలకు పైగా జనాభా కలిగిన కొండమంజులూరు గ్రామంలో ప్రజలందరికీ ఒకే శ్మశానవాటిక. 5 ఎకరాల 80 సెంట్ల విస్తీర్ణం ఉంది. దాతల సహకారంతో గతంలో ప్రహరీ నిర్మించి నీడనిచ్చే మొక్కలు నాటి చెట్లను పెంచారు. గ్రామంలోని ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు చెందిన వారు ఎవరు మృతి చెందినా ఈ శ్మశానవాటికలో పూడ్చడం లేదా, ఖననం చేస్తారు. ప్రాంగణం అంతా చిల్లకంప, చెట్లతో నిండిపోయింది. లోపలకు వెళ్లాలంటే వాటిని దాటి వెళ్లడం కష్టంగా ఉంటుందని అంటున్నారు. శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్రాస్ కంట్రీ రన్ పోటీల్లో ద్వితీయస్థానం



చీరాలటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యూనివర్సిటీ అంతర్ కళాశాల క్రాస్ కంట్రీ రన్ పోటీల్లో కీర్తి మహేష్ ద్వితీయ స్థానం సాధించాడు. వేటపాలెం మండలం అక్కాయిపాలెంకు చెందిన ఇతను భార తి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చీరాల విజ్ఞాన భారతి అధ్వర్యంలో స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన పోటీల్లో మహేష్ సత్తా చాటాడు. ఈక్రమంలో 17-19 వరకు బెంగళూరులోని మంగుళూరు యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నాడు. మహేష్‌తో పాటు కోచ్ ఫిజికల్ డైరక్టర్ యే సురెడ్డిని కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. వైఏ కళాశాల విద్యార్థులు 10 కేఎం పోటీల్లో చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. వీరు మంగుళూరులో 18వ తేదీన జరిగే పోటీల్లో పాల్గొంటారు.

వడ్డీలేని రుణాలతో ఆర్థికాభివృద్ధి చెందాలి

చినగంజాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రుణాలను సక్రమంగా వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. స్త్రీ నిధి భవన్‌లో వెలుగు డీఆర్‌డీఏ అధ్వర్యంలో సోమవారం జరిగిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాబ్ రుణాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఏపీఎం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో వీరయ్య మాట్లాడుతూ తీసుకున్న వడ్డీలేని రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించాలన్నారు. చినగంజాం మండలానికి అత్యధికంగా ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.60లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు యూనిట్‌ను ఏర్పాటు చేసుకొని జీవనోపాధని మెరుగుపరుచుకోవాలని సూచించారు. సంతరావూరు, చింతగుంపల్లి, చినగంజాం, మున్నంవారిపాలెం, కడవకుదురు గ్రామాలకు చెందిన 102 మంది ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ ద్వారా రూ.60 లక్షలు, స్త్రీ నిధి రుణాలు రూ.40లక్షల చెక్కుల ద్వారా పంపిణీ చేసినట్లు ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యార్లగడ్డ లక్ష్మి, అబ్దుల్‌కలాంఅజాద్, శ్రీనివాసరావు, సంధ్యారాణి, నాగరాజు, చింతగుంపల్లి గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, కొత్తపాలెం ఎంపీటీసీ సభ్యుడు రాంబాబురెడ్డి, సీసీలు వెంకటస్వామి, శ్రీలక్ష్మి, మాధవి, మండల సమైఖ్య అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

భగవద్గీత పుస్తకాల పంపిణీ


భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న టీటీడీ కో ఆర్డినేటర్

అద్దంకిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం వారి మానవులందరికీ భగవద్గీత పుస్తకాలను సోమవారం అద్దంకిలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, ఆర్కిడ్స్ హైస్కూల్ విద్యార్థులకు టీటీడీ కో ఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భజన మండలి నిర్వాహకులు కూకట్ల రమేష్ అందజేశారు. ఈ పుస్తకం ప్రతి విద్యార్థికీ, ప్రతి వ్యక్తికి అమృతభాండాగారంలా ఉంటుందని తెలిపారు. ఈ నాటి సమజంలో ఏవిధంగా మెలగాలి, మంచి చెడులు గురించి తెలుసుకునే విధంగా అందరికీ ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మలాది అంజిరత్తయ్య, పొనకా కిరణ్‌కుమార్, రామిశెట్టి రవి, చెన్నుపల్లి పవన్ వెంకటసాయి కిరణ్, గోపిచంద్ పాల్గొన్నారు.

యోగా జాతీయ పోటీలకు ఎంపికైన శ్రుతి


టీం ఈవెంట్ రాష్ట్ర స్థాయి పోటీలలో తృతీయ స్థానం


మెడల్‌ను అందుకుంటున్న శ్రుతి

పంగులూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యోగా రాష్ట్ర స్థాయి పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని నాయపాము శ్రుతి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయింది. ఎస్జీఎఫ్ఐ 68వ రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరిగాయి. జిల్లా స్థాయి పోటీలలో సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచిన చందలూరు ఉన్నత పాఠశాల బాలికలు రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో పాల్గొని టీం ఈవెంట్‌లో తృతీయ సాధనంలో నిలిచారు. ఈ పోటీలలో ప్రతిభ చాటిన నాయపాము శ్రుతి అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా, మరో విద్యార్థిని కె.సరిత జాతీయ స్థాయి పోటీలకు స్టాండ్ బై క్రీడాకారిణిగా ఎంపికయినట్లు పాఠశాల పీడీ ప్రతిమ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం గిరిజ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

వాన నీరు పోనీవ్వకుండా అడ్డుకుంటున్నారని రైతుల ఫిర్యాదు

బాపట్లరూరల్, నవంబరు 04 (ఆంధ్రజ్యోతి) : తమ పంట పొలాలలో వర్షపునీరు పోనీవ్వకుండా కొంతమంది అడ్డుకుంటున్నారంటూ తమ సమస్యకు పరిష్కారం చూపాలని చీరాల మండలం బుర్లవారిపాలెంకు చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పొలాల్లో నిలిచిన వర్షపునీరు పైపుల ద్వారా కుందేరువాగుకు తరలిస్తుండగా కొందరు వ్యక్తులు అడ్డుపడుతున్నారని తద్వారా వర్షం నీరు చేలల్లో నిలబడడంతో కూరగాయల పంటలు నష్టపోతున్నాయన్నారు. కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు అశోక్‌కుమార్, వడ్లమూడి శ్రీనివాసరావు, బాలరాజు, సుసన్న తదితరులు ఉన్నారు.





మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగించి, హారతి ఇస్తున్న దంపతులు

ఓం నమశ్శివాయ!

'హరహర మహదేవ శంభోశంకర... శంభో శివశంభో' అంటూ భక్తుల శివనామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమోగాయి. కార్తీక మాసంలో తొలి సోమవారం సందర్భంగా శివకేశవ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారు జాము నుంచే పాలభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం కార్తీక దీపారాధనలు, స్వామివార్లకు ప్రాకారోత్సవాలు కనులపండువగా నిర్వహించారు.

నిండుకుండలా
సోమశిల, కండలేరు
మొదటి పంటకు నీటి కొరత తీరినట్టే

8



టీడీపీ 40.. వైసీపీ 13..

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఏం జరుగుతుంది!

73 తీర్మానాలతో అజెండా సిద్ధం • కార్పొరేటర్ల వ్యూహం ఏమిటి? • సంతకాల ఫోర్జరీపై ప్రశ్నిస్తారా!? • ఎవరి వాదన ఎలా ఉండబోతుంది?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నెల్లూరు నగర పాలక సంస్థలో తొలి సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. మొన్నటిదాకా అధికార తెలుగుదేశం పార్టీకి ఒక్క సభ్యుడు కూడా లేని ఈ కౌన్సిల్లో ఏకంగా 40 మంది సభ్యులు ఉన్నారు. 13కి పడిపోయిన వైసీపీ బలంతో ఆసక్తికరంగా మారింది. డిప్యూటీ మేయర్‌గా ఉన్న ఖలీల్ తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేయడంతో కౌన్సిల్ సభ్యుల సభ్యుల 53కి చేరింది. కాగ రాష్ట్రంలోనే సంచలనంగా మారిన కమిషనర్ సంతకాల ఫోర్జరీ అంశాన్ని ప్రస్తుత సమావేశంలో సభ్యులు ప్రశ్నిస్తారా!? వైసీపీ హయాంలో జరిగిన ఈ భారీ ఆర్థిక కుంభకోణంపై చర్చకు పట్టుబడతారా!? అన్నది ఆసక్తికరంగా మారింది. 73 తీర్మానాలతో అజెండాను సిద్ధం చేసిన అధికారులు నేటి సమావేశానికి సర్వం సిద్ధం చేశారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరం

నెల్లూరు కార్పొరేషన్‌లో గత కమిషనర్ వికాస్‌మర్మత్ సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ. కోట్లు దోచుకున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ కుంభకోణంపై మంగళవారం జరిగే నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనినే ప్రధాన అజెండాగా సభ్యులు చర్చకు పట్టుబట్టే అవకాశం ఉన్నట్లు కార్పొరేషన్, రాజకీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. నెల్లూరురూరల్ నియోజకవర్గంలో 26 మంది కార్పొరేటర్లు ఉండగా, ఆరుగురు మినహా మిగిలిన వారంతా టీడీపీలోకి వెళ్లిపోయారు. అటు 27 మంది ఉన్న (ఒకరు రాజీనామా) నెల్లూరు నగర నియోజకవర్గంలోనూ ఏడుగురు మినహా 20 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మొత్తంగా 40 మంది టీడీపీ, 13 మంది మాత్రమే నేటి కౌన్సిల్‌లో వైసీపీకి బలముంది. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లు ఫోర్జరీ-స్కాంపై ఎంతమాత్రం చర్చిస్తారా!? అన్నది చర్చనీయాంశంగా మారింది.

• 73 తీర్మానాలతో అజెండా

కౌన్సిల్ సమావేశంలో 73 తీర్మానాలను అజెండాలో చేర్చారు. ఇందులో

- మిగతా 6లో..

టెట్ ఫలితాలు విడుదల

• జిల్లాలో 45 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు (విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. అక్టోబరు 3 నుంచి 21వతేదీ వరకు టెట్ నిర్వహించి, అనంతరం ప్రాథమిక కీ, రెస్పాన్స్‌షీట్‌లను విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించారు. తదుపరి అక్టోబరు 29న తుది కీ విడుదల చేసి తాజాగా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలను ఏపీ టెట్ రిజల్ట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. మరో రెండు రోజుల్లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో టెట్ ఫలితాలపై అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది. టెట్‌లో అర్హత సాధించిన వారికి డీఎస్సీలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అంతకుముందు టెట్ అర్హత సర్టిఫికెట్ ఏడేళ్ల మాత్రమే చెల్లుబాటయ్యేది. 2022లో దీన్ని జీవితకాలానికి మార్పు చేశారు. దీంతో గతంలో టెట్‌లో అర్హత సాధించినా మార్కుల్లో మరింత మెరుగు కోసం ఈ ఏడాది టెట్‌కు చాలామంది హాజరయ్యారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20శాతం వెయిటేజీ ఉండడంతో అభ్యర్థులంతా దీనిపై దృష్టి సారించారు. టెట్‌కు జిల్లాలో 9,350 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరికి నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి మొత్తం 7,500 మంది అభ్యర్థులు హాజరుకాగా సోమవారం విడుదలైన ఈ ఫలితాల్లో 45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు
రిజిస్ట్రేషన్ తప్పనిసరి
11వ తేదీ వరకు గడువు

- వివరాలు 6లో..



సీతారామపురం : భైరవకోనలో ప్రత్యేక అలంకరణలో పరమ శివుడు, త్రిముఖ దుర్గాదేవి





కావలి : పాతూరు శివాలయంలో బారులు తీరిన భక్తులు



నెల్లూరులో దీపారాధన చేస్తున్న భక్తులు

వైభవంగా కార్తీక సోమవారం

● శివనామస్మరణలతో మారుమోగిన శివాలయాలు

జిల్లావ్యాప్తంగా శివకేశవ ఆలయాల్లో కార్తీక సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచే పాలభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. శివనామస్మరణలతో ఆలయాలు మారుమోగిపోయాయి. సాయంత్రం కార్తీక దీపారాధనలు స్వామివార్లకు ప్రాకారోత్సవాలు జరిగాయి. నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో తొలి సోమవారం వేడుకలు కనుల పండువగా జరిగాయి. భారీ సంఖ్యలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా మూలస్థానేశ్వరస్వామి, భువనేశ్వరి అమ్మవార్లకు పూలంగిసేవలు జరిగాయి. రాత్రి ప్రాకారోత్సవం జరిగింది. ఉభయకర్తలు, ఈవో శ్రీనివాసరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఏం జరుగుతుంది!

(5వ పేజీ తరువాయి)

ప్రధానంగా సీసీరోడ్లు, మరుగు కాలువల నిర్మాణాలకే ప్రాధాన్యం ఇచ్చిన పాలక మండలి గతంలో పూర్తి చేసిన పలు పనులకు ర్యాడిఫికేషన్ అనుమతులు కోరనున్నారు. ధనలక్ష్మీపురంలోని శ్రీనివాస్‌నగర్‌లోని పార్కుకు తమ అల్లుడు పేరును అధికారికంగా పెట్టాలన్న విజ్ఞప్తిని కాటం వేణుగోపాల్‌రెడ్డి కోరగా అందుకు అంగీకరించిన పాలకమండలి శ్రీనివాస్ పార్కుగా పేరు పెట్టేందుకు అజెండాలో చేర్చారు. అలాగే డాక్టర్ జెట్టీ శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ భవన్‌కు వేసిన ఆస్తి పన్నులో రూ.1.57 లక్షల్లో 75 శాతం రాయితీ ఇచ్చేందుకు అజెండాలో చేర్చారు. ఎన్ఎంసీలోని హౌసింగ్ విభాగంలో సలహాదారుడిగా కే మధుసూదన్‌ను కొనసాగించేందుకు తీర్మానం పెట్టారు.

● విగ్రహాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

నగరంలోని వివిధ కూడళ్లలో పలువురి విగ్రహాల ఏర్పాటుకు నేటి కౌన్సిల్లో అనుమతి కోరుతూ పాలక మండలి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అందులో ముత్తుకూరు కూడలి వద్ద ఆనం వెంకటరెడ్డి, మినీ బైపాస్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గౌతమ బుద్ధుడు, గాంధీ బొమ్మ కూడలి వద్ద రావు సాహెబ్ పండిత గానాల రామమూర్తి, నర్తకి కూడలిలో నటుడు కృష్ణ, లీలామహల్ సెంటర్ వద్ద చత్రపతి శివాజీ విగ్రహాల ఏర్పాటుకు అజెండాలో చేర్చారు. రామలింగాపురంలోని మున్సిపల్ పాఠశాలకు శ్రీకంఠం మీనాక్షమ్మ పేరు పెట్టాలని కోరుతూ అజెండాలో పొందుపరిచారు. నగరంలోని 7 కూడళ్ల వద్ద రూ.1.40 కోట్లతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోనున్నారు. 2,268 మంది ఉద్యోగులను ఏడాదిపాటు కొనసాగిస్తూ వీరికి రూ. 42.51 కోట్లు జీతాల రూపేణా చెల్లించేందుకు అజెండా తయారు చేశారు. 6వ డివిజన్‌లో వివాదాస్పద స్థలంగా మారిన 112 సర్వేనెంబరులో వాటర్‌ప్లాంటు నిర్మాణానికి అనుమతి మంజూరు చేస్తూ అజెండాలో చేర్చడం గమనార్హం. అలాగే వివిధ విభాగాలలో మరణించిన ఉద్యోగుల వారసులకు 112 మందికి తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నేడు జాబ్ మేళా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం వినయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూ కావలిలోనూ, జిల్లా ఉపాధి కార్యాలయంలోనూ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తిచేసిన యువతీ యువకులు అర్హులన్నారు. వయసు 18 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆసక్తికలవారు మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కలువాయి, నవంబరు 4: స్థానిక ఓ యువతి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందడంతో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సుమన్ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలువాయికి చెందిన గోవిందు నిస్సి (16) అనే యువతి ఆదివారం రాత్రి నుంచి కనిపించడం లేదని తల్లి దీవెనకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే సోమవారం నిస్సి తీసుకెళ్లిన స్కూటీ ఉయ్యాలపల్లి సమీపంలోని తెలుగుగంగ కాలువ గట్టున ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. అక్కడ ఆమె కనిపించకపోవడంతో కాలువలో గల్లంతై ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పోలీసులు యువతి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, నిస్సి కలువాయిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది.

సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా : డీఈ

మనుబోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చునని విద్యుత్ శాఖ డీఈ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రధానమంత్రి సోలార్ ఘర్ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ రూ.1000 కరెంటు బిల్లు వచ్చే ఇంటికి సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే రూ.350 వస్తుందన్నారు. కిలో వాట్‌కు రూ. 70 వేలు అవుతుందని, అందులో ప్రభుత్వం రూ.30వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఏఈ పవన్‌కుమార్, ఎల్ఐ రాజశేఖర్, లైన్‌మెన్ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ పంటలతోపాటు ఆధునిక పంటల సాగుపై అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. సాగుదారులకు లాభాలు, ప్రజలకు ఆరోగ్యాన్ని తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్ సాగు జిల్లాలో పెరుగుతోంది. పొదలకూరు మండలం వనంతోపు సమీపంలో దుగ్గిరాల వెంకటేశ్వర్లు తన మూడెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. మొదటి మూడేళ్లు పెట్టుబడిపోను ఆ తర్వాత ఇరవై ఐదేళ్లపాటు లాభాలు అందుకోవచ్చని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)

డ్రాగన్ పండు.. లాభాలు మెండు!

● జిల్లాలో పెరుగుతున్న సాగు ● ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రైతులకు సబ్సిడీ
● ఉద్యాన శాఖ కూడా ఆర్థిక తోడ్పాటు ● 3 ఎకరాల్లో సాగు చేపట్టిన పొదలకూరు రైతు

డ్రాగన్ ఫ్రూట్స్ రెండు రకాలు. ఒకటి తెలుపు, మరొకటి గులాబీ రంగులో ఉంటుంది. తెలుపు రంగులో ఉన్నవి కాస్త పుల్లగాను, గులాబీ రంగులో ఉన్న పండు మంచి రుచిగానూ ఉంటుంది. ఇది కేన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షిస్తుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అనేక రకాల విటమిన్లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఫైబర్ తదితర మేలు చేసే గుణాలు ఉంటాయని చెబుతున్నారు. ఒక డ్రాగన్ ఫ్రూట్ దాదాపు 100 కేలరీల శక్తిని అందిస్తుందని, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుందని



వనంతోపు సమీపంలోని డ్రాగన్ ఫ్రూట్స్ తోట

పేర్కొంటున్నారు. ఈ పంట సాగుకు ఉద్యాన శాఖ అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సబ్సిడీతోపాటు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

● పంట వేసే విధానం..

డ్రాగన్ ఫ్రూట్ మొక్క ధర రూ.50 నుంచి 70 వరకు ఉంటుంది. సిమెంటు దిమ్మెలు, డ్రిప్ సాయంతో పంటను సాగు చేయవచ్చు. సేంద్రియ ఎరువులు వాడితే దిగుబడి అధికంగా వస్తుంది. ఒక్కసారి మొక్క నాటితే దాదాపు 25 నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడినిస్తుంది. ఏడడుగుల సిమెంటు దిమ్మె చుట్టూ నాలుగు మొక్కలను నాటవచ్చు. మరో దిమ్మెకు మధ్య 9 అడుగుల దూరం ఉండాలి. డ్రాగన్ ఫ్రూట్ చెట్టును దిమ్మె చుట్టూ అల్లి కిందకు జారకుండా దారంతో కట్టాలి. ఇది ఏడాదిలో మూడుసార్లు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. తక్కువ నీటి వినియోగంతోపాటు చీడపీడల ప్రభావమూ తక్కువగానే ఉటుంది. మొదటి ఏడాది మాత్రమే పెట్టుబడి పెట్టాలి. ఆ తర్వాత సంవత్సరం నుంచి పెట్టుబడి లేకుండా పంట సాగు చేయవచ్చు. 500 దిమ్మెలకు 2వేల మొక్కలు నాటే అవకాశం ఉంది. పంట పెట్టుబడికి ఎకరాకు రూ.5 లక్షల నుంచి 6లక్షల వరకు ఖర్చు అవుతుంది. మొక్కలకు నాలుగు రోజులకొకసారి నీరు పట్టాలి. నీరు ఎక్కువగా పడితే మొక్కలు త్వరగా పాడవుతాయి. డ్రాగన్ ఫ్రూట్ మొగ్గగా మారినప్పటి నుంచి పండుగా మారాలంటే 45 రోజుల సమయం పడుతుంది.

● డ్రాగన్ ఫ్రూట్స్‌తో ఆదాయం..

డ్రాగన్ ఫ్రూట్ ప్రస్తుతం కిలో ధర రూ.100 నుంచి 140 వరకు ఉంది. పంటను కోసిన తర్వాత 2 నెలల వరకు పండు పాడవకుండా నిల్వ చేసుకోవచ్చు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కను సైతం విత్తనంగా మార్చి మరో మొక్కను తయారు చేయవచ్చు. పొలంలో తక్కువ స్థలంలో నర్సరీగా మార్చి సీడ్స్ పెంచవచ్చు. దాంతో ఇతరులకు నారు అమ్మి ఆదాయం పొందవచ్చు. లేదా మరో ఎకరా పొలంలో నాటి పంటను సైతం తక్కువ పెట్టుబడితో సాగు చేసే అవకాశం ఉంటుంది. ఉద్యాన శాఖ అధికారులు సైతం పంట సాగుకు విడతల వారీగా నగదు మంజూరు చేస్తారు. పంట వేసిన మూడేళ్ల తర్వాత నుంచి లాభాలు ఆర్జించవచ్చు.

రైతులకు ఎంతో ఉపయోగం

సన్న, చిన్నకారు రైతులకు డ్రాగన్ ఫ్రూట్ సాగు ఎంతో ఉపయోగపడుతుంది. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.1.86 లక్షల వరకు సబ్సిడీ ఉంటుంది. ఉద్యాన శాఖ తరఫున మరో 50వేలు సాగు తోడ్పాటు అందిస్తున్నాం. పంటకు పనికిరాని, బీడు భూమిలో సైతం డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేసుకోవచ్చు. ఎక్కువ నీరు అవసరం లేకుండా తక్కువ నీటితో సాగు చేయవచ్చు. సేంద్రియ ఎరువులు వాడితే పంట దిగుబడి అధికమవుతుంది. జాబ్‌కార్డులు కలిగిన రైతులకు అవకాశం ఉంది. చిన్నపాటి మెలకువలతోపాటు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు.

- ఈ.ఆనంద్, ఉద్యాన అధికారి, పొదలకూరు

రూ.6 లక్షల వరకు ఆదాయం



మూడు ఎకరాల్లో రెండు వేల మొక్కలు నాటాను. ఎకరాకు దాదాపు రూ.5లక్షల నుంచి 6లక్షల వరకు ఖర్చు అయింది. గులాబీ రంగు డ్రాగన్ ఫ్రూట్ మార్కెట్లో డిమాండ్ ఎక్కువ. డ్రిప్ సాయంతో మొక్కలకు నీరు అందిస్తున్నా. ఏడాదికి 6 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. దీంతో రూ.6లక్షల 7లక్షల వరకు ఆదాయం పొందుతున్నాం. అలాగే డ్రాగన్ ఫ్రూట్ నారు కూడా మేమే అమ్ముతున్నాం. కావాల్సిన వారు 94409 77389, 9493650206 నెంబర్లను సంప్రదించగలరు.

- జి.వెంకటేశ్వర్లు, రైతు, మర్రిపల్లి

హోరాహోరీగా రాష్ట్ర హాకీ పోటీలు

● సెమీస్‌కు చేరిన నెల్లూరు జట్టు



పోటీలో తలపడుతున్న చిత్తూరు, విశాఖపట్నం బాలుర జట్లు

నెల్లూరు(విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని సౌత్‌మోపూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల హాకీ పోటీలు ఉత్కంఠగా జరుగుతున్నాయి. సోమవారం జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో పశ్చిమగోదావరి, ప్రకాశం జట్ల మ్యాచ్‌లో పశ్చిమగోదావరి 3-0 గోల్స్‌తో, అనంతపురం, కర్నూలు పోటీల్లో అనంతపురం 4-0 గోల్స్‌తో, కడప, కృష్ణా పోటీల్లో కడప 7-0గోల్స్‌తో, ప్రకాశం, నెల్లూరు పోటీల్లో ప్రకాశం 2-0 గోల్స్‌తో, పశ్చిమగోదావరి, విజయనగరం పోటీల్లో పశ్చిమగోదావరి 1-0గోల్స్‌తో, అనంతపురం, తూర్పుగోదావరి పోటీల్లో అనంతపురం 4-0గోల్స్‌తో, కడప, శ్రీకాకుళం జట్ల పోటీల్లో కడప 8-0గోల్స్ తేడాతో విజయం సాధించాయి. అలాగే బాలుర విభాగంలో శ్రీకాకుళం, చిత్తూరు పోటీల్లో శ్రీకాకుళం 3-0 గోల్స్‌తో, నెల్లూరు, తూర్పుగోదావరి పోటీల్లో నెల్లూరు 1-0 గోల్స్‌తో, అనంతపురం, విజయనగరం పోటీల్లో అనంతపురం 6-0గోల్స్‌తో, విశాఖ, కర్నూలు పోటీల్లో విశాఖ 7-0గోల్స్‌తో, కడప, పశ్చిమగోదావరి పోటీల్లో కడప 3-0గోల్స్‌తో, తూర్పుగోదావరి, చిత్తూరు పోటీల్లో తూర్పుగోదావరి 3-2 గోల్స్‌తో, శ్రీకాకుళం, తూర్పుగోదావరి పోటీల్లో 0-5 గోల్స్ తేడాతో శ్రీకాకుళం, అనంతపురం, కృష్ణా పోటీల్లో అనంతపురం 5-0 గోల్స్‌తో, విశాక, ప్రకాశం పోటీల్లో విశాఖ 3-0 గోల్స్‌తో, కడప, గుంటూరు పోటీల్లో కడప 2-0గోల్స్‌తో విజయం సాధించాయి. దీంతో తొలిరౌండ్, క్వార్టర్ ఫైనల్స్ పూర్తయ్యేసరికి బాలికల విభాగంలో పశ్చిమగోదావరి-కడప జట్లు, అనంతపురం-విశాఖపట్నం జట్లు సెమీ ఫైనల్స్‌లకు చేరుకున్నాయి. అలాగే బాలుర విభాగంలో కడప-నెల్లూరు జట్లు, చిత్తూరు-పశ్చిమగోదావరి జట్లు సెమీస్‌కు చేరకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండోరోజు పోటీలను భారత జూనియర్ క్రీడాకారిణి ప్రసన్నలక్ష్మి, జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎస్. విజయ, పోటీల నిర్వాహక కార్యదర్శి పీ నాగేంద్రరావు, పర్యవేక్షకులు పీ థామస్‌పీటర్, జీడీ .సురేష్‌బాబు, పీఈటీలు పర్యవేక్షించారు.

బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 4: బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్టర్ చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణ సేవలు,వీధిబాలల సంక్షేమశాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి బీజేకే కాళిందొర ఒక ప్రకటనలో తెలిపారు. బాలల సంరక్షణ కేంద్రాలన్నీ బాలల రక్షణ, సంరక్షణ చట్టం 2015 సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకొనేవారు నిర్దేశించిన దరఖాస్తుతోపాటు సంబంధిత పత్రాలు జత చేసి ఈ నెల 11వ తేదీలోగా తమ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులను స్పీడ్ పోస్టు ద్వారా కాని, రిజిస్టర్ పోస్టు ద్వారా కాని పంపాలన్నారు. వివరాలకు 91000 45421 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ఐఏబీ సమావేశం నిర్వహించాలని జేసీకి వినతి



జేసీకి వినతిపత్రం అందచేస్తున్న రాధాకృష్ణమనాయుడు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐఏబీ సమావేశం నిర్వహించి మొదటి పంటకు సాగునీరందించాలని కోరుతూ తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరు రాధాకృష్ణమనాయుడు జేసీ కార్తీక్‌కు సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందచేశారు. జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాల్లో 120 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. దీంతో మొదటి పంటకు ప్రతి ఎకరాకు నీరందించే అవకాశం ఏర్పడిందన్నారు. ఐఏబీ సమావేశాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాలు

● సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏలు ● పోర్టు పరిధిలోకి చేర్చాలని బీసీ కాలనీవాసులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం గౌరవాధ్యక్షుడు పెంచల నరసయ్య, జిల్లా అధ్యక్షుడు బాస్కర్‌లు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేలు అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు ఓబులేసు, హనుమంతు, పెంచలయ్య, బాష, వెంకటేష్, కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

● పోర్టు పరిధిలోకి చేర్చాలి..

రామాయపట్నం పోర్టు పరిధి లోకి సాలిపేట బీసీ కాలనీని చేర్చి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని కోరుతూ పోర్టు నిర్వాసితుల సంక్షేమ సంఘం నాయకులు, సాలిపేట గ్రామస్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ పోర్టు యాజమాన్యానికి లాభాలు తెచ్చిపెడుతూ, పోర్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు పోర్టు మొండి చేయి చూపిస్తున్నదన్నారు. సాలిపేట బీసీ కాలనీని సర్వేచేసి పరిహారం ఇవ్వకుండా వదిలేయటం సరైన పద్ధతి కాదన్నారు. ధర్నాలో సీఐటీ యూ జిల్లా కార్యదర్శులు గోగుల శ్రీనివాసులు, అల్లాడి గోపాలు, కొలగట్ల సురేష్, జీ వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● బాధితురాలికి న్యాయం చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సాలిపేట గ్రామస్థులు

అనంతసాగరం మండలం కొత్తపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థినిని మోసం చేసి, ఆమె ఆత్మహత్యాయత్నానికి కారకుడైన హుసన్‌ను కఠినంగా శిక్షించాలని కలెక్టర్ ఆనంద్‌కు సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ వినతిపత్రం సమర్పించారు. విచారణ జరిపి బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టరును కలిసిన వారిలో పందిటి సుబ్బయ్య, నాయకులు దీపోగు బాబు, కప్పలదాసు, మంచు కామయ్య, పలిగల చిన్నయ్య, మధు తదితరులు ఉన్నారు.

వేదికలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులను పిలిపించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేదో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు ల్యాప్‌టాప్‌ల అందజేత

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బధిరులకు, అంధులకు సోమవారం తిక్కన భవన్‌లో కలెక్టర్ ఆనంద్ ల్యాప్‌టాప్‌లను, మొబైల్ ఫోన్లను సోమవారం అందచేశారు. రూ.3.95 లక్షల విలువైన 10 మొబైల్ ఫోన్లు, 7 ల్యాప్‌టాప్‌లను విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో వారికి ఆయన అంద చేశారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ



నెల్లూరు(క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా ప్రాంతాల పోలీసు అధికారులను ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ బీ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

పింఛన్ ఇవ్వండి మహాప్రభో...!

● వృద్ధ దంపతుల వేడుకోలు



నెల్లూరు(హరనాథపురం, ఆంధ్రజ్యోతి): వీరిద్దరూ భార్యాభర్తలు.. మూడేళ్లుగా భార్య కేన్సర్‌తో బాధపడుతోంది. వృద్ధాప్యంతో భర్త ఇబ్బంది పడుతున్నాడు. వారు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని పింఛన్ కోసం కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. నెల్లూరు మూలపేటకు చెందిన అంచూరి ఆనందరావు, శేషమ్మ దంపతులు. ఆనందరావుకు వయసు 61 ఏళ్లు. అతడి వయసు ఆధార్‌లో తప్పుగా పడటంతో పెన్షన్ అందలేదు. శేషమ్మ మూడేళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్నా, ఆమెను కూడా అధికారులు కనికరించలేదు. పింఛన్ కోసం మూడేళ్ల నుంచి వారు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ఇకనైనా వారికి పెన్షన్ ఏర్పాటు చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

● భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు ● దీపాలు వెలిగించిన మహిళలు



ఘటిక సిద్ధేశ్వరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆత్మకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి, అలఘునాథస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

● సంగం: స్థానిక సంగమేశ్వరాలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. కొందరు మహిళలు పెన్నానది వద్ద స్నానాలు చేసి పెన్నమ్మకు దీపాలు వెలిగించారు. సాయంత్రం ఆలయంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా తిరుమనకొండ కాశీవిశ్వేశ్వరాలయం, వంగల్లు భీమేశ్వరాలయం, దువ్వూరులోని కోటేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● ఉదయగిరి రూరల్: గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, లింగాలదొన, యర్రబల్లిగడ్డ, అర్లపడియ గ్రామాలతోపాటు ఉదయగిరి పట్టణంలోని పార్వతీపరమే శ్వరాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అలాగే దుత్తలూరు కొండపై ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

● సీతారామపురం: ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామపురంలోని శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైరవకోన సొనవాన జలపాతంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించి పరమశివుడు, త్రిముఖ దుర్గాదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శివునికి రుద్రాభిషేకం, బిల్వార్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివారికి ఇష్టమైన బిల్వపత్రాలు, నాగలింగ పుష్పాలతో పూజలు చేశారు.

● కావలి టౌన్, అక్టోబరు 4: పాతూరు శివాలయం, వెంగళరావునగర్ శివాలయం, ముసునూరు శివాలయాల్లో భక్తులు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతూరు శివాలయంలో శివ దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవలతో ప్రారంభించిన పూజలు వృశ్చికకాలాభిషేకం, అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. నెల రోజుల పాటు నిత్యార్చన, అభిషేకాలు నిర్వహిస్తారని భక్తులు పాల్గొని శివకటాక్షం పొందాలని ప్రధాన అర్చకులు శశిగురుకుల్ తెలిపారు.



ఉదయగిరి, ఆత్మకూరులో శివుడికి అలంకరణ



సంగం శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ట్రంకు రోడ్డులో ఆక్రమణల తొలగింపు

కావలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంకు రోడ్డులో సోమవారం ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. పట్టణ సుందరీకరణలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికాధికారి వివేక్ నేతృత్వంలో సిబ్బంది ఈ పనులు చేపట్టారు. ముందుగా కావలి తహసీల్దార్ కార్యాలయం నుంచి రూపాయి మిద్దె వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఎక్సకవేటర్‌తో తొలగిస్తున్నారు. ముఖ్యంగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల ముందు ఆక్రమణదారులు రోడ్డు వెంబడి రోడ్డులోకి ఆక్రమణలు వస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.



ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ఆక్రమణలు

ఇసుక టిప్పర్ల పట్టివేత

ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున స్థానిక జాతీయ రహదారి రాజుపాలెం జంక్షన్ వద్ద ఇసుక లోడుతో నెల్లూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న టిప్పర్లను ఆపి తనిఖీ చేయగా అనుమతి పత్రాలు చూపలేదన్నారు. అనంతరం వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి ఒంగోలు మైన్స్ ఏడీ కారాలయానికి రాత పూర్వక సమాచారం అందజేశామన్నారు.



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక టిప్పర్లు

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో విషజ్వరాలపై తగినంత అవగాహన కలిగి ఉండాలని గ్రామీణ వైద్యఆరోగ్య కార్యకర్తలు సూచించారు. సోమవారం మండలకేంద్రంలో ఇంటింటికి తిరిగి జ్వరాలు, జలుబు, దగ్గు ఉన్న వారిని గుర్తించి వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని తెలిపారు. పరిసర ప్రాంతాలు, పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇంటి ఆవరణంలో వాడుకలోలేని వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని ఏఎన్ఎంలు తొలగించారు. డెంగ్యూ, చికెన్‌గున్యా కేసులు నమోదు అవుతున్నాయని ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీహెచ్‌వో దివ్యత, ఏఎన్ఎం పద్మ, ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్ ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఆరోగ్య సిబ్బంది

సాగునీటి విడుదల పరిశీలన

జలదంకి, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కావలి కాలువకు సీబీఆర్ ఇన్‌ఫాల్ నుండి విడుదల అవుతున్న సాగునీటిని సోమవారం అన్నవరం చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు (సీబీఆర్) ఇన్‌ఫాల్ వద్ద సోమవారం స్థానిక టీడీపీ నేత పూనూరు రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో కూటమి నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా జలహారతి ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు తల్లపనేని మధుసూదనరావు, చల్లా హనుమారెడ్డి, నిమ్మలపల్లి రామ్‌చైతన్య, కొర్రపాటి రామారావు, కొల్లా క్రిష్ణ, స్వర్ణ కొండపనాయుడు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



సోమశిల జలాలను పరిశీలిస్తున్న నేతలు

గ్రామ వ్యవసాయ సహాయకుల జిల్లా కమిటీ ఎంపిక

ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లమో గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా జక్కి. గణేష్ సాగర్, జిల్లా అధ్యక్షులుగా బత్తుల వెంకట సుబ్బయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీరామ ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా ఎం.గౌస్ లాజం, ఎస్‌కే.మస్తాన్, సుమంత్, రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వెంకటేష్, ట్రెజరీగా సుభాషిణీ, జాయింట్ సెక్రటరీ రాణా ప్రతాప్ నాయక్, నవ్యభారతి, మృదులత, అజారుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అబీద్, మహిళా సెక్రటరీ వానిరెడ్డిలతో పాటు 11మంది ఈసీ మెంబర్లు ఉన్నారు.

నిండుకుండలా సోమశిల, కండలేరు

● చెరువులు, బావుల్లోనూ జలం ● మొదటి పంటకు నీటి కొరత లేనట్టే ● వ్యవసాయపనుల్లో అన్నదాత బిజీ

అనంతసాగరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతం నుంచి సమృద్ధిగా వరద రావడం తో జిల్లాలో ప్రధాన జలాశయాలైన సోమశిల, కండలేరు నిండుకుండను తలపిస్తున్నాయి. సంగం, నెల్లూరు బ్యారేజీలలోనూ నీరు ఉండటంతో జిల్లావ్యాప్తంగా నీటి ఇబ్బందులు తొలగిపోయాయి. చెరువులు, బావుల్లోనూ నీటి లభ్యత కలగడంతో రై తుల్లో ఆనందం నెలకొంది. ఇక నీటి కేటాయింపుల తో ప్రమేయం లేకుండా డెల్టా, నాన్‌డెల్టా పరిధిలో వరి సాగుకు సమాయత్తం అవుతున్నారు. సోమశిల డ్యాంకు ఆగస్టు 3 నుంచి కృష్ణా జలాలు రాక ఆ తర్వాత పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో పుష్కలంగా వర్షలు కురిసి వరద పోటెత్తడంతో డ్యాం నిండుకుం డలా మారింది. సోమశిలకు ప్రస్తుతం 13,129 క్యూసెక్కుల వరద వస్తుండగా, 70.432 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2100, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 10,000, ఉత్తరకాలువకు 700 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. మరోవైపు వచ్చే వరదను ప్రణాళికగా తెలుగుగంగ కాలువ ద్వారా కండలేరుకు తరలించడంలో ప్రభుత్వ యం త్రాంగం చర్యలు చేపట్టింది. డెడ్‌స్టోరేజీలో ఉన్న కండలేరు నీటిమట్టం నేడు 47 టీఎంసీలకు చేరు కుంది. ఈక్రమంలో జిల్లావ్యాప్తంగా అధికార, అనధి కారికంగా 6 నుంచి 7లక్షల ఎకరాల్లో మొదటిపంట వరి సాగు చేసే పరిస్థితి కనిపిస్తోంది. సోమశిల పరిధిలో ఉత్తర, దక్షిణ, కాలువలతోపాటు కావలి, కనుపూరు కాలువలకూ నీరు అందించేలా చర్యలు చేపట్టారు. గడిచిన ఏడాది నుంచి వరికి ఆశాజన కంగా ధర లభిస్తుండగా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

● ఎరువులు, విత్తనాల కోసం..

జిల్లాలో ఖరీఫ్ సాగు మొదలవగా ఎరువులు, విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రైవే టు దుకాణాల ధరల్లో వ్యత్యాసం ఉండటంతో రైతు లు సబ్సిడీల ద్వారా లభించే ఉత్పత్తుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ రైతు సేవా కేంద్రాల్లో అవసరాలకు అనుగుణంగా విత్తనాలు, యూరియా, డీఏపీ ఇతర ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

రీసర్వే తప్పులు సరిదిద్దేందుకే గ్రామసభలు

వలేటివారిపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో చేపట్టిన రీసర్వేలోని తప్పులను సరిదిద్దేందుకే కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేక సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అహ్మద్‌అమీర్ తెలిపారు. సోమవారం నేకునాంపురం సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో మస్తాన్ రైతులు పాల్గొన్నారు.

టిడ్కో చైర్మన్‌ను కలిసిన జనసైనికులు

కావలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ను సోమవారం జనసేన జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జనసైనికులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నెల్లూరు నుంచి విజయవాడ వెళ్లుతుండగా మార్గమధ్యంలో కావలి తుమ్మలపెంట రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆయనను కలిసి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గాదంశెట్టి రవి, తోకల వెంకటేశ్వర్లు, పాలడుగు వెంకటేశ్వరరావు, సాజిత్, జిలానీ, షమ్మీ, జ్యోతి పాల్గొన్నారు.

సుందరయ్యనగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

● కమిషనర్‌ను సీపీఎం నేతల వినతి

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్యనగర్‌లోని ప్రజల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ అనూషకు సోమవారం సీపీఎం నేతలు ఎస్‌ఏ గౌస్, టి. వెంకటరావు, ఎస్కే. మల్లిక, ఎం. పద్మ, ఎం.రాయుడులు వినతిపత్రం అందజేశారు. సోమవారం ప్రజా విజ్ఞప్తుల వేదికలో ఆమెను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అనూష వారితో మాట్లాడారు. తక్షణం తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, అలాగే కాలనీలోని ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజాఫిర్యాదుల వేదికలో వివిధ సమస్యలపై 9 అర్జీలు వచ్చాయని, సమస్యల పరిష్కారంకు తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు కమిషనర్ తెలిపారు



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

కందుకూరు, నవంబరు 4: స్థానిక కనిగిరి రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి కార్తీక సోమవారం సందర్భంగా పలువురు దాతలు విరాళాలు అందజేశారు. అందులో నలదలపూరు మాజీసర్పంచ్ ఉన్నం వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ దంపతులు రూ. 1,01,116లు, ఎర్రారెడ్డిపాలెం గ్రామానికి చెందిన రాజారపు మాలకొండయ్య, పావని దంపతులు రూ.1,00,116లను ఇచ్చారు. అందజేశారు. కార్యక్రమంలో గురుస్వామి కేఎస్ వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు ఇస్కాల వెంకటనరసింహ, నల్లబోతుల మురళీ, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి, నరసింగరావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కావలి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే ఆయా విత్తన దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి లలిత హెచ్చరించారు. సోమవారం ఆమె కొత్తపల్లిలో రైతులు వేసిన నారు మడులను పరిశీలించారు. వరి విత్తనాలు సరిగా మొలవలేదన్న ఆరోపణల దృష్ట్యా నారుమడులు సందర్శించామన్నారు. అనంతరం పట్టణంలోని ఇందిరా సీడ్స్‌లో కొనుగోలు చేసిన కెఎన్ఎం 1638 వరి విత్తనాలు 70శాతం మాత్రమే మొలకెత్తాయని దీంతో 70బస్తాలు వెనక్కు ఇచ్చినట్లు రైతులు తెలిపారు. అనంతరం సీడ్స్ దుకాణంలో తనిఖీలు చేసి వరి విత్తనాల శాంపిల్స్ తీసి ల్యాబుకు పంపతామన్నారు.

పొగాకు సాగు నియంత్రించకుంటే కష్టాలే

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న సీజన్‌లో రైతులు పొగాకు సాగుని నియంత్రించుకోకుంటే కష్టాలు, నష్టాలు తప్పవని బోర్డు అధికారులు హెచ్చరించారు. కందుకూరులోని రెండు వేలం కేంద్రాల పరిధిలోని రైతులకు పొగాకు పంట దిగుబడి, అంతర్జాతీయ పరిస్థితులపై అవగాహన కోసం దూబగుంట సమీపంలోని వేలం కేంద్రంలో సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారులు కిరణ్, చంద్రశేఖర్‌లతో పాటు పొగాకు బోర్డు ప్రాంతీయ కార్యాలయం నుంచి అధికారిణి ఎం. తులసి, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

చిన్నారులు, మహిళల ఆరోగ్య పరిపుష్టే లక్ష్యం

● టీ.అరుణ, ఉలవపాడు సీడీపీవో



ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిశానిర్దేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతో గర్భవతులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత లోపం అరికట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ఉలవపాడు ఐసీడీఎస్ సీడీపీవో టీ.అరుణ తెలిపారు.

?: ప్రాజెక్టు పరిధిలో ఎన్ని అంగన్‌వాడీ సెంటర్లు పనిచేస్తున్నాయి.

!: ఉలవపాడు ఐసీడీఎస్ సెంటర్ పరిధిలో లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాలు ఉండగా, 183 అంగన్‌వాడీ సెంటర్లు పనిచేస్తున్నాయి.

?: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఉద్దేశం

!: ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో ఎస్టీల జనాభా అధికంగా ఉంది. వీరిలో ఎక్కువగా రక్తహీనత ఉన్న బాలింతలు, గర్భవతులు, పిల్లలు ఉంటారు. వీరికి రాగిపిండి, అటుకులు, వేరుశనగ చిక్కీ, ఎండు కర్జూరం, పాలు, 25గుడ్లు ఇస్తుంది.

?: ఫ్రీ స్కూల్ ఎడ్యుకేషన్ అమలవుతుందా.

!: ప్రతినెలా 5వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

న్యూస్ బాక్స్

అధికారుల తీరు బాధాకరం

జలదంకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంచార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో జరిగిన జిల్లా అభివృద్ధి మండలి (డీడీఆర్‌సీ) సమావేశంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి అధికారులు తగిన గౌరవం ఇవ్వకపోవడం బాధాకరం అని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జలదంకి మాజీ వైస్‌ఎంపీపీ తల్లపనేని మధుసూదనరావు, మండల టీడీపీ నేత చేవూరి జనార్దన్‌రెడ్డిలు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. సమావేశానికి వచ్చిన మంత్రులకు బొకేలు ఇచ్చి ఎంపీ వేమిరెడ్డిని విస్మరించడం తగదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులదే అన్నారు.

మురుగును తొలగించండి

జలదంకి నవంబర్4 (ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవవీధిలో 150మీటర్లు దూరం రోడ్డు పల్లంగా మారి వర్షపునీరు ఒకటిన్నర అడుగులోతున నిల్వ చేరి మురుగుమయంగా మారిందని ఈ నీటిలో ప్రజలు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నేత రావి మాల్యాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆయన సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దారు ప్రమీలకు రావి మాల్యాద్రి వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి చొరవతో సోమవారం గోచిపాతల సంజయ్ బోగోలు పంచాయతీలోని బేతనీపేటలో నూతనంగా ఏడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. అలాగే విద్యుత్ తీగలను సరిచేయించారు. కార్యక్రమంలో మండల విద్యుత్ ఏఈ జడరయ్య ఆధ్వర్యంలో జేఎల్ఎం అఖిల్, స్థానిక టీడీపీ నేతలు ఫిలిప్, వినోద్, ఫెలోమెన్ ఉన్నారు.

ఏడీఈఎన్ తనిఖీలు

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని పలు చోట్ల ఏడీఈఎన్ రాజేంద్రప్రసాద్ తనిఖీలు సోమవారం చేశారు. బోగోలు ఎల్సీగేట్ 144 వద్ద రికార్డులను తనిఖీ చేసి గేట్ వద్ద ఉద్యోగితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే నార్త్ యాడ్‌లోని 150, 149, 148పాయింట్లను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు బిట్రగుంట సెక్షన్ పీడబ్ల్యూఐ కృష్ణన్, సిబ్బంది ఉన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలధారులకు ఎంఎస్ఎస్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో న్యాయవాది మాదాల మనోజ్‌కుమార్ నూతన వస్త్రాలు, మాలలను అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసంఘం సభ్యులు నలబోతుల మురళీ, చక్కా వెంకటకేశవ తదితరులు పాల్గొన్నారు.

సాలిపేట బీసీ కాలనీని పోర్టు పరిధిలో చేర్చాలి

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలంలోని సాలి పేట బీసీ కాలనీని రామాయపట్నం పోర్టు పరిధిలో చేర్చి పరిహారం అందజేయాలని పోర్టు నిర్వాసితుల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి వినతిపత్రం అందజేశారు.

కొండముచ్చు హల్‌చల్

కావలి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురంలో సోమవారం సాయంత్రం కొండముచ్చు హల్‌చల్ చేసింది. అడవుల్లో, కొండ ప్రాంతాల్లో చెట్లపై గెంతుతూ కనిపించే కొం డముచ్చు అడవి నుండి తప్పిపోయి జన వాసంలో కనిపించింది. స్థానికులు దీనికి పండ్లు, కూరగాయలు ఆహారంగా అందజేశారు.

అక్రమ కట్టడాల తొలగింపు

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బోగోలు ఇబ్రహీంపేట బజార్ల మధ్య ప్రైవేటు దుకాణాల స్థలంలో సోమవారం కొందరు చేపట్టిన నూతన నిర్మాణాలను రైల్వే అధికారులు అడ్డుకుని వాటిని కూల్చివేయించారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకున్నట్లు బిట్రగుంట రైల్వే ఐఓడబ్ల్యూ రాజేష్ తెలిపారు.